
మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సుగుణ మృతి


ఇరాన్ కొత్త ఆర్మీచీఫ్‌ను చంపిన ఇజ్రాయెల్

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 198 | బుధవారం | 18 -06-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


03

### ఆగస్టు 15 నాటికి న్యాయబద్ధమైన దరఖాస్తులన్నీ పరిష్కారం

- మంత్రి పొంగులేటి


03

### ఇన్సూరెన్స్ కంపెనీలకు.. ప్రతిపాదన ఉపసంహరించుకోవాల్సిందే

- తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ భారీ ధర్నా


12

### బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదు

- ఏపి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు




నరమేధం ఆపాలి

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- రాజకీయ పార్టీలు, పౌరహక్కులు, ప్రజాసంఘాల నేతలు ముక్తకంఠంతో డిమాండ్
- కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేంతవరకు ఉధృత ఉద్యమాలు
- ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో మహాధర్నా నిర్వహించాలని పలువురు ప్రతిపాదన

## పార్లమెంటులో లేవనెత్తుతాం : కాంగ్రెస్

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఆపరేషన్ కగార్' పేరుతో మధ్య భారతంలో కొనసాగిస్తున్న మానవ హననాన్ని తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, రాజకీయ పార్టీల నాయకులు, పౌరహక్కులు, ప్రజా సంఘాల నేతలు ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేంత వరకూ ఉద్యమాలను మరింత ఉధృతం చేయడంతో పాటు ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో మహాధర్నా నిర్వహించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తక్షణమే కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టు పార్టీతో బేషరతుగా శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ, 'శాంతి చర్చల కమిటీ' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్, ధర్నా చౌక్ వద్ద మంగళవారం మహా ధర్నా నిర్వహించారు. శాంతి చర్చల కమిటీ అధ్యక్షులు జస్టిస్ బి.చంద్రకుమార్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ జి. హరగోపాల్, కందిమళ్ళ ప్రతాపరెడ్డి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఆపరేషన్ 'కగార్' పేరుతో దండకారణ్యంలో కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న హత్యాకాండను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మహాధర్నా తీర్మానం చేసింది.

మహా ధర్నాలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, కాంగ్రెస్ ఎంపి అనిల్ కుమార్ యాదవ్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు

తరువాయి 2లో



# ఇజ్రాయెల్‌తో భారత్ తెగదెంపులు చేసుకోవాలి

- ఢిల్లీలో పాలస్తినా సంఘీభావ ప్రదర్శనలో వామపక్షాల డిమాండ్

**న్యూఢిల్లీ:** ఇజ్రాయెల్ దురాక్రమణకు, సామూహిక హత్యాకాండకు వ్యతిరేకంగా పోరాడుతున్న పాలస్తినా ప్రజలకు సంఘీభావం ప్రకటిస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వామపక్షాలు మంగళవారంనాడు ప్రదర్శన జరిపాయి. దాడులు చేస్తూ అక్కడి ప్రజలను అమానుష హింసకు గురిచేస్తున్న ఇజ్రాయెల్ చర్యలను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ), సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్), ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ ఎస్ పి, సిజిపిఐ పక్షాలన్నీ ఈ సంఘీభావ ప్రదర్శనలో పాల్గొన్నాయి. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా , సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య తదితర వామపక్ష అగ్రనేతలందరూ ప్రదర్శనను ఉద్దేశించి ప్రసంగించారు. గాజాలో 620 రోజులుగా ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న మారణకాండను బేషరతుగా నిలిపివేయాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి ఇటీవల ఆమోదించిన తీర్మానానికి భారత ప్రభుత్వం దూరంగా ఉండిపోవడాన్ని, ఈ సమస్యపై మౌనం పాటించడాన్ని ప్రదర్శకులు నిర్ద్వంద్వంగా ఖండించారు. ఇజ్రాయెల్‌తో భారత్‌కు ఉన్న అన్నిరకాల సైనిక, వ్యూహాత్మక సంబంధాలను తక్షణం తెగతెంపులు చేసుకోవాలని ప్రదర్శనలో ప్రసంగించిన నాయకులు ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్షాలు

తరువాయి 12లో



# గో సంరక్షణకు సమగ్ర విధానం

- వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో కమిటీ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- గోశాలల్లో గోవుల మృత్యువాతపై ఆవేదన
- గోవుల సంరక్షణపై సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో గో సంరక్షణకు సమగ్ర విధానం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లోని విధానాల అధ్యయనానికి ముగ్గురు అధికారులతో ఒక కమిటీని సిఎం నియమించారు. ఈ విషయంలో రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కూడిన కమిటీ లోతైన అధ్యయనం చేయాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో గో సంరక్షణపై సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం సాయంత్రం తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. మన సంస్కృతిలో గోవులకు ఉన్న ప్రాధాన్యం, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు గోవుల సంరక్షణే ప్రధానంగా విధానాల రూపకల్పన ఉండాలని సిఎం ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. భక్తులు గోశాలలకు పెద్ద సంఖ్యలో గోవులు దానం చేస్తున్నారని, స్థలాభావం, ఇతర సమస్యలతో అవి తరచూ మృత్యువాత పడుతున్నాయని సిఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఆ పరిస్థితులను



తరువాయి 2లో

# రెప్ప పాటు కూడా కరెంటు కోతల్లేవ్

- రాష్ట్రంలో విద్యుత్‌కు ఎంత ఖర్చైనా వెచ్చించేందుకు ప్రభుత్వం సిద్ధం
- అభివృద్ధి, సంక్షేమంలో జోడెద్దుల్లా దూసుకెళ్తుంది
- సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఉపముఖ్యమంత్రి భట్టి

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెద్దుల్లా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, డీసీసీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుతో కలిసి కొత్తపల్లిగోరి మండలం చెన్నాపూర్ గ్రామంలో నూతనంగా రూ.140 లక్షలతో నిర్మించిన సబ్ స్టేషన్ ను ప్రారంభించారు. అనంతరం మోరంచపల్లి నుండి మంజూరునగర్ వరకు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంజూరునగర్లో నవాబుపేట, ధర్మారావుపేట, మంజూరునగర్ గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం

తరువాయి 2లో



### మూడు ఎకరాల వరకు రైతు భరోసా జమ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా రెండవ దశ రైతు భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం రైతు ఖాతాల్లో మంగళవారం జమా చేసింది. 3 ఎకరాల వరకు ఉన్న రైతులందరి వారి వారి బ్యాంక్ ఖాతాలలోకి ఎకరానికి రూ.6 వేల చొప్పున రైతు భరోసా నిధులను జమ చేసినట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. 10.45 లక్షల మంది రైతులకు సంబంధించిన 25.86 లక్షల ఎకరాలకుగాను రూ.1551.89 కోట్లను జమ చేశామని వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా మిగిలిన వారందరికీ రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

# బనకచర్లకు సిడబ్ల్యుసి అనుమతులివ్వకుండా కార్యాచరణ రూపొందిస్తాం

- రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటన
- నేడు ప్రాజెక్టుపై లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో ప్రత్యేక సమావేశం
- కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలకు స్వయంగా ఆహ్వానం



ప్రజాపక్షం/హైదరాబాద్

'గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు'పై రాష్ట్రానికి చెందిన లోకసభ, రాజ్యసభ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని బుధవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొననున్న ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను అహ్వానించినట్లు ఆయన తెలిపారు. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టును మరింత గట్టిగా ప్రతిఘటించడంతో పాటు కేంద్ర జలసంఘం (సిడబ్ల్యుసి) అనుమతులు ఇవ్వకుండా ఒత్తిడి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ పథకాన్ని రూపొందిస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రత్యేక సమావేశానికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు స్వయంగా

తరువాయి 2లో

# 650 మంది కాంగ్రెస్ నేతల ఫోన్లు ట్యాప్

- గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంపై టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్ మండిపాటు
- దోషులకు కఠిన శిక్షలు పడాల్సిందేనని డిమాండ్
- 15 మంది బాధితులను విచారించిన సిట్
- వాంగ్మూలాల స్వీకరణ



ప్రజాపక్షం/హైదరాబాద్:ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ జోరుగా నడుస్తోంది. ఏడాది కాలం నుంచి ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉన్న విచారణ వారం రోజుల నుంచి ఎడతెరిపిలేకుండా సాగుతుంది. నిందితులు కేసు నుంచి తప్పించుకోకుండా ఉండేందుకు పక్కా సాక్ష్యాలను సిట్ అధికారులు సేకరించే పనిలో పడ్డారు.ఈ క్రమంలోనే సిట్ అధికారులు మంగళవారం 15 మంది బాధితుల నుంచి వాంగ్మూలం స్వీకరించారు. సాక్షులుగా వాంగ్మూలం ఇచ్చిన బాధితుల్లో టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, గద్వాల జడ్పి మాజీ ఛైర్‌పర్సన్, నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరితల కూడా ఉన్నారు. గాంధీభవన్‌లోని కొంత మంది స్టాఫ్ నుంచి కూడా సాక్ష్యాలను స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. సిట్ విచారణ అనంతరం మహేష్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ..గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీకి చెందిన 650 మంది నేతల ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. తమ ఫోన్లను ట్యాప్ చేసిందనే అనుమానంతోనే అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశామని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో టెలిగ్రాఫ్ చట్టాన్ని

తరువాయి 2లో

# నిలువు దోపిడీ

- ప్రైవేటు స్కూళ్ల ఇష్టారాజ్యం
- భారీగా అడ్మీషన్ ఫీజులు
- అధిక ధరలకు మెటీరియల్
- అర్హత లేని ఉపాధ్యాయులు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

విద్యా సంవత్సరం ప్రారంభమైందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో గుబులే. తమ పిల్లలను ప్రైవేటు బడుల్లో చదివించాలనుకునే వారిని ఫీజులు భయపెడుతున్నాయి. దానికి తోడు మెటీరియల్ పుస్తకాలు, యూనిఫాం, బ్యాగులు, నోటు బుక్స్ ఇలా ప్రతీదీ ఆ స్కూల్లోనే తీసుకోవాల్సి వస్తోంది. బడిలో చేరింది మొదలుకుని ఏడాది పూర్తయ్యే వరకు ఆ ఫీజులు, ఈ మెటీరియల్, ఎగ్జామ్ ఫీజ్ అదనం అంటూ యాజమాన్యాలు అందిన కాడికి దండుకుంటున్నాయి. ప్రైవేటు స్కూళ్ల ఇష్టారాజ్యంతో విద్యావ్యాపారం హెచ్చుమీరుతోంది. నియంత్రించాల్సిన అధికారులు ఏడాదికోసారి రెన్యూవల్స్ పేరిట ముడుపులు పుచ్చుకోవడంతో పాటు విద్యాహక్కు చట్టం అమలును కూడా పక్కకు పెడుతున్నట్లు తెలుస్తోంది. సామాన్యుల పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో చదివే పరిస్థితి లేదు. విద్య

తరువాయి 12లో



# కాల్పుల విరమణ కాదు నిజమైన ముగింపు కావాలి

- ప్రతి ఒక్కరూ టెహ్రాన్‌ను వదిలివెళ్లాలి
- సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ పోస్ట్
- జి–7 దేశాల 51వ శిఖరాగ్ర సదస్సుకు హాజరైన ట్రంప్ ఒకరోజు ముందుగానే అమెరికాకు పయనం

**వాషింగ్టన్ :** ప్రతిఒక్కరూ టెహ్రాన్‌ను వదిలి వెళ్ళిపోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారంనాడు తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో పోస్టింగ్ పెట్టారు. అయితే ప్రతి ఒక్కరూ ఎందుకు టెహ్రాన్‌ను వదిలివెళ్ళిపోవాలన్న ఆయన డిమాండ్‌కు సరైన కారణాన్ని మాత్రం ట్రంప్ చెప్పలేదు. ఇరాన్‌కు వ్యతిరేకంగా వెనకనుండి సహాయం చేస్తున్న అమెరికా నేరుగా యుద్ధంలో చేరుతుందన్న వదంతుల తరుణంలో ట్రంప్ ప్రకటన అనుమానాస్పదంగా మారింది. కెనడాలో జి–7 దేశాల 51వ శిఖరాగ్ర సదస్సుకు హాజరైన ట్రంప్ నిర్ణీత సమయానికి ఒకరోజు ముందుగానే సదస్సునుండి హడావుడిగా బయలుదేరి అమెరికాకు వెళ్ళిపోయారు. కెనడా నుండి తిరిగివస్తూ విమానంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇరాన్‌తో కాల్పుల విరమణకు తాను ప్రయత్నం చేయడం లేదని, యుద్ధానికి నిజమైన ముగింపు (రియల్ ఎండ్) పలికేందుకు ప్రయత్నం చేస్తున్నానని, అణు ఒప్పందానికి

తరువాయి 12లో





# ప్రపంచం

WORLD NEWS

## ఉక్రేన్‌పై రష్యా దాడులు

### తొమ్మిది అంతస్తుల భవనం ధ్వంసం : 15 మంది మృతి

**కీవ్ :** ఉక్రేన్‌పై రష్యా చేసిన డ్రోన్ల దాడిలో తొమ్మిది అంతస్తుల నివాసిత భవనం ధ్వంసమైంది. దాడుల్లో 15 మంది మరణించారు. మృతుల్లో ఒక అమెరికా పౌరుడు కూడా ఉన్నారు. మరో 116 మంది గాయపడ్డారు. మంగళవారంనాడు తెల్లవారకముందే రష్యా క్షిపణులు, డ్రోన్లు కీవ్‌పై దాడి చేశాయి. నివాసిత ప్రాంతాలపై జరిగిన ఈ దాడుల్లో ఉక్రేన్ ప్రజలు నిద్రలోనే మరణించారు. నగరంలో అనేకచోట్ల భారీ పేలుళ్ళు సంభవించాయని, అనేకమంది మరణించారని కీవ్ సిటీ మిలిటరీ పాలనాధిపతి తైమూర్ తకచెంకో చెప్పారు. రాజధాని నగరంపై రష్యా చేసిన అతి దారుణమైన దాడుల్లో ఇది కూడా ఒకటి అని ఆయన చెప్పారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఈ దాడులను తీవ్రంగా ఖండించారు. రష్యా 32 క్షిపణులను, 440 డ్రోన్లను తమ రాజధాని నగరంపై ప్రయోగించిందని, ఇది అతితీవ్రమైన విధ్వంసకరమైన దాడి అని జెలెన్స్కీ అన్నారు. దాదాపు తొమ్మిది గంటలపాటు ఈ దాడులు కొనసాగాయి. కెనడాలో జి–7 సదస్సులో పాల్గొనేందుకు ఆయన వెళ్ళాల్సి ఉంది. మంగళవారంనాడు కూడా ఈ సదస్సు జరుగుతుంది. మొత్తం 27 ప్రాంతాలపై కీవ్‌లో రష్యా దాడులు చేసిందని చెప్పారు.

# ఇరాన్ కొత్త ఆర్మీచీఫ్‌ను చంపిన ఇజ్రాయెల్



**టెల్‌అవీవ్ :** ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య ఐదో రోజు యుద్ధంలో వ్యూహాత్మక ప్రదేశాలపై పరస్పర సైన్యాలు దాడులు చేసుకున్నాయి. ఐదు రోజుల యుద్ధంలో ఇరాన్ 550 ఇజ్రాయెల్ లక్ష్యాలపై దాడులు చేసింది. కానీ మంగళవారంనాడు యుద్ధంలో పైచేయి సాధించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించుకుంది. ఇరాన్ సర్వాధినేత ఆయెతుల్లా అలీ ఖమేనీకి అత్యంత ఆప్తుడైన, ఇరాన్ టాప్ కమాండర్ కొత్త ఆర్మీ ఛీఫ్ జనరల్ అలీ షాద్మానీని దాడుల్లో హతమార్చినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. గడచిన శుక్రవారం జూన్ 13వ తేదీన ఇజ్రాయెల్ మొదటిరోజు మెరుపు దాడులు చేసినప్పుడు ముగ్గురు అత్యున్నతస్థాయి ఇరాన్ ఆర్మీ కమాండర్లతోపాటు తొమ్మిదిమంది అణుశాస్త్రవేత్తలు మరణించారు. ఆ తర్వాత ఖమేనీ కొత్త జనరల్‌గా అలీ షాద్మానీని నియమించారు. తాజా దాడుల్లో షాద్మానీని కూడా హతమార్చినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. ఖతమ్ ల్–అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్‌లో ఐఆర్‌జిసి అధిపతిగా షాద్మానీని ఇటీవల బాధ్యతీసుకున్నారు. ఐతే షాద్మానీ మరణాన్ని ఇరాన్ ఇంకా ధృవీకరించలేదు. ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీలో షాద్మానీ ఒక సైనిక జనరల్. సెంట్రల్ టెహ్రాన్‌లో చేసిన దాడుల్లో ఆయన మరణించినట్లు ఐడిఎఫ్ ప్రకటించింది. చొచ్చుకువెళుతున్న ఇజ్రాయెలీ క్షిపణులు 2,300 కి.మీ ఇరాన్‌లో లోపలికి వెళ్ళాయని, దీనితో ఆయెతుల్లా అలీ ఖమేనీ రహస్య బంకరులో దాక్కున్నారని ఐడిఎఫ్ ప్రకటించింది. ఐఆర్‌జిసి (ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్) ఇంటిలిజెన్స్ చీఫ్‌తోపాటు మరో నలుగురు ఇంటిలిజెన్స్ అధికారులను కూడా ఇజ్రాయెల్ సోమవారంనాడు దాడుల్లో చంపింది. ఇరాన్ బ్యాంకింగ్ వ్యవస్థపై కూడా సైబర్ దాడులు చేసింది. తొలుత ఇరాన్ ప్రభుత్వ టీవీ ప్రధాన కేంద్రంపై కూడా దాడి చేసింది. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్‌ను అదుపు చేయకపోతే మరింత దారుణమైన పరిణామాలను చవిచూడాల్సి వస్తుందని అమెరికాకు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ హెచ్చరిక చేశారు. ఇజ్రాయెల్‌పై చేస్తున్న దాడులు ఆత్మరక్షణ కోసమేనని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమిర్ సయాద్ ఇరవని చెప్పారు. శుక్రవారం నుండీ ఇప్పటివరకూ నాలుగు రోజులుగా ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 224 మంది మరణించారని, 1277 మంది గాయపడ్డారని ఇరాన్ ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్ ఒక ప్రకటన చేస్తూ ఇరాన్‌పై భారీ దాడులు కొనసాగిస్తున్నామని పేర్కొంది.

**45 మంది పాలస్తీనియన్లు మృతి**

ఒకవైపు ఇరాన్‌లో యుద్ధంపై అందరూ దృష్టిసారించిన తరుణంలో ఇజ్రాయెల్ గాజాలో దారుణ అమానుష చర్యలు కొనసాగిస్తోంది. మంగళవారంనాడు కూడా ఆహారంకోసం ఎదురుచూస్తున్న పాలస్తీనా ప్రజలపై కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో 45 మంది మరణించారు. ఆహార సహాయం కేంద్రం వద్ద ప్రజలు గుంపులుగా ఎదురుచూస్తున్న సమయంలో ఐడిఎఫ్ సైన్యం ప్రజలపై కాల్పులు జరిపింది. అనేకరోజులుగా ఐడిఎఫ్ ఈ విధంగా ఆహారంకోసం వెంపర్లాడుతున్న పాలస్తీనా ప్రజలను అమానుషంగా కాల్చి చంపుతున్నది.

# గగనతల యుద్ధంలో ఆరితేరిన ఇజ్రాయెల్

### ఇరాన్ వద్ద చురుకైన సైనిక బలగాలు



టెల్‌అవీవ్ : ఇరాన్‌ను చాలా సులభంగా గెలుస్తామని నేతన్యాహూ కలలు కంటున్నారు. ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన గగనతల సైనిక బలం ఇజ్రాయెల్‌కు ఉందన్నది సర్వత్రా వినిపించే విషయం. ఇజ్రాయెల్ గడచిన ఐదు రోజులుగా ఇరాన్ అణుస్థావరాలనే లక్ష్యంగా చేసుకుంది. ఇంధన కేంద్రాలను, శాస్త్రవేత్తలు లక్ష్యంగా దాడులు చేస్తోంది. తూర్పు ఇరాన్ ప్రాంతంలోని మష్హాద్ విమానాశ్రయంలో ఇంధనం నింపుకుంటున్న విమానంపై ఇజ్రాయెల్ తాజా దాడులు చేసింది. ఇజ్రాయెల్ హై–టెక్ ఆయుధాలను ఉపయోగిస్తుండగా ఇరాన్ మాత్రం ఆక్షలు అమలులో ఉన్న కారణంగా పాతకాలకు యుద్ధ ఆయుధాలను, వాహనాలనే ఉపయోగిస్తున్నది. జనాభాపరంగా చూస్తే ఇరాన్‌కు ఉన్న బలం ఇజ్రాయెల్‌కు లేదు. ఇరాన్‌లో తొమ్మిదికోట్లమంది ప్రజలు ఉన్నారు. ఇజ్రాయెల్ దేశం మొత్తం మీద ఉన్నది కోటి మంది జనాభా మాత్రమే. అందువల్ల ఇజ్రాయెల్ హై–టెక్ ఆయుధాలతో ఇరాన్‌ను దెబ్బతీస్తున్నది. ఇజ్రాయెల్ కంటే ఇరాన్ వద్ద ఎక్కువగా యుద్ధ ట్యాంకులు, పదాతిదళ సమూహాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ నుండి ఇరాన్‌కు ప్రధానంగా గగనతలమార్గంలోనే దాడులు ఎక్కువగా ఎదురవుతున్నాయి. గగనతల యుద్ధంలో ఇజ్రాయెల్ ఆరితేరింది. ఇరాన్–ఇజ్రాయెల్ దేశాలకు బలమైన సైన్యాలున్నప్పటికీ, ఇరాన్ వద్దనే చాలా చురుకైన సైనిక బలగాలున్నాయి. సెంట్రల్ ఇరాన్‌లో ఉన్న భూతలం నుండి భూతలంపైకి ప్రయోగించే క్షిపణి కేంద్రాలను ధ్వంసం చేసేందుకు తమ గగనతల బలగాలు దృష్టి కేంద్రీకరించాయని ఇజ్రాయెల్ ప్రకటించింది. రాకెట్ లాంఛెర్లను ఇజ్రాయెల్ ధ్వంసం చేస్తున్నది. దీనివల్ల రాకెట్లు ఉన్నాగానీ ఇరాన్ ప్రయోగించలేని పరిస్థితి వస్తుంది. అదేసమయంలో ఇరాన్ వద్ద ఇజ్రాయెల్‌కు చెందిన ఫైటర్ జెట్‌లను ధ్వంసం చేయగల సామర్థ్యం, నైపుణ్యం ఉన్నప్పటికీ, ఆంక్షలవల్ల ఇరాన్ అత్యాధునికమైన ఆయుధ వ్యవస్థలను సమకూర్చుకోలేకపోయింది.

ఇరాన్ వద్ద ఉన్న ఖండాంతర క్షిపణులను, క్రూయిజ్ క్షిపణులను కనిపెట్టగల శక్తిసామర్థ్యాలు ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ సమకూర్చుకుంది. అమెరికా అండదండలవల్లనే ఇజ్రాయెల్ ఈ శక్తిని సమకూర్చుకుంది. దీనికితోడు ఇప్పుడు మధ్యప్రాచ్యం దిశగా అమెరికా యుద్ధనౌకలు తరలివస్తున్నాయి. ఇజ్రాయెల్‌కు ఐరన్‌డోమ్‌తోపాటు తన గగనతల వ్యవస్థను కాపాడుకునేందుకు బహుముఖవలయాల రక్షణ వ్యవస్థను సమకూర్చుకుంది. గురిచూసి దెబ్బతీసేందుకు వీలైన గగనతల ఆధునిక వ్యవస్థను కూడా ఇజ్రాయెల్ సమకూర్చుకుంది. కానీ ఇరాన్ వద్ద వేలాదిసంఖ్యలో ఖండాంతర క్షిపణులు, క్రూయిజ్ క్షిపణులు ఉన్నాయి. వీటిని అవలీలగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఎక్కుపెట్టగలదు.

అందుకే సుదీర్ఘకాలం యుద్ధం చేయడానికి కూడా తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని ఇరాన్ సోమవారంనాడు ప్రకటించింది. ఇరాన్ వద్ద చాలా పరిమితసంఖ్యలోనే యుద్ధ విమానాలు ఉన్నాయి. ఈ విమానాలలో చాలా వరకూ 1979వ దశకంలో రివల్యూషన్ కాలంలో సమకూర్చుకున్నవే. అదేసమయంలో ఇజ్రాయెల్‌కు అమెరికా నుండి సరికొత్త అడ్వాన్స్‌డ్ బహుళప్రయోజనాలకు ఉపయోగపడే ఎఫ్–15, ఎఫ్–165 ఫైటర్ జెట్స్ సమకూరాయి. ఇరాన్ గనుక కొత్త యుద్ధ విమానాలు సమకూర్చుకోవాలంటే దాదాపు నాలుగు దేశాల గగనతలాలు దాటి రావాలి. ఆలోనే వాటిని అమెరికా మిత్రబలగాలు కూల్చివేసే ప్రమాదం, అనుమతి నిరాకరణ ప్రమాదం పొంచిఉన్నాయి.

# అణ్వాయుధాలు లేని జోన్‌గా మధ్యప్రాచ్యం

### ఐఎఇఎలో స్పష్టం చేసిన చైనా



**వియన్నా :** ఇరాన్ అణుసమస్యకు రాజకీయ, దౌత్యపరమైన మార్గంలోనే పరిష్కారం లభిస్తుందని అంతర్జాతీయ అణు ఇంధన నిఘా సంస్థ ((ఐఎఇఎ) పేర్కొంది. వియన్నాల్లో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఐఎఇఎ నిర్వహించింది. మధ్యప్రాచ్యంలో పరిణామాలపట్ల ఐఎఇఎ సభ్యదేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. మధ్యప్రాచ్యంలో ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య దౌత్యమార్గ పరిష్కారమే మిగిలి ఉందని సభ్యదేశాలు పేర్కొన్నాయి. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదనీ, ఐతే తమ దేశాన్ని కాపాడుకునే హక్కు ఇరాన్‌కు ఉందని సభ్యదేశాలు పేర్కొన్నాయి. మధ్యప్రాచ్యాన్ని అణ్వాయుధాలతోపాటు ఇతర విధ్వంసకర ఆయుధాలు లేని శాంతిమండలంగా తీర్చిదిద్దాలన్న ప్రతపాదనకు చైనా మద్దతు ఇచ్చింది. సమావేశంలో పాల్గొన్న ఐఎఇఎలో చైనా శాశ్వత ప్రతినిధి లీ సోంగ్ మాట్లాడుతూ, ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయెల్ దాడులు ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించినట్లేనన్నారు. ఈ విధమైన దాడులు రాజకీయ, దౌత్యపరమైన చర్చల ప్రక్రియకు విలువలేకుండా చేస్తాయన్నారు. మధ్యప్రాచ్యంలో అసాధారణంగా పెరిగిపోయిన ఉద్రిక్తతలు ఏ ఒక్కదేశ ప్రయోజనాలకు ఉపయోగపడవన్నారు.

### డిసెంబరు 4న ఐక్యరాజ్యసమితి ‘ఏకపక్ష నిర్బంధ చర్యల’ వ్యతిరేక దినం

**న్యూయార్క్ :** ఇకమీదట ప్రతి సంవత్సరం డిసెంబరు నాలుగో తేదీని అంతర్జాతీయ ‘ఏకపక్ష నిర్బంధ చర్యల’ వ్యతిరేక దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి పాటిస్తుంది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఈ మేరకు మంగళవారంనాడు ఒక తీర్మానం చేసింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 116 దేశాలు ఓటు వేశాయి. 51 దేశాలు వ్యతిరేకించాయి. మరో 6దేశాలు తీర్మానానికి దూరంగా ఉండిపోయాయి. ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా, జపాన్, అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలు ఈ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశాయి. అంతర్జాతీయ చట్టాలకు, ఐక్యరాజ్యసమితి ఛార్టర్‌కు విరుద్ధమైన ఏకపక్ష ఆర్థిక, వాణిజ్య చర్యలను అమలు చేయడం లేదా వాటిని స్వీకరించడం వంటి చర్యలు తీసుకోవద్దని ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్నదేశాలు ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని ఈ తీర్మానంలో జనరల్ అసెంబ్లీ కోరింది. ఈ మేరకు తీర్మానం ఆమోదం పొందింది.

# ఖమేనీకి సద్దాం హుస్సేన్ గతే

### ఇజ్రాయెల్ హెచ్చరిక

ఇరాక్ సైనిక నియంత సద్దాం హుస్సేన్ తరహాలోనే ఇప్పుడు ఇరాన్ సర్వాధినేత ఆయెతుల్లా అలీ ఖమేనీ ప్రాణాపాయంలో ఉన్నారని ఇజ్రాయెల్ రక్షణశాఖామంత్రి ఇజ్రాయెల్ కట్జ్ హెచ్చరిక చేశారు. అమెరికాసైన్యం దాడి చేసినప్పుడు సద్దాం హుస్సేన్ భూగర్భడ్రైనేజీలో దాక్కుని ఉండగా ఆయన్ను పట్టుకున్నారు. తర్వాత ఉరితీశారు. సద్దాంహుస్సేన్‌కు పట్టిన గతే ఖమేనీకి కూడా పడుతుందని, తొలుత ఆయన ప్రభుత్వాన్ని కూల్చివేసి ఆ తర్వాత ఆయనను ఉరితీస్తామని ఇజ్రాయెల్ కట్జ్ అన్నారు. ఇజ్రాయెల్ మిలిటరీ, సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులతో సమావేశం సందర్భంగా కట్జ్ మంగళవారంనాడు ఈ హెచ్చరిక చేశారు. “ఇజ్రాయెల్‌పైకి క్షిపణులు ప్రయోగించవద్దు, యుద్ధనేరాలను కొనసాగించవద్దు, 1980వ దశకంలో ఇరాన్ పొరుగుదేశం ఇరాక్‌లో ఏం జరిగిందో గుర్తుచేసుకోండి, సద్దాం హుస్సేన్‌కు పట్టినగతే ఖమేనీకీ పడుతుంది” అన్నారు. 2003లో అమెరికా సైన్యం దాడి చేసిన తర్వాత సద్దాంహుస్సేన్ ప్రభుత్వం కుప్పకూలింది. ఆయన పారిపోయి రహస్యంగా దాక్కున్నాడు. తర్వాత అమెరికా సైన్యానికి దొరికిపోయాడు.

**ఇజ్రాయెల్ మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడంలేదు : రష్యా**

మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని విస్తరించాలనే ఇజ్రాయెల్ కోరుకుంటున్నదని, మధ్యవర్తిత్వాన్ని,యుద్ధ పరిష్కారాన్ని కోరుకోవడంలేదని రష్యా విమర్శించింది. మధ్యవర్తిత్వం చేయడానికి రష్యా సిద్ధంగా ఉందని తెలిపింది. ఇరాన్‌పై దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ మాట్లాడుతూ, రెండు దేశాలూ సహనం పాటించాలని పిలుపు ఇచ్చారు. కానీ చుట్టూ ఏం జరుగుతోందో తెలియని అగమ్యగోచర పరిస్థితి ఏర్పడిందన్నారు. కానీ ఇజ్రాయెల్ మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడంలేదని, శాంతియుత పరిష్కారానికి సిద్ధంగా లేదన్నారు.

## కార్యాచరణ రూపొందిస్తాం(మొదటి పేజీ తరువాయి)

అహ్వానించినట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న లోక్‌సభ సభ్యులు, రాజ్యసభ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై రాష్ట్ర సిఎం రేవంత్‌రెడ్డి, తాను 2025 జూన్ 3న న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌ను స్వయంగా కలసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అభ్యంతరాలను లేవనెత్తిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అందుకు ప్రతిగా స్పందించిన కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్ స్పందిస్తూ 2025 మే 28న తనకు రాసిన లేఖలో గోదావరిబనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్ కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటివరకు అందలేదని చెబుతూనే అది అందిన తరువాత నీటి కేటాయింపులలో ప్రస్తుతం ఉన్న మార్గదర్శకాలు, ట్రిబ్యునల్ తీర్పులు, అంతర్‌రాష్ట్ర ఒప్పందాలతో పాటు 2014 ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టాలను పరిగణనలోకి తీసుకున్నాకే సమీక్షిస్తామన్నారు. 2025 జూన్ 13న తిరిగి తాను కేంద్ర జలశక్తి మంత్రికి రాసిన లేఖలో గోదావరిబనకచర్ల లింక్ పథకంపై అభ్యంతరాలను తెలియజేశామన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతులను కేంద్ర జల సంఘం నిలువరించాలని డిమాండ్ చేసిన విషయాన్ని ఆయన ఉటంకించారు. భవిష్యత్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై బుధవారం సచివాలయంలో లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

## కరెంటు కోతల్లేవ్

**(మొదటి పేజీ తరువాయి)**

అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో కరెంటు ఎంత అవసరం ఉన్న ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే కరెంటు ఉండదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేశాయని,గతంతో పోలిస్తే 2,000 మెగావాట్ల అదనపు డిమాండ్ వచ్చిన రాష్ట్రంలో ఒక్క నిమిషం అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు.

ఉచిత విద్యుత్ పథకాల కోసం రాష్ట్ర ప్రజల పక్షాన ప్రభుత్వం ప్రతి సంవత్సరం 13,992 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. రూ.22,500 కోట్లు ఖర్చు చేసి 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించబోతున్నామని తెలిపారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి, కనీసం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. మేం అధికారంలోకి రాగానే ఏడాదిన్నర కాలంలో 57 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 30 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయబోతున్నామన్నారు. కాలేశ్వరం పేరిట రాష్ట్ర సొమ్ము దోపిడీ చేసి సిగ్గు లేకుండా బ్రహ్మాండమని చెబుతున్నారు. అత్యంత ప్రమాదకరం, డిజైన్ కు కట్టిన దానికి పొంతనలేదని ఎన్‌డిఎస్‌ఎ చెప్పిందని అన్నారు.

1,20,000 కోట్ల ఖర్చు చేసి ప్రాజెక్టు నిర్మిస్తే కుంగిపోయిందని అన్నారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కట్టిన నాగార్జున సాగర్,శ్రీరామ్ సాగర్, జూరాల ఎల్లంపల్లి ప్రాజెక్టులకు చిన్న పగులు కూడా రాలేదన్నారు. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను అందించేందుకు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని 8 మండలాలకు ఏ ఈ ఆఫీసుల,జిల్లా కేంద్రంలో పవర్ సరఫరా కేంద్రం, దుబ్బపల్లి, పరశురంపల్లి సింగరేణి ప్రభావిత గ్రామాలను తరలించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరగా ఉప ముఖ్యమంత్రి వెంటనే హామీని అమలు చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, సింగరేణి జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయ లక్ష్మి, ఆర్‌డిఒ రవి, మార్కెట్ చైర్మన్‌లు జి.కిష్టయ్య, గుమ్మడి శ్రీదేవి, ఆర్‌టిఎ మెంబెర్ సుంకరి రాంచెంద్రయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పుప్పాల రాజేందర్, యువ జన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్,అప్పం కిషన్, నాయకులు పాల్గొన్నారు.

## సమగ్ర విధానం (మొదటి పేజీ తరువాయి)

అధిగమించి గోవుల సంరక్షణే ధ్యేయంగా తొలుత రాష్ట్రంలోని నాలుగు ప్రదేశాల్లో అత్యాధునిక వసతులతో గోశాలలు నిర్మించాలని సిఎం సూచించారు. ప్రముఖ దేవస్థానాల ఆధ్వర్యంలో కోడె మొక్కులు చెల్లించే వేములవాడ, యాదగిరిగుట్ట, హైదరాబాద్ నగర సమీపంలోని ఎనికేపల్లి, పశు సంవర్ధక శాఖ విశ్వ విద్యాలయం సమీపంలో విశాల ప్రదేశాల్లో తొలుత గోశాలలు నిర్మించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. భక్తులు అత్యధిక భక్తిశ్రద్ధలతో సమర్పించే కోడెల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనపర్చాలని సిఎం సూచించారు. వేములవాడ సమీపంలో వంద ఎకరాలకు తక్కువ కాకుండా గోశాల ఉండాలని సిఎం తెలిపారు. గో సంరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి వ్యయానికైనా వెనుకాడదని సిఎం స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రంలో గోశాలల నిర్వహణకు సంబంధించిన అప్రోచ్ పేపర్‌ను అధికారులు సిఎంకు అందజేశారు. సమావేశంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, సిఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతి చర్చలు జరపాలి

**(మొదటి పేజీ తరువాయి)**





కె.జి.రామచందర్, ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ రాజా, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జె. జానకిరాములు, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న, ఎస్‌యుసిఐ (సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మురహరి, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక మండలి ఛైర్మన్ వెన్నెల గద్దర్, విసికె నాయకులు జిలకర శ్రీనివాస్, భారత్ బచావో ఆల్ ఇండియా నాయకులు డాక్టర్ ఎం. ఎఫ్. గోపీనాథ్, పౌరహక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) నాయకులు ఎస్. జీవన్ కుమార్, అరుణోదయ నాయకులు విమలక్క, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య, టిఎస్‌డిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ ఎ.వినాయక రెడ్డి,తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు బెల్లంనగేష్ తదితరులు ప్రసంగించారు.

**అంతంచేసే అధికారం ఎవరిచ్చారు : కూనంనేని**

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ గోద్రా ఘటనకు సంబంధించి ఈ దేశ రాజ్యాంగ బద్దంగా ఏర్పడిన చట్టాల ద్వారా ముద్దాయిగా పేర్కొనబడ్డ వారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు అయితే, ఈ దేశంలోని అణగారిన వర్గాల కోసం సర్వస్వం త్యాగం చేసి ఉద్యమాలు చేస్తున్న వారు మావోయిస్టులు అని కూనంనేని సాంబశివరావు అన్నారు. మావోయిస్టులు తప్పు చేస్తే రాజ్యాంగ బద్దంగా చట్ట ప్రకారం శిక్షించాలి తప్ప భౌతికంగా అంతం చేసే అధికారం మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. గతంలో ఫ్యూడల్ వ్యవస్థకు కార్పొరేట్ వ్యవస్థకు ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షాలు కాపలా కుక్కలుగా కొమ్ము కాస్తున్నారని ధ్వజమెత్తారు.

**తక్షణమే చర్చలు జరపాలి : నారాయణ**

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ మావోయిస్టుల నేరుగా చూడడం కాదు.. వారి శవాలను చూస్తేనే భయపడే పిరికి పందలు ఈ పాలకులని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల ముక్త్ భారత్ కాదు.. త్వరలోనే అమిత్ షా ముక్త్ భారత్ ఉద్యమాలు రాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్‌లో వెల్లువెత్తిన ప్రజా ఉద్యమాలతో అక్కడ పాలకులకు ఏ గతి పట్టిందో కేంద్ర పాలకులు గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

**పార్లమెంట్‌లో లేవనేత్తుతాం : ఎంపి మల్లు రవి**

మల్లు రవి మాట్లాడుతూ హింకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమన్నారు. బస్తర్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం జరుపుతున్న ఆదివాసీల హననాన్ని, అంతర్‌యుద్ధాన్ని వెంటనే ఆపివేయాలని, తక్షణం కాల్పుల విరమణను ప్రకటించి, పేదల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో కేంద్రం శాంతి చర్చలు జరపాల్సిందేనని, స్పష్టం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే దృష్టికి తీసుకు వెళ్లడంతో పాటు పార్లమెంట్‌లో లేవనెత్తి శాంతి చర్చలు జరిగే కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అలాగే టిపిసిసి అధికార ప్రతినిధి చెనగాని దయాకర్ మాట్లాడుతూ ఈ అంశంపై ఢిల్లీ రాంలీలా మైదానంలో పెద్ద ఎత్తున ఉద్యమం జరగాలని సూచించారు.

**రైతు ఉద్యమం తరహాలో ఉద్యమించాలి : తమ్మినేని**

సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ తమ అధికారానికి, రాజకీయ నిరంకుశ్వతానికి ఎదురు నిలిచే ప్రతి ఒక్కరిని అంతమొందించడమే బిజెపి లక్ష్యమన్నారు. కమ్యూనిజాన్ని అంతం చేయాలని బిజెపి రక్తంలో, సిద్ధాంతంలోనే ఉందని, దీనిని అడ్డుకోవడానికి సైద్ధాంతిక పరమైన యుద్ధం కూడా చేయాల్సిన అవసరముందని వీరభద్రం సూచించారు. ఆపరేషన్ కగార్‌పై రైతు ఉద్యమం తరహాలో ఢిల్లీలో పౌర ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**మావోయిస్టులు దొంగలు, దోపిడీదారులు కాదు : కోదండరామ్**

టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ మాట్లాడుతూ అడవిలో ఉండి పోరాడుతున్న మావోయిస్టులు దొంగలు, దోపిడీదారులు కాదని, వారు ఒక సామాజిక సమస్య పరిష్కారానికి పోరాటం చేస్తున్నారని వివరించారు.

అలాంటి శక్తులతో చర్చించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉన్నదని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తేనే రాజకీయ ఉద్యమాలకు పరిష్కారం దొరుకుతుందని, కానీ కేవలం హింస మాత్రమే ఇటువంటి సమస్యలకు పరిష్కారం అని భావిస్తే అది అవివేకమే అని అన్నారు.

**మూల సమస్యలను పరిష్కరించాలి : దాసోజు శ్రవణ్**

బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ ప్రశ్న నుంచి పుట్టిందే నక్సలిజమని, ఆ సమస్య ఎక్కడ తీవ్రత ఉంటుందో, అక్కడ తప్పకుండా తిరుగుబాటు ఉంటుందన్నారు. మూల సమస్యలను పరిష్కరించకుండ దుర్మార్గమైన దాష్టీకానికీ పాల్పడడం మానవత్వానికే తీరని మచ్చ అని దుయ్యబట్టారు.

ప్రముఖ సినీనటులు ఆర్.నారాయణ మూర్తి మాట్లాడుతూ పదే పదే తమది రామరాజ్యమని, తాము రామభక్తులమని చెబుతున్న ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు, రామ,రావణ యుద్ధంలో అలసిపోయిన రావణుడిని విశ్రాంతి తీసుకుని, ఆ మరుసటి రోజు యుద్ధానికి రావాలని రాముడు సూచించారని విషయాన్ని మోదీ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. తాము చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టులను కక్ష కట్టి, చుట్టిముట్టి చంపేస్తున్న ప్రధానిమోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలు రామ భక్తులు, హిందువులు ఎలా అవుతారని నిలదీశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మరి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హింసకు పాలడ్పడం గర్హనీయమన్నారు.


జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ గడిచిన 11 ఏళ్లలో బిజెపి పాలకులు తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్రప్రభుత్వం శాంతి చర్చలు జరపకపోతే వారు నష్టపోయేది ఏమీ లేదన్నారు. ఆదివాసీల కోసమైన కేంద్రం తక్షణమే శాంతి చర్చలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాదగోని రవి మాట్లాడుతూ, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి తరపున ఢిల్లీలో ఉద్యమించేందుకు సిపిఐ నాయకులు నారాయణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ఫోన్లు ట్యాప్

**(మొదటి పేజీ తరువాయి)**

తుంగలో తొక్కి తమ ఫోన్లను ట్యాప్ చేశారని ఆరోపించారు. ‘రాజకీయ నాయకుల ఫోన్లు ట్యాప్ చేయడం చాలా నీచమైన చర్య. ఇలాంటి పనికి పాల్పడిన కెసిఆర్,కెటిఆర్ సిగ్గుతో తలదించుకోవాలి‘ అని ఆయన తీవ్రంగా విమర్శించారు. ‘కుంభం అనిల్ కుమార్ యాదవ్, గాలి అనిల్‌తో పాటు అనేకమంది ఫోన్లు ట్యాప్ అయినట్లు వెలుగులోకి వచ్చింది. ఇవన్నీ గమనిస్తే, నాడు అధికారాన్ని ఏ విధంగా దుర్వినియోగం చేసి దుశ్చర్యలకు పాల్పడ్డారో స్పష్టమవుతోంది‘ అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన కొందరు అధికారులు, రాజకీయ నాయకులకు దాసోహమై వారి ఆదేశాలను పాటించారని విమర్శించారు. వ్యక్తిగత గోప్యత అనేది తమ ప్రాథమిక హక్కు అని, దానిని కూడా కాలరాశారని అన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా, రిటైర్డ్ అయిన ప్రభాకర్‌రావును ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించి ఇలాంటి తప్పుడు పనులకు పాల్పడ్డారని మహేశ్ కుమార్ గౌడ ఆరోపించారు. ‘నక్సలైట్లకు సానుభూతిపరులుగా ఉన్నారని మమ్మల్ని ట్యాప్ చేయడం సిగ్గుచేటు. తమ ఫోన్లు ట్యాప్ చేసి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించారని, అందుకు వారు కచ్చితంగా శిక్షార్హులని అన్నారు. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి దిగజారుడు పనులకు పాల్పడకుండా ఉండాలంటే, ఈ కేసులో దోషులకు కఠిన శిక్షలు పడాల్సిందేనని ఆయన డిమాండ చేశారు. ఇలాంటి చర్యలకు ఒడిగట్టిన ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు కూడా శిక్ష విధించాలని కోరారు. ఈ కేసు విచారణ సజావుగా జరిపి, బాధ్యులైన రాజకీయ నాయకులు, అధికారులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

# మహేష్‌కుమార్ గౌడ్‌కు కెటిఆర్ లీగల్ నోటీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ పేరుతో అసత్య ఆరోపణల చేసిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మహేష్ కుమార్ గౌడ్‌కు లీగల్ నోటీసులు పంపించినట్టు కెటిఆర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి హామీలు అమలు చేయడం చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం, తమ చేతికాని తనాన్ని కప్పి పుచ్చేందుకే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి, రాద్ధాంతం చేస్తోందని పేర్కొన్నారు. ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా తమపై, తమ పార్టీ నేతలపై ఇంతటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. చట్టాలను గౌరవించే వ్యక్తులుగా తాము అక్రమంగా నమోదు చేసిన కేసు విచారణకు కూడా హాజరవుతున్నా మన్నారు. అడ్డగోలుగా మాట్లాడితే బిఆర్‌ఎస్ శ్రేణులు కూడా చూస్తూ ఊరుకోబోరన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ నేతలకు ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని కెటిఆర్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రజలను తప్పుదోవ పట్టించాలనే దురుద్దేశంతోనే మరోసారి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారని, ఈ లొట్టపీసు కేసులతో ఒరిగేదే ఏమీ లేదని కెటిఆర్ అన్నారు. అబద్దాలు చెప్పడంలో సిఎం, పిసిసి చీఫ్ పోటీపడుతున్నట్టు కనిపిస్తోందని, రాష్ట్రాన్ని నడిపించే సత్తా, సామర్థ్యం లేకపోవడంతోనే ఇలాంటి అటెన్షన్ డైవర్షన్ కుట్రలతో కాలం వెల్లదీసే ప్రయత్నం చేస్తున్నారని కెటిఆర్ ఆరోపించారు. కేవలం రాజకీయంగా పబ్బం గుడుపుకునేందుకు ఇలాంటి దుర్మార్గపూరిత వ్యాఖ్యల చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్ లాంటి నాయకులను కోర్టులకు ఈడుస్తామని కెటిఆర్ హెచ్చరించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## టిజిటిడిసి ఎండిని కలిసిన ఎఐటియుసి నేతలు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (టిజిటిడిసి) ఎండిగా నూతన బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతిని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నేతలు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ సంఘం (ఎఐటియుసి) నేతలు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సబ్బు రాజమౌళి, జ్యోతి, మధుర, ముద్దుల, రాధిక, నేత్ర, రాజ్యలక్ష్మి, రాజ్ కుమార్, శ్రీధర్, రవి, యాదవ్ తదితరులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వల్లూరి క్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

## ఆగస్టు 15 నాటికి న్యాయబద్ధమైన దరఖాస్తులన్నీ పరిష్కారం : పొంగులేటి



ప్రజాపక్షం/హైదరాబాద్: వచ్చే రెండు నెలలు రెవెన్యూ శాఖకు అత్యంత కీలకమని, భూ సమస్యల పరిష్కారానికి నిర్దేశించుకున్న ఆగస్టు 15 వతేదీ నాటికి న్యాయబద్ధమైన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్ వల్ల చేసిన తప్పిదాలతో రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో వందల కుటుంబాలు భూ సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నాయని, ఆ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా పరిష్కారాన్ని చూపాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు. తెలంగాణ సమాజంలో భూమి కీలకమైన అంశమన్నారు. కొత్తగా నియమితులైన సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, సిద్దిపేట కలెక్టర్ హైమావతి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, నిజామాబాద్ కలెక్టర్ వినయకృష్ణారెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రటరీ రాజీవ్‌గాంధీ హనుమంత్ హైదరాబాద్‌లోని సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములకు సంబంధించి రైతులు అనుభవించిన కష్టాలకు, బాధలకు విముక్తి కల్పించే విధంగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరిస్తున్న దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని మంత్రి పొంగులేటి సూచించారు.

## భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పే
# ప్రతిపాదన ఉపసంహరించుకోవాల్సిందే

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు
### తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) హైదరాబాద్‌లో భారీ ధర్నా




ప్రజాపక్షం/హైదరాబాద్: భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన క్లెయిమ్‌లను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను ఉపసంహాకరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డును ఇన్సూరెన్స్ రంగాలకు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేయడం బాధాకరమన్నారు. 2009 నుంచి మన రాష్ట్రంలో కార్మిక శాఖ ద్వారా కార్మికులకు పథకాలు అందుతున్నాయని, ఇప్పుడు ఎలాంటి కారణాలు లేకుండా బీమా రంగానికి అప్పచెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో 15 లక్షలకుపైగా మంది భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డులో నమోదై ఉన్నారని తెలిపారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా చెల్లిస్తున్న డబ్బులు కార్మిక శాఖ చేతులు దులిపేసుకొని, బీమా కంపెనీకి అప్పచెప్పడంలో మతలబు ఏంటో చెప్పాలన్నారు. అధికారులు ఎలాంటి కారణాలు చెప్పకుండా గోప్యంగా ఉంచడంలో అంతర్యం ఏమిటని కూనంనేని ప్రశ్నించారు. బీమా కంపెనీలకు అప్పచెప్పడం అంటే సంక్షేమ బోర్డు ఎత్తివేసే కుట్రలో భాగమే అని విమర్శించారు. ఇన్సూరెన్స్ రంగానికి ఇచ్చే టెండర్లను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగానే భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు.

**అంబానీ, ఆదానీలకు డబ్బులు ఇచ్చేందుకేనా?**

ఇప్పటికే దేశంలో సంపదను మొత్తం ఇద్దరు వ్యక్తుల సంస్థలు చట్టబద్ధంగా లూటి చేస్తున్నాయని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలలో డబ్బులు ఆదానీ, అంబానీలకు ప్రధాని మోదీ దోచిపెడుతున్నారని మండిపడ్డారు. భవన నిర్మాణ కార్మికుల డబ్బులను కూడా ఆదానీ, అంబానీలకు దోచిపెట్టేందుకే ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే నిర్ణయంలా ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. నిర్మాణ రంగంలో ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, బీహార్, యుపి, పశ్చిమ్‌బెంగాల్ రాష్ట్రాల నుంచి కార్మికులను తీసుకొచ్చి, వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు చనిపోయిన వారికి డబ్బులు ఇవ్వడం లేదన్నారు.

**ఆర్‌టిసి, సింగరేణి తెలంగాణకు గుండె చప్పుడు..**

ఆర్‌టిసి, సింగరేణిలను ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్‌టిసి, సింగరేణి తెలంగాణకు గుండె చప్పుడు అన్నారు. వాటిని ప్రభుత్వరంగం నుంచి తప్పించి, ప్రైవేటీకరణ చేసేందుకు పెద్ద ఎత్తున కుట్రలు జరుగుతున్నాయని విమర్శించారు. అలాంటి కుట్రలను సమిష్టిగా కార్మికవర్గం తిప్పికొట్టాలని కూనంనేని పిలుపునిచ్చారు.

**గుట్టుచప్పుడు కాకుండా టెండర్లు ఆహ్వానించడంలో అంతర్యమేంటి? : యూసుఫ్, బాల్‌రాజ్**

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్ మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీన గుట్టు చప్పుడు కాకుండా సంక్షేమ బోర్డు అధికారులు ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి టెండర్ కోరుతూ నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. ఇన్సూరేన్స్ కంపెనీకి అప్పచెప్పడం వల్ల కార్మికులకు వచ్చే అదనపు ప్రయోజనాలు ఏంటో చెప్పడం లేదన్నా రు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డుకు కార్మిక సంగాల ప్రతినిధులతో బోర్డు వేయాలని డిమాండ్ చేశారు. నిజమైన కార్మికులను గుర్తించడంలో కార్మిక శాఖ మరింత లోతుగా పనిచేయాలని, తద్వారా కార్మికులకు న్యాయం జరుగుతుందని యూసుఫ్, బాల్‌రాజ్ అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు క్లెయిములు బీమా కంపెనీలకు అప్పచెప్పే టెండర్లు వెంటనే రద్దు చేయక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మోటె నరసింహ, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్, అధ్యక్షులు ఎం. ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం.డి. ఇమ్రాన్, మేకల శ్రీనివాస్, పానుగంటి పర్వతాలు, బిఓసి రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. రాజు నూనె వెంకటేశ్వర్లు, గాదె లక్ష్మి నారాయణ, జి. పరమేశ్, సహాయ కార్యదర్శిలు కమతం యాదగిరి, ఎస్. మల్లేష్, కె. వెంకటేశ్, మల్లికార్జున్, శివ శంకర్, కోశాధికారి కె. నర్సింహా రెడ్డి, సి.హెచ్. శ్రీనివాస్, గణేశ్, కాషయ్య, బి. కిషన్, రాజు, గోవర్ధన్, అశోక్, ఎన్. రామస్వామి, లక్ష్మణ్, లావణ్య, రాజమ్మ, రజిత పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు సుగుణ మృతి



ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సిపిఐ, మహిళా సమాఖ్య నాయకురాలు శాఖమూరి సుగుణ(91) సోమవారం రాత్రి 11 గంటలకు హైదరాబాద్ కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో తుదిశ్వాస విడిచారు. సుగుణ తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సిపిఐ నేత దివంగత ఎస్.వి.కె. ప్రసాద్ భార్య. సుగుణ మరణ వార్త తెలిసిన వెంటనే అమెరికాలో ఉంటున్న ఆమె కుమార్తె డాక్టర్ శాఖమూరి శోభ, కుమారులు డాక్టర్ శాఖమూరి రవి, శాఖమూరి రమేష్ హైదరాబాద్‌కు బయలుదేరారు. వారు బుధవారం రాత్రికి హైదరాబాద్ చేరుకోనున్నారు. భౌతికకాయాన్ని పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు, శ్రేయోభిలాషుల సందర్శనార్థం 19వ తేదీ ఉదయం 08:30 గంటల నుంచి 11.00 గంటలవరకు సిఆర్ ఫౌండేషన్‌లో ఉంచుతారు. అనంతరం మధ్యా హ్నం 12 గంటల నుంచి 2 వరకు మియాపూర్‌లోని సుగుణ నివాసంలో ఉంచుతారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో సుగుణ అంత్యక్రియలు జరుగుతాయి.

**సిపిఐ, ప్రజాసంఘాల సంతాపం**

సుగుణ మరణ వార్త తెలిసిన వెంటనే మంగళవారం ఉదయం సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, సిపిఐ తెలంగాణ కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ఆమె భౌతికకాయంపై కమ్యూనిస్టు పార్టీ జెండా కప్పి పుష్పాంజలి ఘటించారు. సిఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి వి.చెన్నకేశవ రావు, పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ రజిని, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జోస్యబట్ల కల్పన, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నాయకురాలు పి.ప్రేమ్ పావని, డాక్టర్ నారాయణరావు, వృద్ధాశ్రమం సలహా కమిటీ సభ్యులు తమ్మారెడ్డి తానియా, డాక్టర్ మండవ గోపీచంద్, డాక్టర్ పి.సరస్వతి, ఎక్లెన్ ఎడ్యుకేషనల్ సంస్థ ప్రతినిధి ఎ.కె.జిలాని, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమ వాసులు, సిబ్బంది ఆమె భౌతికకాయంపై పుష్ప గుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. సుగుణ మృతి పట్ల సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల ట్రస్ట్ కార్యదర్శి, స్వాతంత్ర్య సమర యోధులు కంది మళ్ల ప్రతాపరెడ్డి ఆమె కుటుంబ సభ్యులకు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె మృతికి ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు జాతీయ సమితి, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట్ర శాఖలు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశాయి. సుగుణ మరణం మహిళా ఉద్యమానికి, వామపక్ష ఉద్యమానికి తీరనిలోటు అని పేర్కొన్నాయి. ఆమె చివరి శ్వాసవరకు మహిళా ఉద్యమ శ్రేయోభిలాషిగా నేటి యువతరాన్ని ఉత్తేజ పరిచేందుకు వారి అనుభవాలను వ్యక్తం చేసేవారని తెలిపాయి.

## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఢిల్లీ తెలంగాణ భవన్‌లో హెల్ప్‌లైన్

ప్రజాపక్షం/హైదరాబాద్:ఇరాన్–ఇజ్రాయెల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో, ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న లేదా ప్రయాణిస్తున్న తెలంగాణ వాసులు, విద్యార్థులకు సహాయం అందించేందుకు, తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు రెండు దేశాల భారత రాయబార కార్యాలయాల నుంచి లభించిన తాజా సమాచారం ప్రకారం, ఇప్పటివరకు తెలంగాణకు చెందిన వారెవరూ ప్రభావితమైనట్టు సమాచారం లేదు. అయినప్పటికీ, భవిష్యత్ పరిణామాల దృష్ట్యా ముందు జాగ్రత్తగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయడమైనది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశానుసారం, తెలంగాణ భవన్ సీనియర్ అధికారులు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో, ఆయా దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదిస్తూ అవసరమైతే తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

**సహాయం కోసం ప్రజలు క్రింది నెంబర్లను సంప్రదించవచ్చు:**

వందన, పి.ఎస్, రెసిడెంట్ కమిషనర్ – +91 9871999044
జి.రక్షిత్ నాయక్, లైజన్ ఆఫీసర్ – +91 9643723157
జావేద్ హుస్సేన్, లైజన్ ఆఫీసర్ – +91 9910014749
సిహెచ్.చక్రవర్తి, పౌర సంబంధాల అధికారి– +91 9949351270

## రిజర్వేషన్ల కోసం బిసిలంతా ఏకం కావాలి
**తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల**



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : బిసి రిజర్వేషన్ల కోసం బిసిలంతా ఏకం కావాలని, ప్రతి బిసి బిడ్డ మాట్లాడాలి, బిసిలలో చైతన్యం రావాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పించడానికి రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూ జూలై 17న రాష్ట్రవ్యాప్తంగా రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అన్ని బిసి సంఘాల నాయకులను కలుపుకొని రైల్‌రోకో చేస్తామని, ఢిల్లీ పాలకులకు తెలంగాణ బిసిల పౌరుషాన్ని చాటుతామని తేల్చిచెప్పారు.

ఢిల్లీ పాలనలకు సెగ తాకేలా రైల్ రోకో ఉంటుందని స్పష్టం చేశారు. మెదక్ జిల్లా కేంద్రంలో యునైటెడ్ పూలే ఫ్రంట్, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో కామారెడ్డి డిక్లరేషన్ రాజ్యాంగ బద్ధంగా 42 శా తం రిజర్వేషన్ సాధన కోసం బిసి రౌండ్ టేండ్ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని హెచ్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేశారు సమావేశానికి ఎమ్మె ల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనివ్వబోవమని హెచ్చరించారు. మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్ రావు బీసీ బిల్లు గురించి ఒక్క రోజు కూడా మాట్లాడలేదని ధ్వజమెత్తారు. రఘునందన్ రావు బీసీల కోసం ఎందుకు మాట్లాడడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో యుపిఎఫ్ స్టేట్ కన్వీనర్ బొల్లా శివ శంకర్, స్టేట్ కో ఆర్డినేటర్ అలకుంట హరి, తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి, నాయకులు సంపత్ గౌడ్, ఈగ సంతోష్, నరేందర్ యాదవ్, లలిత యాదవ్‌లు పాల్గొన్నారు.

## టూరిజం ప్లాజాలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు



ప్రజాపక్షం/హైదరాబాద్:టూరిజం ప్లాజా హోటల్స్‌లో పరిశుభ్రత పాటించాలని, ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్ అంతా కలియతిరుగుతూ.. ఆహార పదార్థాలను, కిచెన్‌ను పరిశీలించారు. అల్పాహారం చేస్తున్న పర్యాటకులు, అతిథులతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహార నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హరిత హోటల్స్‌లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిథుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి పెడుతున్నామని అన్నారు. ఆహ్లాదకరమైన వాతారణం ఉండేలా హరిత హోటల్స్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**
**ఫారం - C**
**ప్రకటన**
(10 A మినహాయింపు ఇవ్వబడిన చట్టంలోని సెక్షన్ – 11 క్రింద)
(రూల్ 6/12 చూడుము)

గజిట్ నెం. GHMC-11 తేది: 04.06.2025
నెం. C/318/2025 తేది: 03.06.2025

శేరిలింగంపల్లి గ్రామం, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లాలో మొత్తం 3173.89 చ.గజాల విస్తీర్ణం గల భూమి ఉపయోగ నిమిత్తం అంటే H-C.L.T.I క్రింద గుల్మోహర్ పార్క్ జంక్షన్ నుండి తారా నగర్ మీదుగా BHEL జంక్షన్ వరకు ప్రతిపాదిత 30.0 M & 36.0 M వెడల్పు గల రహదారి మరియు లింగంపల్లి స్టేషన్ రైల్వే క్రాసింగ్ వద్ద ప్రతిపాదిత ROB కోసం అవసరమై ఉందని తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) & కమీషనర్, GHMC వారు భావిస్తున్నారు.

అందువలన శేరిలింగంపల్లి గ్రామం, శేరిలింగంపల్లి మండలం, రంగారెడ్డి జిల్లాలో పైన తెలిపిన ప్రాజెక్ట్ కోసం 3173.89 చ.గజాల కంటే తక్కువ లేదా ఎక్కువ విస్తీర్ణం గల ప్రామాణిక కొలత గల భూమి అవసరమై ఉందని ప్రకటించడమైనది. భూసేకరణ కోసం ప్రతిపాదించబడిన భూమి సవివరమైన వివరణ దిగువ ఇవ్వబడింది.

| క్రమ సంఖ్య | సర్వే నెం | [illegible] | [illegible] | భూసేకరణ క్రింద విస్తీర్ణం చ.గ.లలో | ఆసక్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు రకం | సంఖ్య | కట్టడాలు రకం | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | - | - | - | 29.94 | శ్రీ ఎన్. శ్రీనివాస్ ఇ.నెం.6-47 | | | | | - | - | - | - |
| 2 | - | - | - | 56.94 | శ్రీ ఎన్. పశుపతి ఇ.నెం.6-40 | | | | | - | - | - | - |
| 3 | - | - | - | 94.44 | శ్రీ ఉదయ్ భాస్కర్ ఇ.నెం.6-39 | | | | | - | - | - | - |
| 4 | - | - | - | 70.78 | శ్రీ డి.వి.సుబ్బారావు ఇ.నెం.6-39 | | | | | - | - | - | - |
| 5 | - | - | - | 71.46 | శ్రీ టి.హెచ్. నరహరి ప్లాట్ నెం.6 | | | | | - | - | - | - |
| 6 | - | - | - | 22.45 | శ్రీ కె. మల్లేష్ ఇ.నెం.6-6 | | | | | - | - | - | - |
| 7 | - | - | - | 53.02 | శ్రీ కె.బాబు రావు ఇ.నెం.6-4 & 5 | | | | | - | - | - | - |
| 8 | 59 & 60 | - | - | 62.94 | శ్రీ సి.సుదర్శన్ రెడ్డి ప్లాట్ నెం. 5/P | | | | | - | - | - | - |
| 9 | - | - | - | 23.06 | శ్రీమతి లక్ష్మీదేవి ఇ.నెం.5-5/1/A | | | | | - | - | - | - |
| 10 | - | - | - | 121.11 | శ్రీ. ఎ. పెద్దా రెడ్డి ఇ.నెం.5-1 | | | | | - | - | - | - |
| 11 | - | - | - | 54.28 | శ్రీ ఎ. రవీందర్ గౌడ్ ఇ.నెం.5-2/2-3, ప్లాట్ నెం.2 | | | | | - | - | - | - |
| 12 | - | - | - | 46.18 | శ్రీ ఎల్. ప్రవీణ్ రెడ్డి ఇ.నెం. 5-3 | | | | | - | - | - | - |
| 13 | - | - | - | 45.00 | శ్రీ ఎల్. నవీన్ రెడ్డి ఇ.నెం.5-4 | | | | | - | - | - | - |
| 14 | - | - | - | 10.04 | శ్రీ ఆర్. యాదయ్య ఇ.నెం.5-5 | | | | | - | - | - | - |
| 15 | - | - | - | 22.29 | శ్రీమతి పి. సుశీలా షోనీ ఇ.నెం.5-6&7 | | | | | - | - | - | - |
| 16 | - | - | - | 12.18 | శ్రీ మహమ్మద్ తాజుద్దీన్ & ఇతరులు ఇ.నెం.5-8/1 | లొకేషన్ స్కెచ్ ప్రకారం | | | | - | - | - | - |
| 17 | - | - | - | 89.08 | శ్రీ టి.ఎస్. పనికర్ ఇ.నెం.5-10 | | | | | - | - | - | - |
| 18 | - | - | - | 113.85 | శ్రీ యం. ప్రీతం ప్లాట్ నెం.53 ఇ.నెం.5-53/NR | | | | | - | - | - | - |
| 19 | - | - | - | 189.30 | శ్రీ సి. సోమదాస్ ఇ.నెం.4-12 | | | | | - | - | - | - |
| 20 | - | - | - | 152.83 | శ్రీ మహమ్మద్ నసీరుద్దీన్ ఇ.నెం.4-6/A | | | | | - | - | - | - |
| 21 | - | - | - | 86.39 | శ్రీ కె. కుమార్ యాదవ్ & శ్రీ. కె. నర్సింహ యాదవ్ ఇ.నెం.2-39 | | | | | - | - | - | - |
| 22 | - | - | - | 23.20 | శ్రీమతి కె. శశికళ ఇ.నెం.2-40 | | | | | - | - | - | - |
| 23 | - | - | - | 49.18 | శ్రీమతి కె. సురేఖ ఇ.నెం.2-45 | | | | | - | - | - | - |
| 24 | - | - | - | 56.54 | శ్రీమతి కె. బాబు రావు ఇ.నెం.2-46 | | | | | - | - | - | - |
| 25 | - | - | - | 25.07 | శ్రీ జి. జనార్దన్ రెడ్డి ఇ.నెం.2-47 | | | | | - | - | - | - |
| 26 | - | - | - | 128.66 | శ్రీ ఎస్. శ్రీనివాస్ గౌడ్ ఇ.నెం.4-13 & 4-14 | | | | | - | - | - | - |
| 27 | 59 & 60 | - | - | 27.11 | శ్రీ కె. నర్సింహ ప్లాట్ నెం.1/పార్ట్ | | | | | - | - | - | - |
| 28 | 59 & 60 | - | - | 22.11 | శ్రీ కె.రాజు ప్లాట్ నెం.1/పార్ట్ & 2/పార్ట్ | | | | | - | - | - | - |
| 29 | 59 & 60 | - | - | 19.55 | శ్రీ కె. శ్రీరాములు ప్లాట్ నెం.2/పార్ట్ | | | | | - | - | - | - |
| 30 | - | - | - | 26.44 | శ్రీమతి పి. ఐలమ్మ ఇ.నెం.5-5/2 | | | | | - | - | - | - |
| 31 | 58/1 | - | - | 90.54 | శ్రీ నీలిమ శివాజీ యాదవ్ మరియు శ్రీ మంచె శ్రీనివాస్ యాదవ్ ప్లాట్ నెం.9 & 10/పార్ట్, ఇ.నెం.5-9 | | | | | - | - | - | - |
| 32 | 57 | - | - | 91.37 | మాశెట్టి నివాస్ వెల్ఫేర్ అసోసియేషన్ యొక్క ప్రతినిధి దాని ప్రధాన కార్యదర్శి శ్రీ ఎన్.కిరణ్ బాబు ఇ.నెం.4-12/101-601 | | | | | - | - | - | - |
| 33 | - | - | - | 111.05 | శ్రీ ఇస్మాయిల్ ఇ.నెం.4-6 | | | | | - | - | - | - |
| 34 | - | - | - | 104.49 | శ్రీమతి తాహెరా బేగం & ఇతరులు ఇ.నెం.4-3, 4-4 & 4-5 | | | | | - | - | - | - |
| 35 | - | - | - | 331.04 | శ్రీమతి శోభ అని ఇ.నెం.4-12/B | | | | | - | - | - | - |
| 36 | - | - | - | 183.45 | శ్రీమతి సువర్ణ & శ్రీమతి ప్రభావతి ఇ.నెం.4-12/A & C | | | | | - | - | - | - |
| 37 | - | - | - | 71.03 | శ్రీమతి సిహెచ్. శకుంతలా బాయి ఇ.నెం.4-15 | | | | | - | - | - | - |
| 38 | - | - | - | 304.23 | శ్రీ హెచ్. సోమయ్య ఇ.నెం.4-86/2 | | | | | - | - | - | - |
| 39 | - | - | - | 45.09 | శ్రీ యాదగిరి గౌడ్ ఇ.నెం.3-102/31 & 32/GF | | | | | - | - | - | - |
| 40 | - | - | - | 36.18 | శ్రీ లక్ష్మణ్ గౌడ్ & శ్రీ యాదగిరి గౌడ్ ఇ.నెం.2-44 | | | | | - | - | - | - |
| మొత్తం | | | | 3173.89 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు చట్టం 2013 (కేంద్ర చట్టం నెం. 30/2013) సెక్షన్-11(1) ద్వారా సవరించబడిన భూసేకరణ, పునరావాసము మరియు పునరుపాధిలో న్యాయబద్ధమైన నష్టపరిహారం మరియు పారదర్శకతకు హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నెం. 21 ఆఫ్ 2017) ఏర్పాట్ల క్రింద సంబంధితులు అందరికీ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

హైదరాబాద్ లోని GHMC స్పెషల్ కలెక్టర్ (భూ.సే.) & కమీషనర్ కార్యాలయంలో ఉంచబడిన భూమి యొక్క ప్లాన్‌ను ఏదేని పని రోజున కార్యాలయ పని వేళల్లో తనిఖీ చేసుకొనగలరు. తెలంగాణ ప్రభుత్వం / స్పెషల్ కలెక్టర్-సహిత-సముచిత ప్రభుత్వం అధీకృత అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ, GHMC, హైదరాబాద్ వారిని మరియు అతని సర్వే సిబ్బందిని సర్వే భూమి నందు ప్రవేశించుటకు మరియు భూమిని సర్వే చేయుటకు, ఏదేని భూమి యొక్క లెవల్స్ తీసుకొనుటకు, సబ్-సాయిల్‌ను త్రవ్వటకు లేదా బోరు వేయుటకు మరియు సదరు చట్టం యొక్క సెక్షన్ – 12 నందు ఏర్పాటు చేయబడిన మరియు నిర్దిష్ట పరిచిన విధంగా తమ పని కొరకు అవసరమైన అన్ని ఇతర చర్యల్ని చేపట్టు నిమిత్తం వారిని అధీకృతుల్ని చేయుటకు సమ్మతించినారు.

చట్టం యొక్క సెక్షన్-11(4) క్రింద స్పెషల్ కలెక్టర్ వారి ముందస్తు అనుమతి లేకుండా సదరు ప్రకటన ప్రచురణ తేదీ నుండి ఏ వ్యక్తి అయినా సదరు భూమికి సంబంధించి ఏ విధమైన లావాదేవీ నిర్వహించుట కానీ, ఏదేని లావాదేవీ కొరకు ప్రేరేపించుట కానీ అనగా విక్రయం / కొనుగోలు, వగైరా లేదా సదరు భూమిపై ఏవేని తాకట్టు రుణభారాలు కల్పించుట కానీ చేయరాదు.

ఒకవేళ సేకరణకు సంబంధించి ఏవేని అభ్యంతరములు ఉన్న యెడల మరియు సంప్రదింపు ద్వారా నష్టపరిహారం సెటిల్‌మెంట్ కొరకు ఆసక్తి గల/బాధిత వ్యక్తులు అందరి నుండి ఏవేని క్లెయిములు ఉన్నచో చట్టంలోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజుల్లోగా స్పెషల్ కలెక్టర్ (భూ. సే.) / అధీకృత అధికారి సమక్షమున ఫైల్ చేయవలెను.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే.), జి.హెచ్.ఎం.సి., హైదరాబాద్
సం/- స్పెషల్ కలెక్టర్, (భూ.సే.) & కమీషనర్, జి.హెచ్.ఎం.సి., హైదరాబాద్
DIPR No. 241/LA/PP-Advt/Agency/2025-26



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ / సిటిఓ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్: జిహెచ్ఎంసి
మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నం. 7337367271
NIT No. 03/SE-CTO/SLPZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 16.06.2025
పని పేరు: సిటిఓ, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసిలోని ఐదు మొబైల్ టాయిలెట్ల నిర్వహణ. (01 అంశం), అంచనా విలువ / ఇసివి: రూ.45.00లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 18.06.2025న మ.1.00గం.ల నుండి 25.06.2025న మ.1.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎస్ఇ-సిటిఓ, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్ నం. 7337367271.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ / సిటిఓ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్: జిహెచ్ఎంసి
DIPR R.O. No. : 3666-PP/CL/ADVT/1/2025-26, Date: 17-06-2025



**తెలంగాణ ప్రభుత్వం**
**పర్యవేక్షక అధికారి కార్యాలయం, నీటి పారుదల శాఖ, కామారెడ్డి జిల్లా.**
టెండర్ నోటీస్ నంబర్: 09/SE/IC/KMR/2025-26, Dt: 16-06-2025, రూ.21.32 లక్షలకు (SDF) పని లభ్యమగు తేది: 17.06.2025, ఉదయం 11:00 గం. నుండి 23.06.2025 సాయంత్రం 5:00 గం. వరకు టెండర్లు ఆహ్వానించనైనది. మిగతా వివరాలకు మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.in లో చూడగలరు.
సం/- A/c. సూపరింటెండింగ్ ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, కామారెడ్డి.
DIPR R.O. No. : 3677-PP/CL/ADVT/1/2025-26, Date: 17-06-2025



**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పురపాలక సంఘం ఆర్మూర్, జిల్లా: నిజామాబాద్**
E1/03/MCA/2025-26, కొటేషన్ నోటీస్ తేది: 17.06.2025
పట్టణములో వనమహోత్సవములో భాగముగా ప్రతి ఇంటికి మొక్కలను పంచుటకు గాను ఒక్కో హెమ్ స్టీడ్ మొక్కకు రేటు కొరకు, అవెన్యు ప్లాంటేషన్‌లో భాగముగా నాటబడు మొక్కల రేట్ల కొరకు, జైల్ డిపార్ట్మెంట్ అర్సపల్లి నుండి ఆర్మూర్ వరకు 70,000ల మొక్కలను రవాణ చేయుటకు ట్రాన్స్పోర్టేషన్ రేటు & లోడింగ్ అన్‌లోడింగ్ రేటు కొరకు, 6 ఫీట్ల నుండి 18 ఫీట్ల వరకు ఎత్తు గల బ్యాంబుస్టిక్స్ రేటు కొరకు, ప్లాస్టిక్/హెచ్‌ఐపిఇ/ ఐరన్ ట్రీ గార్డ్స్ రేటు కొరకు, L/XL/XXL సైజు రేయిన్ కోట్ల(Men/Women) రేటు కొరకు, 18 వాట్స్ నుండి 190 వాట్స్ వరకు ఎల్.ఇ.డి లైట్ల డ్రైవర్స్, పిసిబి, డిఫ్యుసర్స్, సెన్సార్స్, యం.సి.బి, కాంట్రాక్టర్ల రేట్ల కొరకు, ఆలమ్, క్లోరిన్, పాలి అల్యుమినియం క్లోరైడ్ రేట్ల కొరకు, 0.50 హెచ్.పి. నుండి 7.50 హెచ్.పి వరకు సమ్‌మర్సిబుల్ మోటర్ల మరమ్మత్తులకు, రివైండింగ్ రేట్ల కొరకు, వివిధ రకాల ప్యానల్ బోర్డుల మరమ్మత్తుల రేట్ల కొరకు మరియు నీటి సరఫరా లీకేజీల అరికట్టుటలో భాగముగా Non-SSR ఐటమ్స్ రేట్ల కొరకు కొటేషన్లు కోరుచున్నాము. ఇట్టి కొటేషన్లు తేది: 20.06.2025 సా.4:00 గం.లోపు కార్యాలయములో సమర్పించగలరు. ఇట్టి కొటేషన్లను తేది: 21.06.2025 ఉ.11:30 లకు కార్యాలయములో తెరువబడును.
సం/- కమీషనర్ పురపాలక సంఘం, ఆర్మూర్
DIPR R.O. No. : 3661-PP/CL/ADVT/1/2025-26, Date: 17-06-2025

ప్రజాపక్షం
బుధవారం, 18 జూన్

# ఇక చాలు, యుద్ధం ఆపండి!

ఇరాన్‌పై ఇజ్రాయెల్ మిస్సిలీ దాడులు, టెహరాన్ ఎదురుదాడులు మంగళవారం ఐదవరోజులో ప్రవేశించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కెనడాలో జి7 అగ్రనాయక సమావేశం నుండి మధ్యలోనే హడావిడిగా వాషింగ్టన్ ప్రయాణమయ్యారు. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ సాధించే అత్యవసర పనులున్నాయని ఆయన సూచనప్రాయంగా చెప్పారు. యుద్ధం ముగించేందుకు ఇరాన్ ట్రంప్ సహాయం కోరినట్లు ఫ్రెంచి అధ్యక్షుడు ఇమాన్యూల్ మాక్రాన్ జి7 సమావేశ ప్రాంగణం వద్ద తెలియజేశారు. జూన్ 13 తెల్లవారుఝాము నుండి ఘటనల క్రమాన్ని చూసినట్లయితే ఒక విషయం స్పష్టమవుతుంది. ఇజ్రాయెల్ ఆకస్మికంగా ఇరాన్ అణుకేంద్రాలు, ఇతర రక్షణ దుర్గాలపై బాంబుల వర్షం నుండి జి7 నుంచి ట్రంప్ ఆకస్మిక నిష్క్రమణ వరకు ఇదంతా ట్రంప్ – నెతన్యాహు ముందస్తు పథకం ప్రకారం నిర్వహించినట్లుగా ఉంది. తమ అణు కార్యక్రమంపై అమెరికాతో తదుపరి రౌండ్ చర్చలకు ఇరాన్ ఎటువంటి బేరసారాల శక్తి లేకుండా కాళ్లీడ్చుకుంటూ వచ్చేటట్లు చేయటం ట్రంప్ ధ్యేయం. విజేత అయిన నెతన్యాహును, కకావికమైన ఇరానీయన్ నాయకులను చర్చల బల్ల వద్దకు తీసుకురావటం ద్వారా తాను శాంతిదూతగా ఆవిర్భవించటం ట్రంప్ ఎత్తుగడ. కాగా ఇజ్రాయెల్ లక్ష్యాలు రెండు ఒకటి, ఇజ్రాయెల్‌కు ఇరాన్ అణు ప్రమాదం లేకుండా చేయటం. రెండవది, వీలైతే టెహరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చటం. తిరుగుబాటు చేయాల్సిందిగా నెతన్యాహు ఇరానీయన్‌లకు పిలుపు ఇచ్చాడుకూడా. ఇరాన్ సుప్రీం నాయకుడు అయతుల్లా ఖమేనీ నివాసం సమీపంలో ఇజ్రాయెల్ బాంబులుపడ్డాయి కూడా. ఇజ్రాయెల్‌కు ఖమేనీని చంపే కార్యక్రమం ఉందని, తాను ఖండించానని ట్రంప్ చెప్పటం గమనార్హం.

ట్రంప్ వ్యవహారం ఎలా ఉందంటే ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధం గూర్చి ఇజ్రాయెల్ చర్యలన్నీ తనకు తెలుసు అంటూనే, తనకు చెప్పకుండానే నెతన్యాహు దాడులకు దిగాడని బుకాయిస్తున్నట్లుగా ఉంది.

ఇరాన్ అణు కార్యక్రమంపై ఆరవ దఫా చర్చలు ఆదివారం (జూన్15)నాడు ఒమన్ రాజధాని మస్కట్‌లో జరగాల్సి ఉండింది. తన షరతుల ప్రకారం ఒప్పందాన్ని ట్రంప్ కోరుకున్నాడు. అయితే అమెరికా ఆదేశాలకు తలవంచే స్థితిలో ఇరానీయన్‌లు లేనందున ట్రంప్‌కు సానుకూలమైన సమాధానం రాలేదు. అంతకు రెండు రోజుల ముందు ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణిదాడులు మొదలైనాయి. అణుశక్తి వసతులు దెబ్బతిన్నాయి, 9మంది అగ్రశ్రేణి అణు శాస్త్రవేత్తలు, పలువురు మిలటరీ కమాండర్‌లు హతమైనారు. ఇరాన్ ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్ నగరాల్లో కూడా విధ్వంసం జరిగింది. ఇజ్రాయెల్ ఆధిక్యత సాధించినట్లే కనిపిస్తున్నది. అంతమాత్రాన లొంగుబాటు ఊహించలేము.

ఈ పరస్పర విధ్వంసం ఇలా సాగవలసిందేనా! ఎన్నాళ్లు? జి.7 దేశాలు అగ్నికి ఆజ్యం పోస్తున్నాయి. ఆ నాయకులు ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కును బలపరుస్తూ, మధ్య ప్రాచ్యంలో అస్థిరతను తెచ్చింది ఇరాన్ అని నిందిస్తూ ఒక ప్రకటన ఆమోదించారు. ఆత్మరక్షణహక్కు ఇజ్రాయెల్‌కేనా, ఇరాన్‌కు లేదా? ఉద్రిక్తతలు తగ్గించి శాంతిస్థాపనకు చొరవ చేయాల్సిన పెద్దమనుషులు ఎప్పటివలె పక్షపాతం ప్రదర్శించారు. వారంతా ట్రంప్ వెంట ఉన్నారు. ఇదిలావుండగా, యుద్ధానికి స్వస్తి చెప్పి చర్చలకు సిద్ధపడాల్సిందిగా చైనా, రష్యా, తుర్కియె (టర్కీ)లు ఇరాన్, ఇజ్రాయెల్‌లకు విజ్ఞప్తి చేశాయి. ఉద్రికతల సడలింపునకు తక్షణ చర్యలు తీసుకుని, ఆ ప్రాంతం పెద్దఎత్తున కల్లోలంలో చిక్కుకోకుండా కాపాడాలని చైనా విజ్ఞప్తి చేసింది. కాగా తక్షణం కాల్పుల విరమణ పాటించాలని, ఇరాన్ అణు కార్యక్రమం సహా వివాదాస్పద సమస్యలన్నిటినీ రాజకీయంగా, దౌత్యపరంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని రష్యా, తుర్కియె నాయకులు విజ్ఞప్తి చేశారు.

శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని వినియోగించే హక్కు తమకు ఉందని, అందుకు లోబడే అణుశుద్ధి కార్యక్రమం సాగిస్తున్నామన్నది ఇరాన్ వాదన. అణుబాంబు తయారీకి ఇరాన్ చేరువలో ఉందని, అది ఇజ్రాయెల్ అస్థిత్వానికి ముప్పు అన్నది అమెరికా, ఇజ్రాయెల్ వాదన. ఇరాన్ అణు కార్యక్రమం విరమించుకోవాలన్నది వాటి డిమాండ్. ఈ వైరుధ్యం మధ్యలో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ కూడా ఉల్లంఘనలకు పాల్పడిందని ఆరోపించింది. ఈ సంఘర్షణలో ఇరాన్ అరబ్ ప్రపంచం నుంచీ ఏకాకి అయింది.

# జనాభా కంటే ఓటర్ల ఆధారంగా పునర్విభజన!

**అనీశ్ గుప్తా**

నియోజకవర్గాల పునర్విభజన కసరత్తులో పార్లమెంటరీ నియోజకవర్గాల కేటాయింపునకు జనాభాను ప్రాథమిక ప్రమాణంగా పరిగణిస్తే దక్షిణ రాష్ట్రాలకు అసమానంగా నష్టం కలుగుతుందని ఇటీవల ప్రధాన స్రవంతి మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి. ఈ అభిప్రాయానికి మద్దతుదారులు వాదించేదేమిటంటే, ఉత్తర రాష్ట్రాల కంటే కుటుంబ నియంత్రణ నిబంధనలను మరింత కఠినంగా పాటించిన దక్షిణ రాష్ట్రాలకు, సాపేక్షంగా తక్కువ పార్లమెంటరీ స్థానాలు లభిస్తాయి లేదా ప్రస్తుతం ఉన్న సీట్ల కంటే కూడా తగ్గుతాయి.

అయితే, తగినంతగా చర్చించబడని విస్తృతమైన ప్రశ్న ఏమిటంటే: పార్లమెంటరీ నియోజకవర్గాల కేటాయింపునకు అత్యంత హేతుబద్ధమైన ప్రమాణాలు ఏమిటి: జనాభానా లేదా ఓటర్ల సంఖ్యనా?

నియోజకవర్గంలోని ఓటర్లు ఎల్లప్పుడూ జనాభాలో అంతర్భాగంగా ఉండబోరు. చాలా మంది ఓటర్లు తాము నమోదు చేసుకున్న పార్లమెంటరీ నియోజకవర్గాల వెలుపల నివసించవచ్చు లేదా నమోదు చేసుకోవడంలో విఫలమై ఉండవచ్చు. జనాభా లెక్కల రికార్డులలో వలసల వివరాలు అంతగా ఉండవు. ఎందుకంటే అవి కేవలం ఆరు నెలలు లేదా అంతకంటే ఎక్కువ కాలం నివాసం (లేదా నివసించాలనే ఉద్దేశ్యం)పై ఆధారపడి ఉంటాయి. వలస జీవులకు నివాస రుజువు అవసరం ఉండదు లేదా ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదు. వలసదారులు సాధారణంగా వివిధ కారణాల వల్ల తమ ఓటును బదిలీ చేయడాన్ని నివారించవచ్చు/ఆలస్యం చేయవచ్చు. అంతేకాకుండా,18 ఏళ్లలోపు వయసు కలిగిన వారు ఎక్కువ సంఖ్యలో ఉన్న సందర్భాలలో సమాన జనాభా కలిగిన పార్లమెంటరీ నియోజకవర్గాల మధ్య ఓటర్ల సంఖ్యలో పెద్ద తేడాలకు దారితీయవచ్చు. ముఖ్యంగా, 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ' అనే సూత్రం జనాభా కంటే ఓటర్లతో ఎక్కువగా సరిపోలుతుంది. ఓటరు డేటాను ఉపయోగించడం ద్వారా జనగణన కోసం వేచి ఉండే అవసరాన్ని నిరోధిస్తుంది. ప్రాతినిధ్యానికి సంబంధించి మరింత కచ్చితమైన కొలమానాన్ని అందిస్తుంది.

**ఓటరు అసమానత**

ఓటు విలువను ఒక పార్లమెంటరీ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య కు విలోమ అనుపాతం(ఇన్‌వర్లీ ప్రపోర్షనల్)లో పరిగణించవచ్చు. డేటా ప్రకారం, ఓటు విలువ ప్రాంతాలవారీగా, కాలక్రమేణా గణనీయంగా మారుతూ వచ్చింది. కేంద్రపాలిత ప్రాంతాలు, కొండ ప్రాంత రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు 1951 నుండి 2024 వరకు స్థిరంగా అధిక ఓటు విలువను కలిగి ఉన్నాయి. భౌగోళిక అంశాలు, ప్రతి రాష్ట్రం నుండి కనీస ప్రాతినిధ్య అవసరం కారణంగా ఇది జరిగింది.

దక్షిణ రాష్ట్రాలను ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు, అవి 1951లో అధిక ఓటు విలువతో ప్రారంభమయ్యాయని కనుగొన్నాము. అయితే, ఈ ధోరణి 1961, 1971, 1980, 1991,1999లో తలకిందులుగా మారి ఓటు విలువ తగ్గుదలను నమోదు చేశాయి. ఈ ధోరణి మరోసారి తలకిందులైంది. దక్షిణ రాష్ట్రాలు 2009, 2019, 2024లో అధిక ఓటు విలువను నమోదు చేశాయి. ఇది ఒక మిశ్రమ నమూనాను ప్రదర్శిస్తుంది. దక్షిణ రాష్ట్రాలు, ఇతర రాష్ట్రాల మధ్య సగటు ఓటర్ల సంఖ్యలో వ్యత్యాసం 10.5శాతం నుండి +5శాతం వరకు ఉంటుంది.

ముఖ్యంగా, 1951లో మొదటి పార్లమెంటు ఏర్పడినప్పుడు, దక్షిణ రాష్ట్రాలు ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గానికి అధిక ఓటు విలువతో ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభ ప్రయోజనం ప్రభు త్వ విధానాలు, కార్యక్రమాలు, అభివృద్ధి ఫలితాలు, ఇతరములలో దీర్ఘకాలిక ప్రభావాలను కలిగి ఉండవచ్చు.

అంతేకాకుండా, ఓటర్ల పరంగా ఐదు అతిపెద్ద , ఐదు అతి చిన్న పార్లమెంటరీ నియోజకవర్గాలలో (కొండ ప్రాంతాలు/కేంద్రపాలిత ప్రాంతాలు/ఈశాన్య ప్రాంతాలు మినహా), ప్రతి సమూహంలో నాలుగు దక్షిణ రాష్ట్రాల నుండి ఉన్నాయి. ఇడుక్కిలో ఓటు విలువ మల్కాజ్‌గిరి కంటే 4.5 రెట్లు ఎక్కువ, ఉత్తర బెంగళూరు కంటే 2.6 రెట్లు ఎక్కువ. ఇది దక్షిణ రాష్ట్రాలలో పార్లమెంటరీ నియోజకవర్గాల మరింత హేతుబద్ధీకరణ అవసరాన్ని సూచిస్తుంది.

**రాజ్యసభ ప్రాతినిధ్యం**

2024 నాటి ఓటరు డేటా ప్రకారం, దక్షిణ రాష్ట్రాలు భారతదేశంలోని మొత్తం ఓటర్లలో కేవలం 22.45 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, అవి లోక్‌సభ స్థానాల్లో 23.8 శాతం కలిగి ఉన్నాయి. రాజ్యసభలో వాటి ప్రాతినిధ్యం ఓటర్లు, లోక్‌సభ స్థానాల కంటే ఎక్కువగా 24.4 శాతంగా ఉంది. ఇతర రాష్ట్రాలకు ఈ నమూనా భిన్నంగా ఉంది. అవి భారతదేశంలోని మొత్తం ఓటర్లలో 71.2 శాతం ఉన్నప్పటికీ, లోక్‌సభ స్థానాల్లో కేవలం 67.4 శాతం, రాజ్యసభ స్థానాల్లో కేవలం 64.4శాతం మాత్రమే కలిగి ఉన్నాయి. ప్రత్యేకించి, తమిళనాడుకు 39 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఇది బీహార్‌లోని 40 లేదా పశ్చిమ బెంగాల్‌లోని 42 కంటే తక్కువ; కానీ దానికి 18 రాజ్యసభ స్థానాలు ఉన్నాయి. ఇది బీహార్, పశ్చిమ బెంగాల్ రెండింటికీ కేటాయించిన 16 స్థానాల కంటే ఎక్కువ.

ఓటర్ల ఆధారంగా సీట్లను కేటాయించడం మరింత ఉత్తమమైన విధానం. చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు నష్టం జరగకుండా, వాటి ప్రస్తుత సీట్ల సంఖ్యను నిలుపుకుంటాయి. దీని ఫలితంగా మొత్తం సీట్ల సంఖ్య 810 అవుతుంది. పట్టిక ప్రకారం, పెద్ద రాష్ట్రాలలో, రాజస్థాన్ (76 శాతం), కర్ణాటక (60.7శాతం), తెలంగాణ (58.8 శాతం) సీట్లలో అత్యధిక శాతం లాభాలను చూస్తాయి.

పార్లమెంటరీ నియోజకవర్గాలను కేవలం జనాభా ఆధారంగానే కేటాయిస్తున్నారని, దక్షిణ రాష్ట్రాలలో ప్రధానంగా కుటుంబ నియంత్రణ విధానాలకు కఠినంగా కట్టుబడి ఉన్నందునే సీట్ల తగ్గించే అవకాశం ఉందని ప్రస్తుత కథనాలు పూర్తిగా కచ్చితమైనవి కావు. మొదటిది, నియోజకవర్గ కేటాయింపు ఎప్పుడూ కేవలం జనాభా ఆధారంగానే జరగలేదు. ఇతర పరిగణనలు, అంటే భౌగోళిక సవాళ్ళు, కనీస ప్రాతినిధ్యం ఎల్లప్పుడూ పాత్ర పోషించాయి. రెండవది, రాజకీయ ప్రాతినిధ్యాన్ని జనాభా నియంత్రణకు ముడిపెట్టడం ప్రమాదకరమైన సాంప్రదాయం ఏర్పరుస్తుంది. ఆ తర్కం ప్రకారం, మతం లేదా కులం ఆధారంగా ప్రాతినిధ్యం కోసం ఇలాంటి వాదనలు చేయవచ్చు. ఉదాహరణకు, అన్ని మత సమూహాలలో, అన్ని సామాజిక సమూహాలలో, ఉన్నత కులాల వారిలో, జైనులు జనాభా నియంత్రణకు అత్యధికంగా పాటిస్తారు. అయితే, ముస్లింలు, షెడ్యూల్డ్ తెగలకు సాపేక్షంగా అధిక సంతానోత్పత్తి రేట్లు ఉన్నాయి. మూడవది, నిజానికి పార్లమెంటరీ నియోజకవర్గాల ఏర్పాటుకు జనాభా లెక్కలను ప్రమాణంగా తీసుకున్నప్పుడు భారీ స్థాయి వలసలను ఊహించలేదు. కాబట్టి 'ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒక విలువ' అనే సూత్రం వాస్తవ అర్థంలో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా జనాభా కంటే ఓటర్ల సంఖ్య ఆధారంగా జరిగితే దగ్గరగా ఉంటుంది.

**2024 ఓటర్ల జాబితా ఆధారంగా ఓటర్ల ప్రాతిపదికన పార్లమెంటరీ నియోజకవర్గాల ప్రతిపాదిత సంఖ్య**

| రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలు (1) | ప్రస్తుత సీట్లు (2) | ఓటర్లు (3) | ప్రతిపాదిత సీట్లు (4) | సర్దుబాటు చేసిన సీట్లు** (5) | పెరుగుదల (6) |
|---|---|---|---|---|---|
| ఆంధ్రా | 25 | 4,14,01,087 | 33.9 | 34 | 36 |
| కర్నాటక | 28 | 5,47,72,332 | 44.9 | 45 | 60.7 |
| కేరళ | 20 | 2,78,07,008 | 22.7 | 23 | 15 |
| తమిళనాడు | 39 | 6,24,04,947 | 51 | 51 | 30.8 |
| తెలంగాణ | 17 | 3,32,32,315 | 27.2 | 27 | 58.8 |
| బీహార్ | 40 | 7,72,59,579 | 63.2 | 63 | 57.5 |
| చత్తీస్‌గఢ్ | 11 | 2,06,78,667 | 16.9 | 17 | 54.5 |
| గుజరాత్ | 26 | 4,80,09,945 | 39.3 | 39 | 50 |
| హర్యానా | 10 | 2,01,87,911 | 16.5 | 17 | 70 |
| జార్ఖండ్ | 14 | 2.58.77,892 | 21.2 | 21 | 50 |
| మధ్యప్రదేశ్ | 29 | 5,66,68,852 | 46.4 | 46 | 58.6 |
| మహారాష్ట్ర | 48 | 9,30,61,760 | 76.1 | 75 | 58.3 |
| ఢిల్లీ | 7 | 1,52,14,638 | 12.4 | 13 | 85.7 |
| ఒడిశా | 21 | 3,37,16,965 | 27.6 | 28 | 33.3 |
| పంజాబ్ | 13 | 2,15,67,196 | 17.6 | 18 | 38.5 |
| రాజస్థాన్ | 25 | 5,35,08,010 | 43.8 | 44 | 76 |
| ఉత్తర ప్రదేశ్ | 80 | 15,44,03,112 | 126.3 | 126 | 57.5 |
| పశ్చిమ బెంగాల్ | 42 | 7,61,24,780 | 62.3 | 62 | 47.6 |
| అండమాన్ నికోబార్ దీవులు | 1 | 3,15,745 | 0.3 | 1 | 0 |
| అరుణాచల్‌ప్రదేశ్ | 2 | 8,98,442 | 0.7 | 2 | 0 |
| అస్సాం | 14 | 2,45,72,114 | 20.1 | 20 | 42.9 |
| చండీగఢ్ | 1 | 6,60,552 | 0.5 | 1 | 0 |
| దాద్రానగర్ హవేలీ దయ్యుదామన్ | 2 | 4,17,236 | 0.3 | 2 | 0 |
| గోవా | 2 | 11,79,644 | 1 | 2 | 0 |
| హిమాచల్ | 4 | 57,11,969 | 4.7 | 5 | 25 |
| జమ్మూ కశ్మీర్ | 5 | 88,02,348 | 7.2 | 7 | 40 |
| లద్దాఖ్ | 1 | 1,90,576 | 0.2 | 1 | 0 |
| లక్షద్వీప్ | 1 | 57,953 | 0 | 1 | 0 |
| మణిపూర్ | 2 | 20,51,357 | 1.7 | 2 | 0 |
| మేఘాలయ | 2 | 20,30,451 | 1.8 | 2 | 0 |
| మిజోరం | 1 | 8,61,327 | 0.7 | 1 | 0 |
| నాగాలాండ్ | 1 | 13,25,383 | 1.1 | 1 | 0 |
| పుదుచ్చేరి | 1 | 10,24,024 | 0.5 | 1 | 0 |
| సిక్కిం | 1 | 4,66,643 | 0.4 | 1 | 0 |
| త్రిపుర | 2 | 28,70,986 | 2.3 | 3 | 50 |
| ఉత్తరాఖండ్ | 5 | 84,31,101 | 6.9 | 7 | 40 |
| లోక్‌సభ స్థానాలు | 543 | 97,79,65,560 | 500 | 810 | 49.2 |

** దగ్గరి అంకెతో సరిచేయబడింది

(ది హిందూ సౌజన్యంతో...)

## కాళేశ్వరం విచారణతో కాలయాపన చేయకుండా..
# ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్దదైన ఎత్తిపోతల పథకమని.. ఇది తెలంగాణకు కల్పతరవని బిఆర్ఎస్ నాయకులు గొప్పగా చెబుతుంటారు. గోదావరి నది జలాలను ఎత్తిపోసేదే కాళేశ్వరం ప్రాజెక్టు. దీనిలో ప్రధాన బ్యారేజీలు మూడు. అవి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల.. ఈ బ్యారేజీలు గోదావరి నదికి అడ్డంగా చేపట్టడం జరిగింది. మేడిగడ్డ నుండి అన్నారంకు, అక్కడి నుండి సుందిళ్లకు, అక్కడి నుండి ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోస్తూ దాదాపు 141 టిఎంసిల సామర్థ్యంతో 15 రిజర్వాయర్లు చేపట్టడం జరిగింది. దీనికి అంచనా వ్యయం రూ.85 వేలకోట్ల నుండి రూ.1.20 లక్షల కోట్లకు పెరిగింది. అందులో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌తో పాటు మరికొన్ని రిజర్వాయర్లు నిర్మాణంలో ఉన్నాయి. ఇవి ఏవి పూర్తిగా పనులు కాలేదు. పూర్తిస్థాయిలో భూసేకరణ గాని.. భూములు కోల్పోతున్న రైతులకు.. ఇండ్లు, ఆస్తులు కోల్పోతున్న వారికి పూర్తి నష్టపరిహారం అందలేదు. అయితే ప్రధానంగా ఎత్తిపోసే మేడిగడ్డ బ్యారేజ్‌ని 7 బ్లాకులుగా 85 పియర్లుగా నిర్మించడం జరిగింది. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణలోని 13 జిల్లాలలో వివిధ ప్రాజెక్టుల కింద, రిజర్వాయర్ల కింద పాత ఆయకట్టును స్థిరీకరించి, కొత్తగా 20,33,572 ఎకరాలకు సాగునీరుతో పాటు హైదరాబాద్ నగరానికి తాగునీరు అందించే విధంగా రూపొందించిన అతి పెద్ద ప్రాజెక్టు అని కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావుతో పాటు బిఆర్ఎస్ నాయకులు పదేపదే చెప్పుకుంటూ వస్తున్నారు.



**కాళేశ్వరం ఎత్తిపోతలు**

2009లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత నది గోదావరి నదిలో కలిసే ప్రాంతం తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని ద్వారా 16.5 లక్షల ఎకరాలకు సాగుతో పాటు తాగునీటి అవసరాలకు కోసం రూ.32 వేల కోట్లతో చేపట్టింది. దాదాపుగా రూ.10 వేల కోట్లు 2013 వరకు ఖర్చుచేసి కొంత భూసేకరణ, కాలువల పనులు చేపట్టారు.. 2014లో అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ప్రభుత్వం అక్కడ నీరు లభ్యత తక్కువగా ఉంటుందని.. కెసిఆర్ రీ డిజైన్ చేసి కాళేశ్వరానికి దిగువన మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మిస్తే త్రివేణి సంగమంతో 200 టిఎంసిల పుష్కలమైన నీరు ఉంటుందని, గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల అనుసంధానంతో వచ్చిన నీటిని ఒడిసిపెట్టి ఉత్తర, దక్షిణ తెలంగాణకు నీరు ఎత్తిపోయవచ్చని 2016 మే 2న కాళేశ్వరానికి శంకుస్థాపన చేశారు. ప్రధాన ప్రాజెక్టులో ప్రధాన మెయిన్ కెనాల్, కొన్ని రిజర్వాయర్లు పూర్తి చేసి నప్పటికీ, 3వ వంతు కాలువలు, రిజర్వాయర్లు, భూసేకరణలో కొంత పూర్తి కాకుండానే మూడేళ్లలోనే పూర్తి చేశామని, ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాల మాగాణి సాగులోకి వచ్చిందని ప్రచారం చేస్తూ.. ప్రపంచానికే తలమానికంగా ఉండాలని 2019 జూన్ 21న ప్రారంభించారు. ప్రత్యేక బస్సుల ద్వారా రైతులను, బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను, కార్యకర్తలను తీసుకెళ్లి జాతర సాగించారు.

**కుంగిన మేడిగడ్డ బ్యారేజీ**

మూడేళ్లు నేరుగా గోదావరి నీటిని 500 టిఎంసిలకు పైగా ఎత్తిపోసామని, తెలంగాణను అన్నపూర్ణగా దేశంలోనే తలమానికంగా అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న బిఆర్ఎస్‌కు ప్రాజెక్టు మొత్తం పూర్తి కాకముందే ఎన్నికల ముందు ఒక్కసారిగా 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ ప్రధాన బ్యారేజీలో మూడు పిల్లర్స్ కుంగిపోయాయి. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచలేని పరిస్థితి ఏర్పడింది. కాళేశ్వరం పనుల్లో నాణ్యత లేదని కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఆరోపిస్తున్న సందర్భంలోనే ప్రాజెక్టు పిల్లర్స్ కుంగిపోయి బిఆర్ఎస్ ప్రభుత్వ పతనానికి హేతువైంది. ఆ పతనం బిఆర్ఎస్‌ను ఇంకా వెంటాడుతూనే ఉంది.

**రాజకీయ చదరంగం**

కాళేశ్వరం ఎత్తిపోతల పనులలో నాణ్యత లోపాలు, అవినీతిపై కాంగ్రెస్, బిజెపి ఆరోపణలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి కౌంటర్‌గా బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఒక పిల్లరు లేదా రెండు పిల్లర్లు కుంగిపోతే వెంటనే రిపేర్ చేయలేని దద్దమ్మ, అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వమని ప్రత్యారోపణలు ఎపిసోడ్‌ల రూపంలో కొనసాగుతున్నాయి. లక్ష కోట్లు కెసిఆర్ దిగమింగటంతో కాళేశ్వరం ప్రాజెక్టు పనికిమాలిన ప్రాజెక్టుగా ఉండిపోయిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కాళేశ్వరంలో జరిగిన అవినీతి అక్రమాలపై సిబిఐతో విచారణ చేయించాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్ట్ నుండి ఒక ఎకరానికి నీరు పారించకున్నా దీనికి చేసిన అప్పుల క్రింద కిస్తీలు, వడ్డీ కలిపి ప్రతి సంవత్సరం రూ.10 వేల కోట్ల నుంచి 13 వేల కోట్ల వరకు చెల్లించవలసి ఉన్నది. దీంతో ఈ ప్రాజెక్టు నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వానికి గుదిబండగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అంటున్నారు.

**ఎన్‌డిఎస్ఎ నివేదిక**

మేడిగడ్డ బ్యారేజి పిల్లర్లు కుంగిపోయిన నేపథ్యంలో ప్రాజెక్టు పనికొస్తుందా? రాదా? కాళేశ్వరం ప్రాజెక్టు అక్టోబర్ 21న గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే కుంగిన తర్వాత ఆ ప్రాజెక్టు పనికిరాదని మూడు పిల్లర్లు భూమిలోనికి కుంగడం మూలంగానే బ్యారేజీ కుంగిందని, ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తే ప్రాజెక్టు కొట్టుకుపోతుందని ఎన్‌డిఎస్ఎ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత మేడిగడ్డ బ్యారేజీలాగే సుందిళ్ల, అన్నారం రిజర్వాయర్లలో కూడా పిల్లర్ల కింది నుండి నీటి లీకేజీ బుంగల రూపంలో వస్తూ ఇసుక కొట్టుకుపోతుందని, బ్యారేజ్‌లో నీటిని నిలువ చేస్తే కూలిపోతాయని ఆ ప్రాజెక్టులపై తుది నిర్ణయం వచ్చేవరకు బ్యారేజీలలో నీటిని నిల్వ చేయకూడదని గత ప్రభుత్వ పాలనలోనే ఎన్‌డిఎస్ఎ తేల్చింది. ఆ రిజర్వాయర్లలో ఉన్న నీటిని గేట్లు ఎత్తి వదిలిపెట్టినారు. దీంతో గత రెండు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారింది. 2019 జూన్ 2న ప్రారంభించిన ఈ ప్రాజెక్టు బరాజ్‌లు అదే ఏడాది నవంబర్‌లో వచ్చిన వరదలకు దెబ్బతిన్నాయి. ఆర్‌సిసి వేసిన కోట్, సిసి కర్టెన్ గోడలలో కొంత భాగం, దిగువ భాగంలో నిర్మించిన కాంక్రీట్ బ్లాకులు కొట్టుకుపోయాయి. మేడిగడ్డ బరాజ్‌కు, అన్నారం బరాజ్‌కు, సుందిళ్ల బరాజ్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. డిజైన్ లోపం, లోపభూయిష్టంగా చేపట్టిన పనుల కారణంగానే నష్టం జరిగింది. నిర్వహణ పర్యవేక్షణ లోపం కారణంగానే మేడిగడ్డ కుంగినట్లు జలశక్తి శాఖ నియమించిన ఆరుగురు సభ్యుల కమిటీ తేల్చి చెప్పింది.

**బ్యారేజీలు కుంగిపోవడంపై కమిషన్:**

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర విచారణకు పిసి ఘోష్ నేతృత్వంలో జ్యుడిషియల్ కమిషన్ వేయడం జరిగింది. ఈ కమిషన్ గత సంవత్సర కాలంగా ప్రాజెక్టులో ప్రధాన వింగులైన టెక్నికల్, ఇంజనీరింగ్, క్వాలిటీ కంట్రోల్, డిజైనింగ్, నిర్మాణరంగాలకు బాధ్యులైనవారిని 112 మందిని విచారించింది. చివరిసారిగా ఆనాడు అధికారంలో ఉన్న కర్త, కర్మ, క్రియగా భావిస్తున్న ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్, నీటి పారుదల శాఖ మంత్రి హరీష్‌రావు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు నోటీసులు ఇవ్వడం జరిగింది. జూన్ 5న ఈటల రాజేందర్, జూన్ 9న హరీష్ రావు, జూన్ 11న కేసిఆర్ కమిషన్ ముందు హాజరై వివరించారు. ఈ రాజకీయ నాయకులు ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ పూర్తి ఇంజనీరింగ్ సిబ్బందిపైన నెట్టి తప్పించుకున్నారు. కమిషన్ కాల పరిమితి జులై ఆఖరి వరకు ఉన్నందున, వారు ఇచ్చే రిపోర్టుపై భవిష్యత్ ఆధారపడి ఉందని న్యాయం నిపుణులు తెలుపుతున్నారు.

**ప్రత్యామ్నాయంగా గోదావరి నీరందించే విధంగా చూడాలి**


ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదంటే.. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ఏమాత్రం ఆలస్యం చేయకుండా తుమ్మిడిహట్టి వద్ద ప్రత్యామ్నాయ ప్రాజెక్టు చేపట్టి ఎల్లంపల్లికి ఎత్తిపోస్తూ మిడ్‌మానేరు నుండి ఎస్ఆర్ఎస్‌పి లింక్ చేయాల్సి ఉంటుంది. ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్ట్ నీటితో గత సంవత్సరం నుండి కాంగ్రెస్ ప్రభుత్వం పంటలను కాపాడింది. ఈ సంవత్సరం కూడా విచారణలతో కాలయాపన చేయకుండా గోదావరి నీరు ఎస్సారెస్పీ కాలువల చెరువుల ద్వారా అందించే ప్రత్యామ్నాయ విధానం చేపట్టి ప్రస్తుతం ఉన్న ఆయకట్టు సేద్యం అయ్యే విధంగా రైతులను, ప్రజలను ఆదుకోవాలని కోరుకుంటున్నారు.

**– ఉజ్జిని రత్నాకర్ రావు**
**9490952646**

# కథ పాతదే... పెత్తనమే కొత్తది

## తెలంగాణలో పెరుగుతున్న భూ కమతాలు

తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మళ్లీ గతం వైపునకు పయనిస్తుంది. మారిన పరిస్థితుల నేపథ్యంలో భూ కమతాలు పెరుగుతున్నాయి. భూమి వ్యాపార వస్తువుగా మారిన తర్వాత సంపన్న వర్గాల దృష్టి భూమిపై పడింది. భూమి ఉండడం అది ఎక్కువగా ఉండటం స్టేటస్ సింబల్‌గా మారింది. దీనితో భూ కొనుగోళ్లు మొదలయ్యాయి. ఎంత భూమి దొరికితే అంత కొనుగోలు చేసేందుకు సిద్దమవుతున్నారు. రాజధాని నగరానికే కాదు జిల్లా కేంద్రాలకు సుదూరంగా ఉన్న ప్రాంతాల్లో సైతం భూములు కొనుగోలు చేస్తున్నారు. వంద, రెండు వందల ఎకరాల భూములు కొనేసి అక్కడ కొన్ని కుటుం బాలకు నిర్వహణ, సాగు బాధ్యతలు అప్పగిస్తున్నారు. మరికొందరు అతిథి గృహాలను నిర్మించుకుని విలాస విడిదిగా మార్చుకుంటున్నారు. అప్పటి రైతుబంధులోనూ ఇప్పటి రైతుభరోసాలోనూ భూ పరిమితి లేకపోవడంతో అతిపెద్ద సానుకూల అంశంగా మారింది. కారణాలు ఏమైనా తెలంగాణలో తిరిగి కమతాలు పెరిగిపోతున్నాయి. గతంలో భూస్వాములు గ్రామాలపై పెత్తనం చెలాయించేవారు.



గ్రామాలను తమ అదుపు ఆజ్ఞల్లో ఉంచుకుంటూ తమకు తెలియకుండా ఏమి జరిగినా ప్రజలను శిక్షించేందుకు వెనకాడేవారు కాదు. ఆ భూస్వామ్య పెత్తనమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి దారి తీసింది. ఆ తర్వాత వచ్చిన భూ సంస్కరణల చట్టాలు, భూమిపై ఆదాయం రావడం లేదన్న కారణం, విలువ లేని భూముల విక్రయాలు ఇలా క్రమంగా భూ కమతాలు అంతర్థనమయ్యాయి. ఆ స్థానంలో చిన్న సన్నకారు రైతులు సాగులోకి వచ్చారు. తెలంగాణ గ్రామీణంలో పది ఎకరాలలోపు రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అదే సమయంలో వ్యవసాయరంగ ఉత్పత్తి పెరగడంతో పాటు, గ్రామీణ బానిసత్వం పాలేరుల వ్యవస్థ దాదాపుగా కనుమరుగయ్యా యి. యాంత్రీకరణను మధ్యతరగతి రైతాంగం తట్టుకుని నిలబడింది. రెండు దశాబ్దాలుగా భూ విలువ క్రమంగా పెరుగుతూ వచ్చింది. అలా పెరిగి ఇప్పుడు చాలా చోట్ల లక్షలు దాటి కోట్లకు చేరుకుంటుంది. సంపన్న వర్గాలు గ్రామీణ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసి దాని రక్షణకు గ్రామాల్లో కొందరిని చేరదీయడం రాజకీయం గా లేదా ఇతరత్రా ప్రోత్సహించడం మొదలు పెట్టారు. ప్రతిది డబ్బుతో ముడిపడిన ఈ రోజుల్లో గ్రామాల్లో భూమి కలిగిన సంపన్నులు డబ్బును ఎరగా వేసి తనవైపుకు తిప్పుకుని పరోక్ష పెత్తనం సాగించటం ప్రారంభమైంది. రియల్టర్లు, భూ కామందులు, జాతరలు, గ్రామ సామూహిక అవసరాలతో పాటు కొందరి వ్యక్తిగత అవసరాలను డబ్బుతో తీరుస్తూ గౌరవంతో కూడిన పెత్తనానికి వస్తున్నారు. చాలా గ్రామాలలో ఇప్పుడిప్పుడే కొందరు శాసించే పరిస్థితిలోకి వస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో మన వాడే గెలవాలి అందుకు ఎంత ఖర్చు అయినా ఫర్వాలేదు అన్న భరోసా ఇస్తున్నారు. తమ ఆస్తుల రక్షణ ముసుగులో గ్రామీణ వర్గ రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో తమకు ఇష్టమైన అభ్యర్థులకు లక్షలాది రూపాయల సాయం అందించి గెలిపించుకున్న ఘటనలు అనేకం. 136 ఓట్లు ఉన్న గ్రామ పంచాయతీ చుట్టూ రియల్ వెంచర్లు వెలిశాయి. ఆ పంచాయతీకి 2019 ఎన్నికల్లో ముగ్గురు సర్పంచు అభ్యర్థులు వెరసి రూ.80 లక్షలు ఖర్చు చేయగా 58 ఓట్లు వచ్చిన అభ్యర్థి గెలుపొందాడు. ఈ ఖర్చు అంత పైన పేర్కొన్న పరోక్ష పెత్తనం కోసం ఖర్చు చేయబడిందే. ఇది ఒక ఉదాహరణ మాత్ర మే ఇలా చెప్పుకుంటే అనేకం. ముఖ్యంగా తెలంగాణ గ్రామీణ వ్యవస్థపై పరోక్ష పెత్తనం ఇప్పటిది కాకపోయినా పెత్తనం పాతదే కానీ ఇప్పుడు తిరిగి కొత్తగా మొదలైంది. భూమి వ్యాపార వస్తువుగా మారిన తర్వాత భూమిని కొనుగోలు చేసే స్థితిలో రైతాంగం లేదు. భూమి అవసరమైన వారి నుంచి సంపదగా మార్చుకునే వారి వైపు జరిగిపోతుంది. పదుల ఎకరాలతో ప్రారంభమై వందల ఎకరాలకు చేరుకుంటున్న భూ కమతాల మధ్య ఎకరం రెండు ఎకరాల రైతులు ఇమడలేక భూమిని అమ్ముకుని ప్రత్యామ్నాయ రంగాల వైపు పయనిస్తున్నారు. భూ పరిమితి చట్టం లేని కారణంగా అక్రమ సంపాదన భూ విక్రయాల వైపు మరలడంతో ఆదాయ పన్ను మినహాయింపు, భూమి నుంచి వచ్చిన ఆదాయం అని చూపిస్తూ పెద్ద మొత్తంలో పన్నుల నుంచి తప్పించుకునేందుకు దోహదపడుతుంది. మొత్తంగా వెలిసిన, వెలుస్తున్న భూ కమతాలు పరోక్ష పెత్తనానికి దారులు వేశాయి వేస్తున్నాయి. భూస్వామ్యుల పెత్తనం కథ పాతదే అయినా కొత్తగా మొదలైంది. ఇది పెరిగి చివరకు ఏ వైపునకు దారి తీస్తుందోనన్న ఆందోళన క్రమ క్రమంగా గ్రామీణ ప్రాంతంలో మొదలైంది.

**– ఏనుగు వెంకటేశ్వరరావు**
**ప్రజాపక్షం ప్రతినిధి ఖమ్మం**



# జాతీయం
NATIONAL & GENERAL NEWS


## భాషల పేరుతో విభజన వద్దు : ధన్‌ఖడ్

**పుదుచ్చేరి :** భారతదేశం భాషల విషయంలో విభజనను భరించ లేదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. దేశ భవిష్యత్తు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ తుఫాను నుండి బయటపడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అలాగే, జాతీయ విద్యా విధానం 2020ని అక్షరాలా అమలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎందుకంటే ఇది విద్యా రంగంలో 'గేమ్ ఛేంజర్' అని, ఇది దేశం యొక్క మరింత అభివృద్ధికి తోడ్పడుతుందని ఆయన అన్నారు.



పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా వ్యవహరిస్తున్న ధన్‌ఖడ్ మాట్లాడుతూ భాషల పట్ల వ్యతిరేకత ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 'పార్లమెంటులో సభ్యులు 22 భాషల్లో మాట్లాడటానికి అనుమతి ఉంది. మన భాషలు సమ్మేళనాన్ని సూచిస్తాయి. సనాతనం ఒకే ఉన్నతమైన ప్రయోజనం కోసం కలిసుండాలని బోధిస్తుంది' అని ధన్‌ఖడ్ తెలిపారు.

## చికిత్సకు స్పందిస్తున్న సోనియాగాంధీ



**న్యూఢిల్లీ :** ఉదర సంబంధిత సమస్య కారణంగా ఆసుపత్రిలో చేరిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ చికిత్సకు బాగా స్పందిస్తున్నారని, కానీ ఆమె డిశ్చార్జ్ తేదీ ఇంకా నిర్ణయించలేదని మంగళవారం ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. 78 ఏళ్ల కాంగ్రెస్ నాయకురాలు ఆదివారం సాయంత్రం సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేరారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, చికిత్సకు స్పందిస్తున్నారని, ఆసుపత్రి చైర్మన్ అజయ్ స్వరూప్ ఒక ప్రకటనలో తెలిపారు. కడుపులో ఇన్ఫెక్షన్ నుండి ఆమె కోలుకుంటున్నారని, ఆమె ఆహారాన్ని కూడా నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. సోనియాగాంధీ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు ఆయన చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా, ఆమె డిశ్చార్జ్ తేదీని ఇంకా నిర్ణయించలేదు అజయ్ స్వరూప్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ ఎస్ నుండే, డాక్టర్ అమితాబ్ యాదవ్‌తో కూడిన తమ వైద్యుల బృందం సోనియా ఆమె ఆరోగ్యం, ఆహారాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. కాగా, ఈనెల 9న మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు అదే ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చెక్‌అప్‌కు రెండు రోజుల ముందు, ఆమె అధిక రక్తపోటు గురించి ఫిర్యాదు చేసిన తర్వాత సిమ్లాలోని ఇందిరా గాంధీ మెడికల్ కాలేజీలో కొన్ని పరీక్షలు చేయించుకున్నారు.

# కులగణనపై ప్రభుత్వ ఉద్దేశమేంటి?

ప్రశ్నించిన కాంగ్రెస్ : కులగణనను ఆలస్యం చేస్తోందని మండిపాటు

**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం కుల గణనను ఆలస్యం చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. సమయం సంపాదించడం, ముఖ్యాంశాలను పొందడం, కథనాన్ని నిర్వహించడం దాని ఉద్దేశ్యంగా కనిపిస్తోందని మండిపడింది. ప్రభుత్వం కుల గణన ప్రక్రియపై పారదర్శకంగా వ్యవహరించాలని డిమాండ్ చేసింది. ఒక వ్యక్తి కులానికి సంబంధించిన డేటాను సేకరించడం మాత్రమే లక్ష్యం కాదని, ఈ కుటుంబాల జీవన పరిస్థితులను అర్థం చేసుకోవడం, వారి జీవనోపాధిని గణనీయంగా మెరుగుపరచడానికి కూడా విధానాలను రూపొందించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ అన్నారు. కుల గణన గురించి ప్రభుత్వ ఉద్దేశాలపై సందేహాలు ఉన్నాయని, జనాభా గణనకు అవసరమైన నిధులు రూ. 10,000 కోట్లు అవసరం కాగా, ప్రభుత్వం రూ. 574 కోట్లు మాత్రమే కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. కుల గణనలో కులాన్ని చేర్చడంపై ప్రభుత్వ నోటిఫికేషన్ 'మౌనంగా' ఉందని కాంగ్రెస్ ఆరోపించిన నేపథ్యంలో జనాభా గణనలో కుల గణన కూడా ఉంటుందని హోం మంత్రిత్వ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. దీంతో సచిన్ పైలట్ స్పందించారు. కుల గణన డిమాండ్‌ను కాంగ్రెస్ పార్టీ, ముఖ్యంగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చాలా సంవత్సరాలుగా లేవనెత్తుతున్నారన్నారు. కాంగ్రెస్ నిరంతరం చాలా గట్టింగా డిమాండ్ చేస్తున్నందునే మోడీ ప్రభుత్వం కుల గణనను ప్రకటించిందన్నారు. అయితే, వాస్తవాలు, గణాంకాలు మరోలా చెబుతున్నాయని పైలట్ మంగళవారం కాంగ్రెస్ ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. కేంద్రం ప్రభుత్వం 2027లో జగగణన చేయాలని భావిస్తోంది, ఇందుకు రూ. 10 వేల కోట్లు అవసరం కాగా, కేటాంచింది మాత్రం రూ. 574 కోట్లేనని పైలట్ ఆరోపించారు. జన గణనతో పాటు కలు గణన చేయాలని డిమాండ్ చేసినందుకు బిజెపి తొలుత తమను 'పట్టణ నక్సల్స్'గా పేర్కొన్నదని, ఈ డిమాండ్లను అంగీకరించడానికి నిరాకరించిందని, అయితే ఇప్పుడు దేశ మానసిక స్థితిని గ్రహించి, వారు ఈ ప్రతిపాదనను సూత్రప్రాయంగా అంగీకరించారని ఆయన అన్నారు. దీనికి సంబంధించి గణనీయమైన గందరగోళం, అసంతృప్తి ఉన్నట్లు కనిపిస్తోందని చెప్పారు. అందువల్ల, ప్రభుత్వం స్పష్టంగా, పారదర్శకంగా ఉండాలని, పొడిగించిన గడువులను, సరిపోని బడ్జెట్ కేటాయింపులను నివారించాలని కోరుతున్నానని పైలట్ అన్నారు. భారతదేశంలో నివసిస్తున్న ప్రజల స్థితిని కచ్చితంగా అంచనా వేయడం దీని ఉద్దేశమని, కులగణన దీనికి సరైన మార్గమన్నారు. మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ అంశంపై చేసినట్లుగానే కుల గణనను కూడా ఆలస్యం చేస్తోందని పైలట్ పేర్కొన్నారు. ప్రభుత్వం దీనిని రాజకీయం చేయడం మానేసి సమర్థవంతంగా పనిచేయాలని,



జాతీయ స్థాయిలో కుల గణన కోసం 'తెలంగాణ నమూనా'ను స్వీకరించాలని తాము సూచిస్తున్నామన్నారు. ప్రభుత్వం కుల గణన నిర్వహిస్తామని ప్రజలకు చెబుతోంది, కానీ అధికారిక నోటిఫికేషన్‌లో ఈ విషయం లేదు అని పైలట్ అన్నారు. కుల గణన ప్రజల ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకోవడానికి మొదటి అడుగు కాగా, మోదీ ప్రభుత్వానికి కులగణన నిర్వహించాలనే ఉద్దేశం ఉన్నట్లు కనిపించడం లేదని పైలట్ ఆరోపించారు. కుల గణన డిమాండ్‌ను లేవనెత్తే వ్యక్తులు అర్బన్ నక్సల్స్ అని బిజెపి, నరేంద్ర మోడీ చాలాసార్లు చెప్పారు. కుల గణన నిర్వహించడానికి తాము అనుకూలంగా లేమని మోడీ ప్రభుత్వం పార్లమెంటులో సమాధానం ఇచ్చిందని, కానీ, భారీ నిరసనల తర్వాత, ప్రభుత్వం అకస్మాత్తుగా కాంగ్రెస్ డిమాండ్‌ను అంగీకరించి కుల గణన నిర్వహించాలని నిర్ణయించిందని ఆయన అన్నారు.



## పొదుపు తగ్గింది రుణాలు పెరిగాయి : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** భారతదేశంలో సామాన్యుల ఆర్థిక పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని, మోదీ ప్రభుత్వం వాగ్దానం చేసిన'అచ్చే దిన్' (మంచి రోజులు) బదులుగా, రుణాల రోజులు వచ్చాయని కాంగ్రెస్ ఆరోపించింది. దేశంలో ప్రజల ఆదాయం పెరిగినప్పటికీ, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉన్నప్పటికీ, గృహ పొదుపులు వరుసగా మూడవ సంవత్సరం తగ్గాపోయాయని వచ్చిన ఒక మీడియా నివేదికను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో మంగళవారం పోస్ట్ చేశారు.'దేశంలో ప్రజల పొదుపులు తగ్గుతున్నాయి. అప్పులు పెరుగుతున్నాయి! దీని అర్థం ఒకవైపు ద్రవ్యోల్బణం పెరుగుతోంది, మరో వైపు ప్రజల ఆదాయం తగ్గుతోంది. ఫలితంగా, ప్రజలు తమ పొదుపులను ఉపసంహరించుకుంటున్నారు లేదా రుణాలు తీసుకొని జీవించవలసి వస్తుంది' అని ఆవేదన్య వ్యక్తం చేశారు.

## వాళ్ళే రాజీనామా చేయాలి : సిఎం సిద్ధరామయ్య



బెంగళూరు : అహ్మదాబాద్ విమాన ప్రమాదం, గుజరాత్‌లోని మోర్బిలో పాదచారుల సస్పెన్షన్ వంతెన కూలిన ఘట న, ఉత్తరప్రదేశ్‌లో కుంభమేళా సందర్భంగా జరిగిన తొక్కిసలాటకు బాధ్యులైన వారి రాజీనామాను బీజేపీ నాయకులు కోరాలని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కోరారు. బెంగళూరులోని చిన్న స్వామి స్టేడియం సమీపంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించిన ఘటనకు సంబంధించి తనతో పాటు, ఉప ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హోం మంత్రి పరమేశ్వర రాజీనామా కోరుతూ బెంగళూరు ఫ్రీడం పార్కలో నిరసన తెలిపిన ప్రతిపక్ష బిజెపిపై మంగళవారం నాడు ఆయన మండిపడ్డారు. 'గోధ్రా సంఘటనకు , మోర్బిలో 140 మంది మరణించిన వంతెన కూలిపోవడానికి ఎవరు బాధ్యులు?' అని సిఎం ప్రశ్నించారు.తన రాజీనామాను డిమాండ్ చేయడానికి బిజెపికి ఎలాంటి నైతిక హక్కు ఉందని ఆయన ప్రశ్నించారు.

# భయపెడుతున్న విమానాలు

తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు

**న్యూఢిల్లీ :** దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియాకు చెందిన విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ సంస్థకు చెందిన డ్రీమ్‌లైనర్ ఫ్లైట్ ఇటీవలే అహ్మదాబాద్‌లో కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరవకముందే మరిన్ని విమానాల్లో సాంకేతిక సమస్యలు బయటపడుతున్నాయి. తాజాగా ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లే ఎయిర్ ఇండియా ఫ్లైట్‌లోనూ అదే పరిస్థితి తలెత్తింది. ఈ విషయాన్ని ఎయిర్‌లైన్స్ ఓ ప్రకటనలో తెలిపింది. ఢిల్లీ నుంచి పారిస్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఎఐ 143 రద్దు చేసినట్లు తెలిపింది. ముందస్తు విమాన తనిఖీల్లో సమస్యను గుర్తించినట్లు పేర్కొంది. ఫలితంగా బుధవారం పారిస్ నుంచి ఢిల్లీకి రావాల్సిన ఎయిర్ ఇండియా ఎఐ 142ను కూడా తాత్కాలికంగా రద్దు చేసినట్లు వెల్లడించింది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొంది. హోటల్ వసతి సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్లు తెలిపింది. మధ్యాహ్నం అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ సాంకేతిక సమస్య కారణంగా తాత్కాలికంగా రద్దైన విషయం తెలిసిందే. ఎయిర్ ఇండియా విమానం ఎఐ 159 మంగళవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి అహ్మదాబాద్ చేరుకుంది. అక్కడి నుంచి అది లండన్‌లోని గాట్విక్ ఎయిర్ పోర్ట్‌కు బయల్దేరాల్సి ఉంది. అయితే, ముందు విమానంలో సాంకేతిక సమస్య తెలెత్తింది. దీంతో అప్రమత్తమైన అధికారులు విమాన సర్వీసును చివరి నిమిషంలో రద్దు చేశారు. సోమవారం హాంకాంగ్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ రకానికి చెందిన ఎఐ 315 విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని వెనక్కి మళ్లించారు. మంగళవారం ఉదయం కూడా శాన్ ఫ్రాన్సిస్కో నుంచి కోల్‌కతా మీదుగా ముంబై వస్తున్న ఎఐ180 విమానంలో టె క్నికల్ ఇష్యూలు వచ్చాయి. గుర్తించిన పైలట్ తెల్లవారుజామున కోల్‌కతాలో విమానాన్ని నిలిపివేశారు. దీంతో భద్రత దృష్ట్యా ప్రయాణికులను విమానం నుంచి దించేశారు. విమానంలోని ఇంజిన్లలో ఒకటి పనిచేయడం లేదని, దీంతో విమా నం ఎగరడంలో ఇబ్బందులు తలెత్తాయని అధికారులు తెలిపారు. ఇలా వరుస ఘటనలు భయాందోళనకు గురిచేస్తున్నా యి.

**విమానానికి బాంబు బెదిరింపు..**

మరోవైపు ఓ విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. కొచ్చి నుంచి ఢిల్లీ బయలుదేరిన ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో విమానాన్ని నాగ్‌పూర్‌లో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ప్రయాణికులను సురక్షితంగా తరలించిన తర్వాత.. విమానాన్ని తనిఖీ చేశారు. బాంబు లేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు.

## నిజాయితీగా, సమయానికి జనగణన చేయాలి

ఈ ప్రక్రియ ప్రజల సంక్షేమానికి సంబంధించినది : మాయావతి



**లక్నో :** జనాభా గణన అనేది నేరుగా ప్రజల సంక్షేమానికి సంబంధించినదని, నిజాయితీగా, సమయానికి నిర్వహించాలని బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) చీఫ్ మాయావతి అన్నారు. మంగళవారం ఆమె హిందీలో ఎక్స్‌లో వరుస పోస్టులు చేశారు. దేశం నుండి పేదరికం, నిరుద్యోగాన్ని నిర్మూలించగలిగారా అని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కేంద్రంలో 11 సంవత్సరాల పాలనపై బిజెపిని లక్ష్యంగా చేసుకుని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాం నుంచి జాతీయ, కులగణన పెండింగ్‌లో ఉందని, ఈ ప్రక్రియ ఇప్పుడు ప్రారంభమైందన్నారు. జనాభా గణన ప్రజా సంక్షేమానికి నేరుగా సంబంధించినదని, దేశ ప్రయోజనాల దృష్ట్యా దీనిని నిజాయితీగా, సమయానికి పూర్తి చేయాలని ఆమె అన్నారు. భారతదేశం 16వ జనాభా గణనను నిర్వహించడానికి ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, మాయావతి మరో పోస్ట్‌లో రాబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాన్ని రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయని చెప్పారు. కేంద్రంలో బిజెపి 11 సంవత్సరాల పాలనపై వ్యాఖ్యానిస్తూ, పార్టీ సాధించినట్లు చెప్పుకునే విజయాలు నిజంగా ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయా అని ఆమె నిలదీశారు. బిజెపి పేదరికం, నిరుద్యోగం, బాధలు, ప్రజల ఇబ్బందులను నిర్మూలించగలిగిందా? అని నిలదీస్తూ ప్రజలు సరైన సమయంలో సమాధానం చెబుతారన్నారు.

## 'నో ఫ్లయింగ్ జోన్'గా అమర్‌నాథ్ యాత్ర మార్గాలు



**శ్రీనగర్ :** మరికొద్ది రోజుల్లో అమర్‌నాథ్ వార్షిక యాత్ర ప్రారంభం కానుంది. మంచు లింగాన్ని దర్శించుకోవడానికి ఏటా వేల మంది యాత్రికులు యాత్రకు వెళ్తారు. అయితే, ఇటీవల పహల్గామ్‌లో ఉగ్రదాడి జరిగిన నేపథ్యంలో జమ్ముకశ్మీర్ ప్రభుత్వం ఈ యాత్రకు భద్రతను కట్టుదిట్టం చేసింది. ఇందులో భాగంగానే.. అమర్‌నాథ్ యాత్ర వెళ్లే అన్ని మార్గాలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించింది. ఈ మేరకు జమ్ముకశ్మీర్ హోం శాఖ మంగళవారం దీనిపై ఉత్తర్వులు జారీ చేసింది. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సాధారణంగా అమర్‌నాథ్ యాత్రకు పహల్గాం మార్గంతో పాటు బాల్తాల్ మీదుగా యాత్రికులు వెళ్తుంటారు. ఈ రెండు మార్గాలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. ఈ మార్గాల్లో జులై 1 నుంచి ఆగస్టు 10 వరకు మానవ రహిత వైమానిక వాహన వ్యవస్థలు, డ్రోన్లు, బెలూన్లు వంటివి ఎగరవేయడంపై నిషేధం విధించారు. అయితే, అత్యవసర వైద్య తరలింపు, విపత్తు నిర్వహణ, భద్రతా దళాల నిఘా వంటి సందర్భాలలో ఈ ఆంక్షలు వర్తించబోవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటికి సంబంధించిన పూర్తి ఎస్‌ఒపిని త్వరలోనే జారీ చేస్తామని అధికారులు వెల్లడించారు. జులై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానున్న సందర్భంగా సజావుగా, శాంతియుతంగా సాగడానికి ఈ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అంతేగాక, యాత్రికులకు అదనపు రవాణా సదుపాయాలను కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

## ఇండియా కూటమి చెక్కుచెదరదు..

పోయేవాళ్లు పోవచ్చు : అఖిలేష్ యాదవ్



**లక్నో :** ప్రతిపక్ష ఇండియా కూటమి పని అయిపోయిందని, ఆ కూటమిలోని పార్టీల మధ్య సఖ్యత లేదని జరుగుతున్న ప్రచారంపై ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ స్పందించారు. ఇండియా కూటమి చెక్కుచెదరదని, బలంగా ఉన్నదని ఆయన వ్యాఖ్యానించారు. ఎవరైనా కూటమి నుంచి వెళ్లిపోవాలనుకుంటే స్వేచ్ఛగా వెళ్లిపోవచ్చని, ఎవరూ ఆపరన్నారు. అంతేగానీ కూటమిలో ఉంటూ కూటమిని పలుచన చేసే వ్యాఖ్యలు చేయొద్దు అని అఖిలేష్ మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి సత్తా చాటుతుందని అన్నారు. మంగళవారం మధ్యాహ్నం లక్నోలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ తీరుపై ఆయన విమర్శలు గుప్పించారు. మహాకుంభమేళా మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లించనున్నట్లు ప్రభుత్వం చెబుతోందని, అందుకు సంబంధించిన పేర్లను ఎందుకు వెల్లడించడంలేదని ప్రశ్నించారు.

విమాన ప్రమాదానికి కారణమైన వారు రాజీనామా చేయాలి

ఈనెల 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి కారణమైన వ్యక్తులు తమ రాజీనామాలను సమర్పించాలని అఖిలేష్ అన్నారు. 'అహ్మదాబాద్‌లో జరిగిన ప్రమాదం గురించి ఆలోచించండి, ఇప్పటివరకు ఎవరూ రాజీనామా చేయలేదు. ఏమి జరిగిందో ఆలోచించండి వారు బతికి ఉన్న ఒక క్షణం, వారు లేని మరుసటి క్షణం. కొన్ని సెకన్లలో, ప్రజలు తమ ప్రాణాలను కోల్పోయారు. విమానం ఎక్కడ కూలిందో, ఎంత మంది వైద్యులు మరణించారు? ఎంత మంది తమ కుటుంబ సభ్యులను కోల్పోయారు?' అని నిలదీశారు. 'పుల్వామా కోసం రాజీనామాలు అడగడం లేదు, పహల్గామ్ కోసం రాజీనామాలు కోరడం లేదు. కానీ కనీసం ప్రభుత్వం ఈ విమాన ప్రమాదానికి కారణమైన వారు తమ పదవులకు రాజీనామా చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ ప్రారంభమైనప్పటి నుండి, ప్రజలను వారి ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారని, వాటిని 'అధికారంలో ఉన్నవారికి దగ్గరగా ఉన్నవారికి ఇస్తున్నారని' ఆయన మండిపడ్డారు. వారి సొంత ప్రజలకు ఉద్యోగాలు పొందడానికి, అసమర్థులను ఈ పదవుల్లో కూర్చోబెట్టడం జరిగిందా? ఇది సాధారణ సమస్య కాదు' అని యాదవ్ అన్నారు.

## ఇడి విచారణకు మరోసారి రాబర్ట్ వాద్రా డుమ్మా



న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపి ప్రియాంకా గాంధీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా మరోసారి ఇడి విచారణకు డుమ్మా కొట్టారు. తన కుమార్తె స్నాతకోత్సవానికి హాజరు కావడానికి విదేశాలకు వెళ్తున్నానని, తిరిగి వచ్చాక విచారణకు హాజరవుతానని ఇడి అధికారులకు రాబర్ట్ వాద్రా సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా, యుకెకు చెందిన ఆయుధాల కన్సల్టెంట్ సంజయ్ భండారీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో రాబర్ట్ వాద్రా వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడానికే ఇడి సమన్లు జారీ చేసింది. వాస్తవానికి జూన్ 10నే రాబర్ట్ వాద్రా ఇడి విచారణకు హాజరు కావాల్సి ఉంది. కానీ 56 ఏళ్ల వాద్రా తనకు జూన్ 9న ఫ్లూ లాంటి లక్షణాలు ఉన్నాయని, ప్రోటోకాల్ ప్రకారం కొవిడ్ టెస్ట్ చేయించుకున్నానని చెప్పి గైర్హాజరు అయ్యారు. దీంతో ఆయనకు ఇడి మరోసారి సమన్లు పంపింది. 17న తమ ముందు హాజరు కావాలని రాబర్ట్ వాద్రాను ఇడి కోరింది. అయితే, ఈసారి కూడా ఇడి సమన్లను రాబర్ట్ వాద్రా దాటవేశారు.

## కొలీజియం రద్దుచేసి, ప్రభుత్వ ఆధీనంలోకి నియామకాలు

రాజ్యసభ సభ్యుడు, ప్రముఖ సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్



**న్యూఢిల్లీ :**అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్‌వర్మపై ప్రభుత్వం అభిశంసన తీర్మానం తీసుకురావడంలోని అసలు ఉద్దేశం కొలీజియం వ్యవస్థను దూరంచేసి న్యాయమూర్తుల నియామకాన్ని నియంత్రించడమేనని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అన్నారు. సీనియర్ న్యాయవాది అయిన కపిల్ సిబల్ యశ్వంత్‌వర్మకు మద్దతుగా మాట్లాడుతూ 'నేను ఇంతకు ముందు వాదించిన అత్యుత్తమ జడ్జిలలో ఆయన ఒకరు' అని చెప్పారు. జస్టిస్ వర్మ, జస్టిస్ శేఖర్ యాదవ్ కేసులను నిర్వహించడంలో ప్రభుత్వం ఒక ఎంపిక విధానాన్ని కలిగి ఉందని కపిల్‌సిబల్ విమర్శించారు. గత సంవత్సరం 'మతపరమైన' వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ అభిశంసన తీర్మానం కోసం పార్లమెంట్ సభ్యులు రాజ్యసభలో ఒక నోటీస్‌ను సమర్పించారని చెప్పారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రెజిజు జస్టిస్ యశ్వంత్‌వర్మపై అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించడంలో అన్ని రాజకీయ పార్టీలను భాగస్వాములను చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని పార్లమెంట్‌లో బలపరిచారు. జస్టిస్ యశ్వంత్‌వర్మ ఢిల్లీలో హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఆయన నివాసం బయట ఉండే చిన్న ఇంట్లో (ఔట్‌హౌస్)లో నగదు కాలిపోయిన డబ్బు సంచులను కనుగొన్నారు. విలేకరుల సమావేశంలో కపిల్ సిబల్ మాట్లాడుతూ ప్రభుత్వం జడ్జిమెంట్ నియామకాలను తన ఆధీనంలోకి తీసుకునేందుకు కొలిజీయం వ్యవస్థను నిర్మూలించాలనే ఉద్దేశాన్ని కలిగి ఉందనే విషయం స్పష్టమవుతోందన్నారు. జస్టిస్ యశ్వంత్‌వర్మ గురించి కపిల్ సిబల్ మాట్లాడుతూ నేను వాదించిన ప్రభుత్వ న్యాయమూర్తులలో యశ్వంత్‌వర్మ ఒక అత్యంత బాధ్యతాయుతమైన న్యాయమూర్తి ఆయన అని పేర్కొన్నారు. 'మీరు హైకోర్టులో గానీ, సుప్రీంకోర్టులోగానీ ఏ న్యాయవాదిని అడిగినా ఆ న్యాయమూర్తి ఏ చిన్న తప్పు కూడా చేయలేదనే చెబుతారు. మీరు (ప్రభుత్వం) సాక్ష్యమే లేని జడ్జిని టార్గెట్ చేశారన్న విషయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రజల్లో బహిరంగంగా వ్యాఖ్యలు చేసిన సాక్ష్యమే అవసరం లేని జడ్జిని మీరు రక్షిస్తున్నారు' అని సిబల్ తెలిపారు. పబ్లిక్ డొమైన్‌లో జస్టిస్ యశ్వంత్‌వర్మకేసును సుప్రీంకోర్టు ఇన్‌హౌస్ ఎంక్వైరీ రిపోర్టును పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజున ఒక తీర్మానం తీసుకువచ్చేందుకు కిరెణ్ రెజిజు ఆకాంక్షిస్తున్నారని కపిల్ సిబల్ చెప్పారు. దేనికోసం? మీరు శేఖర్‌యాదవ్‌ను రక్షిస్తున్నారు? అని సిబల్ ప్రభుత్వాని గట్టిగా ప్రశ్నించారు.కొలీజియానికి న్యాయమూర్తుల నియామక అధికారం రద్దు చేసి, నేషనల్ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జెఎసి)కి అప్పగించేందుకే ప్రభుత్వం ఈ గేమ్ ప్లాన్ ఆడుతోందని ప్రతిపక్షం ఎందుకు గ్రహించడం లేదని కపిల్ సిబల్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసే కసరత్తు అంతా గేమ్ ప్లాన్‌లో భాగమేనని ఆయన స్పష్టం చేశారు. ఎలాంటి విచారణ, ప్రాసీజర్ లేకుండా ప్రభుత్వం హైకోర్టు జడ్జిపై నిర్ణయం తీసుకుందని సిబల్ ప్రభుత్వాన్ని విమర్శించారు. జడ్జి చెప్పింది వినకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ది గ్భ్రాంతిని కలిగించిందని, ఈ కేసులోకి రాజకీయన్ని తీసుకువచ్చారని ఆయన ఆరోపించారు.

## భారత్ అణ్వాయుధాగారాన్ని 'కొద్దిగా విస్తరించింది'

'సిప్రి' నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ :** భారతదేశం సహా పాకిస్థాన్ తదితర తొమ్మిది అణ్వాయుధ దేశాలలో దాదాపు అన్నీ 2024లో సమీకృత అణ్వాయుధ ఆధునీకరణ కార్యక్రమాలను కొనసాగించాయని, ఇప్పటికే ఉన్న ఆయుధాలను అప్‌గ్రేడ్ చేయడం, కొత్త వెర్షన్‌లను జోడించడం వంటివి చేశాయని గ్లోబల్ థింక్‌టాంక్ నివేదిక తెలియజేసింది. 2024లో భారతదేశం మరొకసారి తన అణ్వాయుధాగారాన్ని కొంచెం విస్తరించిందని, సరికొత్త రకాల అణు సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడం కొనసాగించిందని స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎస్‌ఐపిఆర్‌ఐసిప్రి) ఒక ప్రకటనలో తెలిపింది. అదే సమయంలో పాకిస్థాన్ కూడా 2024లో 'కూడబెట్టే విచ్ఛిత్తి పదార్థం' అయిన కొత్త డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేయడం కొనసాగించిందని, రాబోయే దశాబ్దంలో దాని అణ్వాయుధాగారాన్ని మరింత విస్తరించవచ్చనే విషయం స్పష్టం అవుతున్నదని ఆ నివేదిక తెలిపింది. సిప్రి తన వార్షిక పుస్తకం 2025లో ఆయుధాల స్థితి, నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతపై వార్షిక అంచనాను థింక్‌టాంక్ సోమవారం ప్రారంభించింది.తన ఇయర్ బుక్ విడుదలకు సంబంధించిన ప్రకటనలో భారతదేశం, పాకిస్థాన్ మధ్య ఇటీవల చోటుచేసుకున్న సైనిక సంఘర్షణ గురించి కూడా ప్రస్తావించింది. మే నెలలో రెండు అణ్వాయుధ పొరుగుదేశాల మధ్య నాలుగురోజుల సైనిక సంఘర్షణ పూర్తి స్థాయి యుద్ధానికి దారితీసింది. ఆయుధాల స్థితి, నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతకు సంబంధించి రెండు దేశాల మధ్య ఈ సిప్రి ఇయర్ బుక్ దేశాలవారీగా అంచనా స్థితిని అందించింది. 'దాదాపు ఈ 9దేశాలు అన్నీ అణ్వాయుధాలను కలిగి ఉన్నాయని తెలిపింది. యునైటెడ్ స్టేట్స్, రష్యా, ది యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, చైనా, ఇండియా, పాకిస్థాన్, ది డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (నార్త్ కొరియా), ఇజ్రాయెల్ దేశాలు దాదాపు అన్నీ 2024లో సమీకృత అణ్వాయుధ ఆధునీకరణ కార్యక్రమాలను కొనసాగించాయి. ఇప్పటికే ఉన్న ఆయుధాలను అప్‌గ్రేడ్ చేయడం, కొత్త వెర్షన్‌లను జోడించడం చేశాయని' ఆ ప్రకటన తెలియజేసింది.'జనవరి 2025నాటికి మొత్తం ప్రపంచ జాబితాలో 12, 241 వార్ హెడ్స్ ఉన్నాయన్నది ఒక అంచనా అని తెలిపింది. దాదాపు 9,614 సైనికనిల్వలు సంభావ్య ఉపయోగం కోసం ఉన్నాయి' అని అది పేర్కొం ది.'భారతదేశం 2024నాటికి మరొకసారితన అణ్వాయుధాలను కొద్దిగా విస్తరించుకుంటుందని, న్యూక్లియర్ డెలివరీ వ్యవస్థను అభివృద్ధి చేయడాన్ని నిరవధికంగా కొనసాగిస్తుందని నమ్ముతారు' అని పేర్కొంది. 2025ప్రారంభంలో భారతదేశంపాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు సాయుధ సంఘర్షణగా రూపాంతరం చెందిందని అది తెలియజేసింది. అణ్వాయుధాలపై ఆధారపడ టం పెరిగే దేశాలకు ఇది ఒక గట్టి హెచ్చరికగా పనిచేయాలని న్యూక్లియర్ ఇన్ఫర్మేషన్ ప్రాజెక్ట్ ఎట్ ఎఫ్ఎఎస్ (ఫెడరేషన్ ఆఫ్ అమెరికన్ సైంటిస్ట్స్) అసోసియేట్ డైరెక్టర్ మట్ట్ కోర్డా చెప్పారు.


**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను, అనగా **కొడాలి లహరి, తండ్రి : కొడాలి రాంచందర్ రావు,** అడ్రస్ : సరోజినీ గర్ల్స్ హాస్టల్, ఎన్ఐటి వరంగల్, కాజీపేట. నాకు సంబంధించిన ఎన్ఐటి వరంగల్ సెకండ్ సెమిస్టర్ గ్రేడ్ షీట్ డాక్యుమెంట్ నెం. 961671 గలది నేను 10 జూన్ 2025 నాడు హనుమకొండ నుండి హైదరాబాద్‌కు బస్సులో ప్రయాణించుచుండగా పోయినది. ఎవరికైనా దొరికినచో కింది అడ్రస్, ఫోన్ నెంబర్‌కు తెలియజేయగలరు.

ఇట్లు
**కొడాలి లహరి**
అడ్రస్ : సరోజినీ గర్ల్స్ హాస్టల్, ఎన్ఐటి వరంగల్, కాజీపేట, జిల్లా : హనుమకొండ.
**సెల్ నెం. 8309091244**



**IN THE COURT OF THE HON'BLE Vth JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, HYDERABAD AT HYDERABAD**

**OS. NO. 2157 OF 2025**

BETWEEN:
**Smt. Goteti Rama Naga Kiranmai & Ors. ... Plaintiffs**
AND
**The Tehsildar & Anr. ... Defendants**

To,
All Concerned
**...Defendant No. 2**

Whereas the Plaintiffs named above have filed the aforementioned suit to be declared as the Legal Heirs of Late. Goteti Venkata Veera Bhadra Kishor and the Hon'ble Court has issued Summons to you and posted the matter to **10-07-2025** for your appearance if anybody has an objection.
You are hereby directed to appear in the aforementioned matter at **10:30AM on 10-07-2025**, either in person or through Counsel, failing which the matter will be decided on merits in your absence, as per law.

-BY ORDER OF THE COURT-

**G. RAM BABU**
**ADVOCATE**
Flat No.402, 4th floor, #12-11-1362, Boudh Nagar, Warasiguda, Secunderabad-61.
Cell: 98664 70246

## భువస్ సర్వేకు సహకరించాలి

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: భువస్ సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. 100 రోజుల ప్రణాళికలో బాగంగా 115వ వార్డు బాలాజీనగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని గృహాలను మున్సిపల్ బిల్ కలెక్టర్లు, రెవిన్యూ సిబ్బంది మీ ఇండ్లకు వచ్చి ప్రస్తుతం ఇంటి కొలతలు తీసుకుని , అట్టి కొలతల ప్రకారం పన్నుల హెచ్చు తగ్గులను సవరించడం జరుగుతుందని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త చెదారంను తడి, పోడి చెత్తగా వేరు చేసి తమ ఇండ్ల ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వట్టె రేణుక, మున్సిపల డిఈ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, రెవిన్యూ సిబ్బంది గౌసుద్దీన్, మనోజ్‌కుమార్, శ్వేత, మహ్మద్ రహీం పాల్గొన్నారు.



## జోగులాంబను దర్శించిన డిప్యూటీ సిఎం సతీమణి

ప్రజాపక్షం/ఉండవెల్లి: దక్షిణాకాశీగా ప్రసిద్ధిగాంచిన జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయాలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం మల్లుబట్టి విక్రమార్క సతీమణి నందిని దర్శించినట్లు దేవాలయం కార్య నిర్వహణ అధికారి సురేందర్ కుమార్ ఒక ప్రకటనలో వారు తెలిపారు. జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయంలో అభిషేకాలు కుంకు మార్చన కార్యక్రమాలు చేపట్టినట్లు వారు తెలిపారు. ఆమెను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా దర్శించే కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు.





## ప్రజా సమస్యలు పరిష్కరించాలి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామచంద్రం

ప్రజాపక్షం /మునుగోడు: ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురజా రామచంద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని కొంపెల్లి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆ గ్రామంలో సిపిఐ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రైతులకు పెట్టుబడి సాయం రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,జిల్లా కౌన్సిల్ సభ్యులు బొమ్మరబోయిన లాలు,సూరిగి చలపతి,మండల కార్యవర్గ సభ్యులు ఈ. కైలాస్, ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి బి శంకర్,కట్ట దశరథ, వి వెంకటేశ్వరరావు, మోగుదాల యాదయ్య, పులకరం ఆంజనేయులు, గ్రామ శాఖ సభ్యులు పాల్గొన్నారు.

## సిపిఐ సంస్థాన్ నారాయణపురం 15వ మండల మహాసభ కరపత్రం ఆవిష్కరణ



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండల కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల 15వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ దేశంలో ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు తీర్చడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలను కాల్చి చంపి మావోయిస్టులుగా చిత్రీకరించి అడవులలో ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పేందుకు అమిత్ షా పూనుకున్నారని మావోయిస్టులను అంతం చేయడం ఎవరి తరం కాదని సవాల్ విసిరారు. ఈనెల 27న జరిగే సిపిఐ 15వ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు చిలివేరు అంజయ్య, పొట్ట శంకరయ్య, కలకొండ సంజీవ, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహ, మంచాల జంగయ్య, సింగిల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, రైతు సంఘం సీనియర్ నాయకులు తోకల రామిరెడ్డి, మొగుదాల సత్తయ్య పాల్గొన్నారు.

## గురువయ్య మృతి సిపిఐకి తీరని లోటు



ప్రజాపక్షం/నల్లగొండ (దామచర్ల): సిపిఐ సభ్యుడు పోలేపల్లి గురువయ్య గత కోతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం పార్టీకి తీరని లోటు అని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. దామచర్ల మండలం బొత్తలపాలెం గ్రామంలో గురువయ్య పార్థివ దేహానికి ఎర్రజెండా కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అయన కుటుంబ సభ్యలకు ప్రగాఢ సంతాపం, సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సయ్యద్, సిపిఐ మండల కార్యదర్శి లు ధీరావత్ లింగ నాయక్,అంజనపల్లి రామలింగం,జిల్లా యాదగిరి, మండలం సహాయ కార్యదర్శి ధానావత్ శాంతి, పోలేపల్లి ఉదయ్, జమ్ముల కోటయ్య, లక్ష్మయ్య,పార్టీ సభ్యులు ప్రజాసంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆర్‌టిసి కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి : బత్తుల సుధాకర్

ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్: ఆర్టీసీ కార్మిక సంఘాలపై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి, వారితో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని, 2021/25 వేతనచటాన్ని సవరణ చేపట్టాలని టిఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ పెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బత్తుల సుధాకర్ డిమాండ్ చేశారు. టిఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 21, 22 తేదీలో ఖమ్మంలో జరిగే మహాసభ పోస్టర్‌ను ఆర్టీసీ డిపో ముందు ఆవిష్కరించి మాట్లాడారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ నిబంధనవాళి ప్రకారం ప్రతిరెండు సంవత్సరాలకు ఒకసారి మహాసభలు జరుగుతాయని, రెండు మహాసభల మద్య కాలంలో ఆర్టీసీ పరిస్థితి, కార్మికుల పరిస్థితి, చేసిన ఆందోళనలు, వచ్చిన అనుభవాలను సమీక్షించుకొని, రాబోయే రెండు సంవత్సరాలకు కర్తవ్యాలు రూపొందించుకోంటామన్నారు. జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం, మహిళల అప్రెంటీస్, కాంట్రాక్ట్ ఉద్యోగుల, రిటైర్డ్ కార్మికుల సమస్య పరిష్కారంపై ప్రత్యేకంగా మహాసభ చర్చించనున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు దేగల రవి, ఉప్ప లక్ష్మయ్య, రీజియన్ కోశాధికారి బైరు శ్రీకంట్లం, డిపో నాయకులు రాములు, బర్పటి వెంకన్న, అక్బర్, చెన్నయ్య, ఖలీల్, జిఎస్‌రెడ్డి, ప్రవీణ్, కృష్ణవేణి పాల్గొన్నారు.

## రామకృష్ణకు గోదా పరామర్శ



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి యాదగిరిగుట్ట మండల కేంద్రంలోని ప్రశాంత్ నర్సింగ్ హోమ్‌లో చికిత్స పొందుతున్న (ఉప ముఖ్యమంత్రి పిఆర్వో) ప్రజాపక్షం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ దుడుక రామకృష్ణను మంగళవారం సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరా ములు పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. రోడ్డు ప్రమాద సంఘటన సంబంధించిన వివరాలు తెలుసుకొని వైద్యులు చిదిరాల ఉపేందర్‌తో ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిలపై సమీక్షించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సిపిఐ యాదగిరిగుట్ట మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుంటే రాజీపడేదే లేదు

### రోడ్ల నిర్మాణ పనితీరుపై అధికారులు, కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమీక్ష



ప్రజాపక్షం/మునుగోడు: మునుగోడు నియోజకవర్గంలో కొనసాగుతున్న రోడ్ల అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుంటే రాజీ పడేదే లేదని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు మంగళవారం మునుగోడు నియోజకవర్గం కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ ల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రోడ్ల పనుల పురోగతిపై పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు, రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సాగర్ రోడ్డు నుండి ముష్టిపల్లి వరకు, ముష్టిపల్లి నుండి నాంపల్లి వరకు జరుగుతున్న ఆర్ అండ్ బి రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయని కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. వీటితోపాటు అంగడిపేట నుండి లెంకలపల్లి వరకు చేపట్టబోయే రోడ్డు పనులకు సంబంధించి టెండర్ ప్రాసీజర్ ఎంతవరకు వచ్చిందని ఆరా తీశారు.నాంపల్లి నుండి ఇడికుడ వరకు, ఇడికుడ నుండి కమ్మగూడెం(తెరట్ పల్లి) వరకు ఉన్న పంచాయతీరాజ్ రోడ్లను ఆర్ అండ్ బి రోడ్లుగా మార్చిన తర్వాత వాటి పనులకు సంబంధించి పురోగతి పై ఆరా తీశారు. వీటితోపాటు నియోజకవర్గంలో కింద ఎన్ని రోడ్లకు ప్రపోజల్స్ పంపించారనే విషయాలపై చర్చించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా జరుగుతున్న పిఆర్ రోడ్ల పనుల పురోగతిపై అధికారులు, కాంట్రాక్టర్లతో చర్చించారు. ప్రస్తుతం జరుగుతున్న 57 రోడ్ల పనులు ఎంతవరకు వచ్చాయి ఎప్పటి వరకు పూర్తవుతాయని ఆరా తీశారు.ఇవే కాకుండా మరో 34 పి ఆర్ రోడ్లు టెండరింగ్ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం జరుగుతున్న 89 రోడ్డు పనుల ప్రోగ్రెస్ పై ఫోకస్ పెట్టి ప్రతిరోడ్డు 5.5 మీటర్లు వెడల్పు తో నాణ్యతతో నిర్మించాలన్నారు.నియోజకవర్గం లోని ప్రతి పిఆర్ రోడ్డు 3.75 మీటర్ల నుండి 5.5 మీటర్ల వెడల్పుకి మార్చాలని అధికారులను ఆదేశించారు... నియోజకవర్గంలో ఏ రోడ్డును చూసినా కూడా 5.5 మీటర్ల వెడల్పుతో ఉండాలని సూచించారు.విడతల వారీగా నియోజకవర్గంలోని అన్ని రోడ్లను నిర్మాణం చేసుకోవాలన్నారు. మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా నాణ్యతతో కూడిన రోడ్ల నిర్మాణం కోసం, ప్రభుత్వంతో మాట్లాడి నిధులు తెప్పించే బాధ్యత నాదని అన్నారు..ఈ సమీక్ష సమావేశంలో రోడ్డు నిర్మాణ కాంట్రాక్టర్లతోపాటు, పంచాయతీరాజ్ ఈ ఈ గిరిధర్, ఆర్ అండ్ బి మునుగోడు డి ఈ శరత్ చంద్ర, పి ఆర్ ఎ ఈ సతీష్ పాల్గొన్నారు.

## త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

### నిర్మాణంలో ఉన్న ఇండ్లను పరిశీలించిన నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/దేవరకొండ : ఇందిరమ్మ ఇండ్లు వచ్చిన లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఇంటి నిర్మాణ దశల ఆధారంగా ప్రభుత్వం లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తుందని తెలిపారు. మంగళవారం దేవరకొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని దేవరకొండ మండలం కొర్రతండాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కొర్ర మౌనిక అనే లబ్ధిదారు ఇంటికి వెళ్ళి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇంటి నిర్మాణం ఉందో లేదో పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి సిమెంట్, ఇటుక, స్టీల్ ఎక్కడి నుండి తీసుకువస్తున్నారని అడిగారు. ఇంటి నిర్మాణంలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అడిగగా దేవరకొండ నుండి ఇంటి నిర్మాణానికి అవసరమైయ్యే సామాగ్రిని తెస్తున్నామని, ఇంటి నిర్మాణంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని మౌనిక జిల్లా కలెక్టర్‌కు బదులిచ్చారు. బేస్మెంట్ బిల్లు వచ్చిందా అని అడగగా రూ. లక్ష తన అకౌంట్లో జమ అయ్యాయని లబ్ధిదారు మౌనిక తెలిపారు. కాగా ఇంటి నిర్మాణం లేంటల్ స్థాయికి వచ్చినందున రెండో విడత బిల్లును వెంటనే మంజూరు చేయాలని గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్‌ను ఆదేశించారు. గతంలో ఎక్కడ ఉండేవారని జిల్లా కలెక్టర్ ప్రశ్నించగా ఇంతకు ముందు గుడిసె ఉండేదని, ఆ గుడిసెను తొలగించి దాని స్థానంలో ప్రస్తుతం ఇల్లు నిర్మించుకుంటున్నామని, తమకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి చాలా సహాయం చేసిందని తెలిపారు. ఈకార్యక్రమంలో జిలాల కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్, ఎంపిడివో డానియల్, సంబంధిత అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు ఉన్నారు.

## ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజులు తగ్గించాలి

### విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి : ఎఐవైఎఫ్



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మండలంలో ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజులు తగ్గించాలని, గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత యువజన సమైక్య(ఎఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఎంఈఓకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యా సంస్థలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకే విద్యా సంవత్సరానికి దాదాపు 20 వేల ఫీజులు తీసుకోవడం దారుణం అన్నారు. విద్యాసంస్థలలో పాఠ్యపుస్తకాలు విక్రయించకూడదని నిబంధనలు ఉన్నా పట్టించుకోకుండా పాఠ్యపుస్తకాలు అధిక రేట్లకు అమ్ముతున్నారు. విద్యార్థులు వేసుకునే డ్రెస్సులను సైతం విక్రయిస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన ఐడీ కార్డులను ఇతర సామాగ్రి సైతం అత్యధిక రేట్లకు అమ్మడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం అవుతుందన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలు చేస్తున్నటువంటి విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, నాయకులు అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, రావుల శీను, సంగీ అరవింద్, కంబాల రాజు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాపక్షం/మునుగోడు: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు గోపగోని ఉదయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 20 పైగా బస్ పాస్ ఛార్జీలను పెంచిన నిర్ణయాన్ని అఖిల భారత విద్యార్థి సంఘం ఖండిస్తుందన్నారు. బస్ పాస్ ఛార్జీలు పెంపు ఉపసంహరించకపోతే ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగ నిరసనలు ,ర్యాలీలు చేపట్టి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారా?

### కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ

ప్రజాపక్షం/చందంపేట: నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామ చెంచుకాలనీ ప్రాథమిక పాఠశాలను మంగళవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లడి వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలను చదివిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రులకు సూచించారు. ఎంఈవో చందర్‌తో కలెక్టర్ మాట్లాడుతూ యూనిఫాం, బుక్స్ పంపిణీ చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు కలెక్టర్ చాక్లెట్లు పంపిణి చేసి బాగా చదువుకోవాలని సూచించారు. అంతకు ముందు గ్రామ ప్రజలతో మాట్లాడి ఇందిరమ్మ ఇండ్లు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. చందంపేట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్, వైద్య సిబ్బందితో మాట్లాడి మండలంలో మాతా శిశు మరణాల వివరాలను, మహిళలలో రక్త హీనత, వైద్య చికిత్సలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, గృహనిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి, జిల్లా మైన్స్ సహాయ సంచాలకులు జాకబ్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, డిటిడివో చత్రునాయక్, ఎంఈవో చందర్, తహశీల్దార్ శ్రీధర్ బాబు, ఎంపిడివో లక్ష్మి తదితరులు ఉన్నారు.



## ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు స్థల పరిశీలన



ప్రజా పక్షం/ హాలియా: సాగర్ నియోజకవర్గంలో ఉన్నత విద్యను మరింత అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు ఇబ్రహీంపేటలో గల ప్రభుత్వ భూమిని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ మంగళవారం పరిశీలించారు. సాగర్ నియోజకవర్గానికి మంజూరైన ఇంటిగ్రేటెడ్ మోడల్ పాఠశాలను 20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించేందుకు అధికారులు స్థలాలను పరిశీలిస్తున్నారు. దీనిలో భాగంగానే ఇబ్రహీంపేటలో ఉన్న సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంటుందని రెవెన్యూ అధికారులు జిల్లా అధికారులకు వివరించినట్లు తెలిసింది. దీనిలో భాగంగానే మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ ఇబ్రహీంపేటలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో 25 ఎకరాల ప్రభుత్వ భూమి ఒకే దగ్గర ఎక్కడ లేకపోవడంతో అధికారులు ఒకే ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భూమిని క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. సబ్ కలెక్టర్ వెంట అనుముల తాసిల్దార్ రఘు, సర్వేయర్ విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## సాగర్‌ను సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు



ప్రజాపక్షం/నందికొండ: అంతర్జాతీయ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌ను మంగళవారం ట్రైనీ ఐఏఎస్ ల బృందం సందర్శించింది. తెలంగాణ దర్శనంలో భాగంగా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు జిల్లా శిక్షణ కార్యక్రమంలో భాగంగా నాగార్జున సాగర్ ను సందర్శించారు. దీనిలో భాగంగా నాగార్జునసాగర్ బుద్ధవనం చేరుకున్న వీరు ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్‌తో సమావేశమైన అనంతరం బుద్ధ వనంలోని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్థూప వనం లను సందర్శించి మహా స్తూపం లోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతిని వెలిగించారు. బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రలు ట్రైనీ ఐఏఎస్ లకు బుద్ధ వనం బ్రోచర్లతోపాటు, పంచశీల కండువాలను బహుకరించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్ లు మాట్లాడుతూ కృష్ణానది తీరాన నాగార్జునసాగర్ లాంటి ప్రశాంతమైన వాతావరణంలో బుద్ధవనం సందర్శన మరింత ప్రశాంతత కలగజేస్తుందని అభిప్రాయపడ్డారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ బుద్ధవనం, నాగార్జునకొండ చారిత్రక విశేషాలను, నాగార్జునసాగర్ డ్యాం వివరాలను తెలియజేశారు. వీరితోపాటు తెలంగాణ దర్శన్ డిస్టిక్ ట్రైనింగ్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రోటోకాల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ దండ శ్రీనివాస్ రెడ్డి, విజయ విహార్ మేనేజర్ కిరణ్ తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన



ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ : ఫోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరిత గతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం,పిడియస్ రైస్ అక్రమ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టిసైబర్ నేరాల పై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఆదేశించారు మంగళవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన నెలవారి నేర సమీక్షా సమావేశంలో ఎస్‌పి పాల్గొని మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి అడిగి, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,ట్రిపుల్ డ్రైవింగ్,మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు.ఈ సమావేశంలో ఏఎస్‌పి మౌనిక ఐపీఎస్,అడిషనల్ ఎస్పీ రమేష్,డిఎస్‌పి లు శివరాం రెడ్డి,రాజశేఖర్ రాజు,సైబర్ క్రైమ్ డిఎస్‌పి లక్ష్మీ నారాయణ, సిఐ లు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

## హ్యాండ్లూమ్ రిజర్వేషన్ యాక్ట్‌పై చేనేత కార్మికులకు అవగాహన సదస్సు



ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి : చేనేత మగ్గాలపై ఆధారపడి జీవిస్తూ జీవనోపాధి పొందుతున్న కార్మికుల పరిశ్రమను ఆదుకునేందుకు హ్యాండ్లూమ్ రిజర్వేషన్ యాక్ట్ 1985 అవగాహన సదస్సును నిర్వహించారు. హ్యాండ్లూమ్ ఆర్‌డిడి పద్మ ఆధ్వర్యంలో మంగళవారం పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సహకార భవనంలో చేనేత కార్మికులు, చేనేత కార్మిక అనుబంధ సంఘాల నాయకులు, మాస్టర్ వీవర్స్, వ్యాపారస్తులు, ఉత్పత్తిదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చెన్నై ఆర్డీసీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథ లీగల్ అసిస్టెంట్ దీపక్ వంశీలు కార్మికులకు హ్యాండ్లూమ్ యాక్ట్ గురించి ఆర్టికల్స్ ను వివరిస్తూ పరిశ్రమలను కాపాడుకునేందుకు పొందుపరిచిన చట్టాలను పూర్తిగా వివరించారు. రిజర్వేషన్ ఆ యాక్ట్ ప్రకారం 11రకాల చేనేత ఉత్ప చేనేత ఉత్పత్తులను కేవలం మగ్గాల మీద మాత్రమే ఉత్పత్తులను తయారు చేయాలని మరమగలపై గాని ఇతర ఫ్యాక్టరీల నుండి గాని తయారు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని అవగాహన కల్పించారు. స్పెసిఫికేషను కింద ఇతర మార్గాల ద్వారా చేనేత వస్త్రాలను ఉత్పత్తి చేస్తే చట్ట ప్రకారం నేరంగా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. జియోగ్రాఫికల్ ఇండికేషన్ గుర్తింపు ఉన్నందున ఇక్కత్ చేనేత వస్త్రాలను ప్రభుత్వం నిర్ణయించిన 110 కిలోమీటర్ల పరిధిలో ఉన్న కుటుంబాల నుండి ఉత్పత్తి అయిన వస్త్రాలను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వ్యాపార క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని పరిధిని దాటి వేరే ఇతర పట్టణాలలో గ్రామాలలో మర మగ్గాల, ఫ్యాక్టరీల ద్వారా చీరలు తయారు చేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని యాక్ట్ లో పొందుపరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్, రాష్ట్ర చేనేత నాయకులు తడక రమేష్ టై అండ్ డై అధ్యక్షులు భారత లవకుమార్ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు అంకం పాండు గంజి బసవలింగం చింతకింది రమేష్ వివిధ చేనేత సంఘాల నాయకులు వ్యాపారస్తులు చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు అరికడదాం

ప్రజాపక్షం /నల్లగొండ(నకిరేకల్ ): బాల్యవివాహాలు అరికట్టి ఆడపిల్లల ఎదుగుదలకు సమాజం బాధ్యతతో సహకరించాలని ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శోభారాణి అన్నారు. మంగళవారం తాటికల్ ఉన్నత పాఠశాలలో జరిగిన బాల్యవివాహాల నిషేధ అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ కిశోర బాలికలు సమతుల్య ఆహారం స్వీకరించకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి అన్నారు. కమ్యూనిటీ సోషల్ వర్కర్ ఝాన్సీ మాట్లాడుతూ ఆడపిల్లలకు ఎదురయ్యే లైంగిక వేధింపుల నుండి కాపాడుకోవడానికి ఫోక్సో చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని మాట్లాడుతూ సోషల్ మీడియాలో అమ్మాయిలు మోసపోతున్న విధానాన్ని, మానవ అక్రమ రవాణా గురించి అవగాహన కల్పించారు. జిల్లా బాలల రక్షణ విభాగం సూపర్వైజర్ రమణి మాట్లాడుతూ గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ప్రజ్ఞాపురం వెంకన్న ఉపాధ్యాయులు పండుగ తిరుమలయ్య, మోసంగి హరీష్ చంద్ర, మార్త రాములు, డాక్టర్ సాగర్ల సత్తయ్య, నర్రా వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :** బల్దియా ద్వారా నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్లో అన్ని విభాగాల అధికారులతో సమావేశమై పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, డిఆర్ఎఫ్ కార్యకలాపాలపై సమీక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణ, వాహనాల స్థితిగతులపై వారు సమీక్షించారు. బల్దియా పరిధిలో 66 డివిజన్ లు ఉన్నాయని, ప్రతి డివిజన్ కు ఇద్దరుజవాన్లు, 28 నుండి 35 వరకు పారిశుద్ధ్య కార్మికులు, 501 పారిశుద్ధ్య వాహనాలు అందులో క్రాంప్టర్లు, డోజర్స్,హిటాచిమిషన్స్, టిప్పర్స్, స్వీపర్ మిషన్స్, స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లు తదితర వాహనాలు ఉన్నాయని, మూడు వైకుంఠ రథాల సేవలు అందిస్తున్నట్లు, 440 టన్నుల చెత్త ప్రతిరోజు సేకరణ జరుగుతుందని, 22 డిఆర్సి కేంద్రాలు, హసన్పర్తి లో ఏబీసీ సెంటర్ నిర్వాహణ, రాంపూర్ డంప్ యార్డ్ నిర్వహణపై సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి తెలుపగా పారిశుద్ధ్య నిర్వహణ పటిష్టంగా జరగాలని అన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు

### ఎమ్మెల్యే మురళినాయక్



**ప్రజాపక్షం/గూడూరు:** ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు అందజేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు.మంగళవారం గూడూరు మండలం పోనుగోడు,పడమటి తండా, చిర్రకుంట తండా, అయోధ్యపురం ,మధునాపురంలలో ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఇల్లు మంజూరైన వాళ్ళు దసరా నాటికి గృహప్రవేశం చేయాలని కోరారు. తహశిల్దార్ నాగభవాని స్పెషల్ ఆఫీసర్ శ్రీనువాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కొరిమి రాజ్‌కుమార్‌కు పరామర్శ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సిపిఐ జిల్లా కార్యదర్శి, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ కారు ప్రమాదానికి గురై భూపాలపల్లి లోని ఆసుపత్రిలో చికిత్స పొంది వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నా రు. భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు కలిసి రాజ్ కుమార్ ను పరామర్శించారు. రాజ్ కుమార్ త్వరగా కోలు కోవాలని వెంకట్రాములు ఆకాంక్షించారు. ఏఐటియుసి రాష్ట్ర నాయకుడు పనాస ప్రసాద్, బీసీ హక్కులసాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి చింతకింది కుమారస్వామి, సిపిఐ జిల్లా నాయకులు పరుమాండ్ల రాజయ్య, పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్ కుమార్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్,అధ్యక్షులుభీమనాథునిసత్యనారాయణ,సతీష్ ఉన్నారు.

## పోలీస్ కీర్తిప్రతిష్ఠకు భంగం కలిగించొద్దు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పోలీస్ కీర్తీ ప్రతిష్టలకు భంగం కలిగించే రీతిలో వ్యవహరించవద్దని పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులకు సూచించారు. హన్మకొండ, సుబేదారి, ఏనుమాముల పోలీస్ స్టేషన్లతో పాటు సిసిస్, టాస్క్ ఫోర్స్,యాంటీ డ్రగ్స్ విభాగాల్లో నూతన ఇన్స్ స్పెక్టర్లు బాధ్యతలు చేపట్టిన శివకుమార్, రంజిత్, రాఘువేందర్, సత్యనారాయణ, సతీష్ లు వరంగల్ పోలీస్ కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని మొక్కలను అందజేశారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అప్పగించిన పనులను సమర్ధవంతంగా పనిచేయడంతో పాటు పోలీసులకు వద్దకు వెళ్తే న్యాయం జరుగుతుందని నమ్మకాన్ని పెంచాలని సీపీ తెలిపారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించొద్దు

### హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నగరంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కల్గించవద్దు అని హనుమకొండ సిఐ మచ్చ శివకుమార్ కోరారు. హన్మకొండ బస్టాండ్ దగ్గర ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మంగళవారం ఆటో డ్రైవర్లను పోలీస్ స్టేషన్ కి పిలిపించి వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. బస్టాండ్ దగ్గర ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడాలని అందరూ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, వెహికల్ ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, తాగి వాహనం నడపరాదని సూచించారు. అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానం చేరుస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఏసిపి రవీందర్‌రెడ్డికి సన్మానం



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణం లోని ఏసిపి కార్యాలయం లో నూతనంగా ఏసిపిగా బాధ్యతలు చేపట్టిన ఏసిపి పున్నం రవీందర్‌రెడ్డిని స్థానిక స్వచ్ఛంధ సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో సత్కరించారు. ఏసిపి పున్నం రవీందర్‌రెడ్డిమాట్లాడుచుస్థానిక స్వచ్ఛంధ సంస్థలు చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. స్వచ్ఛంధ సంస్థల సమాఖ్య అధ్యక్షులు, ప్రతిభ సంస్థ నిర్వాహకులు, స్వయంకృషి సంస్థ నిర్వాహకులు బెజ్జంకి ప్రభాకర్, ఛాయా సంస్థ నిర్వాహకులు కోట డేవిడ్, స్వచ్ఛంధ వాలంటీర్స్ కాసుల వెంకటాచారి, మొగిలిచర్ల రాము, గన్‌మెన్ రమేష్, ఏసిపి ఆఫీస్ సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఏసిపి,సిఐ సహా ఇద్దరు అధికారులకు మెమో

### కొండా మురళికి ఎస్కార్ట్ కల్పించడంపై ఆగ్రహం

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ డివిజన్ పోలీసులకు పోలీస్ కమిషనర్ షాక్ ఇచ్చారు. ఎలాంటి రాజ్యాంగ పదవి లేని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళికి ఎస్కార్ట్ కల్పించిన పోలీసు అధికారులపై వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ సీరియస్‌గా స్పందించారు. నిబంధనలకు విరుద్ధంగా కొండా మురళికి ఎస్కార్ట్ కల్పించిన వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్, సీఐ షూకూర్ తో సహా మరో ఇద్దరు అధికారులకు సీపీ సన్ ప్రీత్ సింగ్ మెమోలు జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లుగా పలు మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను కూడా జారీ చేసిన మెమోల్లో సీపీ ఉటంకించారు. మీపై చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలుపాలంటూ పోలీస్ కమిషనర్ మెమోలో అధికారులను వివరణ కోరారు. ఇదిలా ఉండగా కొద్దిరోజుల క్రితం పోలీసు అధికారులు కొండా మురళికి ఎస్కార్ట్ తీసుకెళ్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన విషయం తెలిసిందే. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు కూడా వచ్చాయి. ప్రతిపక్షాలు, సామాన్య జనాలు, ముఖ్యంగా నెటిజన్ల నుంచివిమర్శలు వ్యక్తమవడంతో ప్రభుత్వం సీరియస్‌గా స్పందించినట్లు సమాచారం. అందులో భాగంగానే సీపీ వరంగల్ డివిజన్ పోలీస్ అధికారులకు మెమో జారీ చేసినట్లుగా తెలుస్తోంది.

## మంత్రి పొన్నంతో దొంతి



**ప్రజాపక్షం/నెక్కొండ:** రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ వరంగల్ జిల్లా నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డిని తనక్యాంప్ కార్యాలయంలో కలిసిన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలపైచర్చించారు.నెక్కొండ బస్టాం డ్ అభివృద్ధికి నిధులు కేటాయించాలనిదొంతి మాధవరెడ్డి కోరడంతో సానుకూలంగా స్పందించారు. టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పాలయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# 'భూభారతి'తోనే కొండంత భరోసా

### హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్





**ప్రజాపక్షం/ హనుమకొండప్రతినిధి:** రాష్ట్రం లో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భారతి చట్టాన్ని అమలు చేస్తుందని, భూ సమస్యలున్న వారు భూభారతి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం సూదన్ పల్లి లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రెవెన్యూ అధికారులు భూభారతి రెవెన్యూ సదస్సును నిర్వహించారు.రైతులు, స్థానికులతో కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి భూ సమస్య ఉందని, కాస్తులో ఉన్నారా, సాదాబైనామాకు దరఖాస్తు చేశారా, భూములుఅమ్మినవారికి పాసుబుక్కులు ఉన్నా యా లేదా, భూములకు సంబంధించి ఎలాంటి ఆధారాలతో క్రయవిక్రయాలు చేశారు, తదితర భూ సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో భూ సమస్యను గురించి దరఖాస్తు చేసుకున్నట్లయితే, తహసీల్దార్ సంబంధిత సమస్యపై విచారణ సాగిస్తారని రైతులు, స్థానికులకు సూచించారు. రైతులు తమ భూ సమస్యను పేర్కొంటూ రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదేవిధంగా స్థానికులు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కలెక్టర్ ను కోరగాఅర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందుతాయని, ఇండ్ల కోసం దరఖాస్తులను అందజేయాలని సూచించారు.నాయబ్ తహసీల్దార్ ఎండి. రహీం పాషా, ఆర్ఐ ఫాజిల్, గృహ నిర్మాణశాఖ అధికారులు రవీందర్, సిద్ధార్థ నాయక్, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, ఇతర అధికారులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

### ఇళ్ల పనుల పరిశీలన

**హసన్ పర్తి :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ స్నేహ శబరీష్ లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం హనుమకొండ హసన్ పర్తి మండలం పెంబర్తిలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు స్లాబ్ నిర్మాణా లు, రూఫ్ లెవెల్, బేస్మెంట్ లెవెల్ వర కు చేరుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు జిల్లా కలెక్టర్ పరిశీలించి లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఫోటో క్యాప్చ ర్ చేస్తున్నారాఅనిలబ్ధిదారులు స్వరూప, రజిత, నిర్మల, అరుణ, సమ్మక్క, మం జుల, సులోచన, రాజేశ్వరిలను కలెక్టర్ వివరాలుఅడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణశాఖపిడి రవీందర్, డీఈ సిద్ధార్థ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ రహీం పాషా, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణంలో స్టేషన్‌ఘనపూర్ మొదటి స్థానంలో నిలపాలి

### స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/జనగామప్రతినిధి:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో స్టేషన్‌ఘనపూర్ మొదటి స్థానంలో నిలచే విధంగా అధికారులు కృషి చేయాలని స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణంపైజిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్, అదనపు కలెక్టర్‌లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. కడియం శ్రీహరిమాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై పురోగతి సాధించాలని, లబ్ధిదారులకు సహకరిస్తూ పక్షపాతిగా ఉండాలన్నారు. లబ్ధిదారుల సమస్యలు తెలుసుకొని వారిని ప్రోత్సహించాలని కడియం సూచించారు.స్టేషన్‌ఘనపూర్‌లో పైలట్ ప్రాజెక్టుగా 274 ఇండ్లు మంజూరు కాగా రెండో విడతలో 2212 ఇళ్లు మంజూరు అయ్యాయన్నారు. 1029 ఇళ్లకు మార్కింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ నిర్మాణాల్లో వచ్చే సమ్యలను ఎప్పటికి అప్పుడు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తెలియజేస్తూ సాధ్యమైనంత వరకు ఇండి నిర్మాణం పూర్తి చేసే విధంగా సహకరించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ప్రతి రోజు గ్రామ పంచాయతీల్లో ఉదయం, సాయంత్రం సమావేశాలు నిర్వహించి సమీక్షించాలన్నారు. కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వెంటనే ప్రారంభించాలని, రోజు వారిగా అప్‌డేట్ ఇవ్వాలన్నారు. ఆర్‌డిఓ వెంకన్న, డిప్యూటి కలెక్టర్ సుహాసిని, హనుమంత నాయక్, హౌసింగ్ పిగడి మాతృనాయక్, డిఈ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# న్యాయం, శాంతి, మానవత్వం వర్ధిల్లాలి

### ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి రాజమౌళి




**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:**ప్రపంచంలో సామ్రాజ్యవాదం వెనుకబడిన దేశాలను కబళించాలనే పన్నాగంలో భాగం గా ఇజ్రాయిల్ పాలస్తీనాను ఆక్రమించుకోవడానికి తీవ్రంగా యుద్ధ ప్రయత్నాలు చేయడం అంతర్జాతీయ యుద్ధం నేరమని, వెంటనే పాలస్తీనా ప్రాంతం నుంచి ఇజ్రాయిల్ సైన్యాలు ఆక్రమించిన భూభాగాలను వదిలి వెళ్లాలని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి నేదునూరి రాజమౌళి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలో అంబేద్కర్ సర్కిల్ లో పాలస్తీనా సంఘీభావ దినంగా పాటిస్తూ ప్రదర్శన చేయడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ న్యాయం, శాంతి, మానవత్వం ప్రపంచంలో వర్ధిల్లాలని ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేషన్ అండ్ ఫ్రెండ్షిప్ ఇండియాలో పనిచేస్తుందని తెలిపారు. 20 నెలలుగా పాలస్తీనాలో 55 వేల మందిని ఇజ్రాయిల్ సైన్యం చంపడాన్ని తీవ్రంగా ఖండించారు. జాతుల సమస్య ప్రాంతాల సమస్య అణు యుద్ధాలకు దారి తీయకుండా చర్చల ద్వారా పరిష్కరింపబడాలని, అందుకు భారతదేశం ముందుకురావాలని తెలిపారు. సంఘీభావ ఉద్యమాలు, శాంతి ఉద్యమాలు యుద్ధోన్మాదాన్ని నిరోధించగలవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, శాంతి సంఘం జిల్లా కార్యదర్శి తోట సుధాకర్,నవ చేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, ఎర్ర కుమారస్వామి, రాజు, వెంకటేష్, ప్రవీణ్ కుమార్, మోడెం రాజేందర్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో మలేరియా సర్వే



**ప్రజాపక్షం/వాజేడు:** వాజేడు మండల పరిధిలోని వాజేడు, పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని మరుమూరు, కొప్పుసూరు అయ్యవారిపేట, కడేకల్‌గ్రామాలలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి మలేరియా సర్వే నిర్వహించారు. ఇంటింటి సర్వే నిర్వహించి, నీటి నిల్వలను పారపోయటం, మురుగగుంటలో తిమోపాస్ మందు చాలటం, జ్వరంతో ఉన్న వ్యక్తులకు రక్తపూత సేకరణ నిర్వహించి, పరీక్షలు చేసి వైద్యశాలకు తరలించారు. గ్రామంలో తొమ్మిది రోజుల బాలింతను పరీక్షించి తీసుకోవలసిన జాగ్రత్తలు పాపకు సరియైన వెచ్చదనం ఎల్లప్పుడూ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.వాజేడు వైద్యాధికారి కొమరం మహేందర్, పేరూరు వైద్యాధికారి రాహిల్, హెచ్.వి వెంకట నర్సమ్మ, కోటిరెడ్డి వేణుగోపాల్, హెచ్ ఏ తిరుపతి, శేఖర్, సత్యవేణి,శారద, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదివాసులకు అండగా ఉంటాం



**ప్రజాపక్షం/ములుగుప్రతినిధి:** అడవిపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసులకు ఇల్లు నిర్మించి సదుపాయాలుకల్పించాల్సిన ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా ఇక్కడి నుండి వెళ్ళి పొమ్మంటే ఎలా అని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ జడ్పి చైర్‌పర్సన్ బడే నాగ జ్యోతి ప్రశ్నించారు. ఏటూరునాగారం మండలంలోని రొయ్యూరు సమీపంలోని ఆదివాసులు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు కూల్చివేసే ప్రయత్నం చేయడంపై నాగ జ్యోతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సంబంధిత ఆదివాసీ కుటుంబాలను ఆమె పరామర్శించి ధైర్యం కల్పించారు. బడే నాగజ్యోతి మాట్లాడుతూ అడవిపై ఆధారపడి జీవించే ఆదివాసులను ఆదివాసులు ఇబ్బంది పెడుతున్నారనిఆవేదనవ్యక్తం చేశారు. ఇండ్లలో ఉండగానే అటవీశాఖ అధికారులు యంత్రాలతో కూల్చివేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఆదివాసీలను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓటుల దండుకునేందుకు ఇచ్చిన హామీలు మర్చిపోయారా అంటూ మంత్రి సీతక్కను ప్రశ్నించారు. జీవించే హక్కును అధికారులు కాలరాస్తున్నారని ఆదివాసులు జీవించకూడదా అని ప్రశ్నించారు. అటవీశాఖ అధికారులు ఇలాంటి చర్యలు పునరావృతం చేస్తే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఆదివాసులకుతాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ కూనూరు అశోక్, మండల కమిటీ అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజా పాషా, దున్నపునేని కిరణ్, కాళ్ళ రామకృష్ణ, కుమ్మరి చంద్రబాబు, ఆదివాసీలు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌నగర్ గరీబ్‌బస్తీవాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

### కలెక్టర్ సత్యశారదకు వినతి



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ నగర్ గరీబ్ బస్తీ వాసులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని దళిత రత్న, మహజన సోషలిస్టు పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కళ్లెపల్లి ప్రణయ్‌దీప్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో మంగళవారం నర్సంపేట ఎమ్మెల్యేమాధవరెడ్డి ఆధ్వర్యంలో ఎంఎస్‌పి, డిబిడిపిఎస్ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డులోని అంబేద్కర్ నగర్, గరీబస్తీ వాసులకు గత ఐదు సంవత్సరాలుగా ఎంఎస్‌పి, డిబిడిపిఎస్ నాయకులతో 150 మందికి పైగా గుడిసెలు వేసుకోని ఐదు సంవత్సరాలుగా జీవిస్తున్నారని, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు.డిబిడిపిడి జాతీయ అధ్యక్షుడు అందే రవి, బోయిన్ నారాయణ, జలగం రమేష్, మునిగ యాకుబ్,దామెర సుధాకర్,బాబు,రాజుయాదవ్,రాజ్ కుమార్, రామోజీ, వీరేశం, నరేష్, ఉప్పన్న, యాకయ్య, సమ్మక్క, సరోజన, సారమ్మ, మమత, సుమలత, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## 19న ప్రైవేటు రంగంలో జాబ్‌మేళా

### ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులలో శిక్షణ పొందిన ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్, పిజి విద్యార్థులకు, ప్రయివేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు ఈ నెల 19న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ దివాకర టిఎస్ మంగళవారం తెలిపారు. జిల్లా కేంద్రంలో టాస్క్ రీజినల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతలో ప్రతిభ నైపుణ్యాలు పెంపొందించడానికి టాస్క్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణ పొందిన నిరుద్యోగ యువతకు హైదరాబాద్, ములుగు, వరంగల్‌లలోని సాబిక్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్, సిఏఎస్ఎస్4యూ, టాటా ట్రీవ్, జస్ట్‌డియల్, జహ్నవి కమ్యూనికేషన్, హెచ్‌డిబి ఫైనాన్స్, షాన్ముక్ బయో ఆర్గానిక్స్, ముథూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ , తదితర కంపెనీల్లో ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు కలెక్టర్‌కు తెలిపారు.

# అట్రాసిటి కేసుల్లో త్వరితగతిన న్యాయం

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ఎస్సీ, ఎస్టీ అట్రిసిటీ కేసులలో త్వరితగతిన సత్వరం న్యాయం అందించేలా అధికార యం త్రాంగం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, అత్యాచార ఘటనలపై జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణకమిటీ సమావేశం జరిగింది. రిజ్వాన్ బాష షేక్, డిసిపి రాజమహేంద్రనాయక్, ఏసిపి పండరీ చేతన్ ముఖ్యఅతిధిగామాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ కేసులు, వాటి పరిష్కారం తీరుపై కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తెచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులను త్వరగా పరిష్కరించడంతో పాటు వచ్చిన బడ్జెట్ ప్రకారం పెండింగ్ లేకుండా బాధితులకు నష్ట పరిహారం అందించాలన్నారు. జిల్లాలో సివిల్స్ రైట్స్‌డే కార్యక్రమంలో కమిటీ సభ్యులు బాగస్వాములు కావాలని, ఎస్సీ సబ్ క్యాటగిరి బిల్, సివిల్స్‌డే కార్యక్రమంలో ప్రజలకు విస్తృత ప్రచారం, అవగాహన నిర్వహించాలన్నారు.స్పెషల్ డిప్యూటి కలెక్టర్ సుహాసిని, ఏసిపిలు, డిఎస్‌డి విక్రమ్, డిపిఓ స్వరూప, జిల్లా మత్స్యశాఖ అధికారి రాణా ప్రతాప్, డిఈఓ భోజన్న, ఈడి ఎస్సీ కార్పొరేషన్ మాధవిలత, కమిటీ సభ్యులు ఉపేందర్, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

### ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ స్థలం పరిశీలన

జనగామ మండలం పెంబర్తి గ్రామ సమీపంలో 106 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలములో రూ 5 కోట్లతో నిర్మించనున్న మహిళా శక్తి భవనంకు అనువైన స్థలాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి వసంత, పంచాయితీ రాజ్ ఈఈ శ్రీనివాసరావులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ పరిశీలించారు. జిల్లాగ్రామీణాభివృద్ధిశాఖఅధికారివసంత, పంచాయితీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### పక్కాగా భూగర్భ జలాల పరిరక్షణ

భూగర్భ జల వనరుల పరిరక్షణలో జనగామ జిల్లా ముందుండాలని కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు.భూగర్భ జలాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయ, ఇరిగేషన్, పంచాయితీ రాజ్ అధికారులతో చర్చించారు.

## రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్క అర్హుడికీ ఇల్లు

### భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



**ప్రజాపక్షం/వాజేడు:** ప్రతి పేదవాడు కల ఇందిరమ్మ ఇండ్లు అని ప్రతి ఒక్క పేదవాడి కల సాకాకారం చేయాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని శ్రీకారం చుట్టిందని భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. వాజేడు మండలంలోని రైతు వేదికలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్లు పత్రాలు పంపిణీ జరిగింది. మంజూరు పత్రాలు లబ్ధిదారులకు ఎమ్మెల్యే వెంకట్రావు, జిల్లా కలెక్టర్ టీఎస్, దివాకర్ అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి దపాలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందని రానున్న నాలుగేళ్లలో ప్రతి ఒక్క పేదవాడికి సొంత ఇంటికి కలను నిజం చేస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు.

### మూడు నెలల్లో పూర్తి చేయాలి

### ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర్

లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇండ్లు మూడు నెలల్లో ఇల్లు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారు పూణెం గౌరమ్మ, తల్లడి సౌజన్య ఇంటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో కడుతున్న నాలుగు రూములతో షాపింగ్ కాం ప్లెక్స్ పరిశీలించారు. వాజేడు ఎస్సై జక్కుల సతీష్ ఆధ్వర్యంలో భద్రతచర్యలు చేపట్టారు. ములుగు డిసిఓ సర్దార్ సింగ్, మండల తహసిల్దార్‌శ్రీరాములశ్రీనివాస్,ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి, హౌసింగ్ ఏఈ ఇసాక్, మండల విద్యాశాఖ అధికారి తేజావత్ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, నాయకులు కళ్యాణ్ బాబు, జగన్ బాబు, చెన్నం ఎల్లయ్య ఉన్నారు.

## సంక్షేమ బోర్డు కార్యాలయం ముట్టడి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:**భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ భవన నిర్మాణ కార్మికులు హైద్రాబాద్ లోని భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, బిల్డింగ్ వర్కర్ యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ రహ్మతుల్లా, హౌస్




పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మధిర పట్టణంలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

**ప్రజాపక్షం/ మధిర:** మధిర పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో భాగంగా బుధవారం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణగుప్త తెలిపారు. మధిర పట్టణ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.8.20కోట్లతో నిర్మించనున్న నూతన ఆర్‌టిసి బస్టాండ్ పనులకు శంకుస్థాపన, నూతన బస్సుల ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో రాష్ట్ర, జిల్లా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు,అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



## భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభల నిర్వహణ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి అమలులో భాగంగా భూసమస్యల పరిష్కారం కోసం రైతు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మన్నె ఉషాశారద తెలిపారు. మండల పరిధిలోని పెద్దగోపవరం, కంద్రిక, బంజర గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో రైతులకు ఉన్న అన్ని సమస్యలు భూ భారతి చట్టంతో పరిష్కరించేందుకు రైతు సదస్సుల ద్వారా ఆయా గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను రైతుల ద్వారా తెలుసుకుని దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. పెద్దగోపవరం రైతు సదస్సులో 120దరఖాస్తులు, కంద్రి, బంజర గ్రామాల్లో 67 దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.కార్యక్రమంలో ఆర్ఐలు , ఎఎస్ఓ జాన్‌దర్గాసాహెబ్, యుడిసి శిరీష, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకులు గుడిదే సుబ్బయ్య మృతి



**ప్రజాపక్షం/ బోనకల్:** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు గుడిదే సుబ్బయ్య(85) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ సుబ్బయ్య తుది శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మి సిపిఐలో కొనసాగుతూ అనేక ఉద్యమాల్లో పాల్గొని ఆయన చేసిన సేవలు కొనియాడారు. సుబ్బయ్య కుమారుడు ప్రస్తుతం సిపిఐ గ్రామ కార్యదర్శిగా ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :**మండల పరిధిలోని సఖినవీడు గ్రామానికి చెందిన అల్లు దేవదాస్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయటం జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారి కుమారుడైన అల్లు వంశీకి అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల వైద్య సేవలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సఖినవీడు గ్రామశాఖ అధ్యక్షుడుపసుపులేటి వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌గా తనదైన ప్రత్యేకతను చాటారు

### కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసిన దయాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్‌గా సుమారు ఏడాది కాలం పాటు విధులు నిర్వహించిన ముజమ్మిల్ ఖాన్ పాలనలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఖమ్మంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దయాకర్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శాలువాతో సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బదిలీ అయ్యే వరకు నిబద్ధతతో పని చేశారన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలి

### యుపిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్ఒ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం యుపిహెచ్‌సిని డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ కళావతి బాయి సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. యుపిహెచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలపై సమీక్షించారు. ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ సిబ్బంది డ్యూటీ ఛార్ట్, ల్యాబ్ టెక్నీషన్ సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో డయేరియా నివారణకు జూన్ 16 నుంచి ప్రారంభమైన స్టాప్ డయేరియా కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు.ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఆశాలు, ఎఎన్ఎంలు అందుబాటులో ఉండాలని, పారా మెడికల్ సిబ్బంది విధులను పర్యవేక్షించాలని వైద్యులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సర్వీస్ రూల్స్ ప్రకారం సిబ్బందిపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణచైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట, అంగన్ వాడీ బాట



**ప్రజాపక్షం/సత్తుపల్లి;**మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల అంగన్ వాడి సెంటర్లలో అమ్మ మాట, అంగన్ వాడీ బాట కార్యక్రమంలో అంగన్ వాడి బాట కార్యక్రమంభాగంగా సిడిపిఒ ఎస్.కె మెహరున్నీసా బేగం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్ వాడీ సెంటర్‌లో పది మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించి, తల్లులకు పోషకాహారం గురించి వివరించి, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు ప్రీస్కూల్ ఆవశ్యకత గురించి తల్లులకు అవగాహన కల్పించారు. స్కూల్ హెచ్ఎం సాంబశివరావు, స్కూల్ టీచర్ ప్రమీల, సెక్టార్ సూపర్ వైజర్ గంగాజలం, అంగన్ వాడీ టీచర్లు ,ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు హాజరైనారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కు మోక్షం ఎప్పుడు...?



**అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా భవనం..**

**సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్న బడాబాబులు..**

**ప్రజాపక్షం/మణుగూరు:**పట్టణ పరిధిలో వ్యాపారుల సౌలభ్యం కోసం రూ. 4.70 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కు మోక్షం ఎప్పుడు కలుగుతుందా అని చిరు వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. వ్యాపార సముదాయాలని ఏక ప్రాంతంలో తేవాలని అభీష్టంతో 2021లో స్థానిక రాజీవ్ గాంధీ నగర్ ఏరియాలో కోట్ల




రూపాయలతో ప్రారంభించిన మార్కెట్ భవనం నేటి వరకు అసంపూర్తిగా నిర్మాణం కావడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ భవనం పూర్తయితే వ్యాపారాలు చక్కదా చేసుకోవచ్చని ఎదురుచూస్తున్న వ్యాపారులకు ఈ సంవత్సర వర్షాకాలం కూడా నిరాశే మిగిల్చింది. పట్టణ పరిధిలోని ప్రధాన రహదారిపై నిత్యం బొగ్గు, ఇసుక లారీలతో నిండి ఉండటం ఇక్కడ వ్యాపారులకు శాపంగా మారింది. పట్టణ ప్రాంతంలో వ్యాపారాలు లేక అనేక మంది వ్యాపారస్తులు అప్పుల పాలై, ఐపిలు పెట్టి కుటుంబ పోషణ కోసం వేరే ప్రాంతాలకు వలస పోతున్న దుస్థితి మన మణుగూరు ప్రాంతంలో ఉంది. ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే వీధుల్లో వ్యాపారాలు చేస్తున్నా అనేక మంది వ్యాపారులకు ఆసరా లభిస్తుందని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ భవన నిర్మాణం నత్తనడకన నడవడంతో ఈ భవన సముదాయాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయని, రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డాలుగా మారాయని, అదేవిధంగా గంజాయి బ్యాచ్‌కు కూడా అనువుగా ఈ ప్రాంతం ఉండటంతో రాత్రి వేళలో అనేక మంది ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి మణుగూరు వ్యాపారులకు అండగా నిలవాలని అదే విధంగా ఈ ప్రా ంతంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను ని ర్మూలించాలని ప్రభుత్వ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్ పంపిణీ ప్రక్రియ సాఫీగా జరుగుతుందని ఈనెల 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ తెలిపారు. మంగళవారం డిసిఎస్ఒ చందన్‌కుమార్ ఖమ్మం అర్బన్ మండలంలోని శ్రీనివాసనగర్, ప్రకాష్ నగర్ లలోని రేషన్ షాపులను డిప్యూటీ తహసీల్దార్ ఎం. వెంకటేశ్వర్లు తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చందన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెలలో మూడు నెలల రేషన్‌ను రేషన్‌కార్డుదారులకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు.ఖమ్మంజిల్లాలో ఉన్న 4,15,904 రేషన్ కార్డులకు ఇప్పటి వరకు 3,03,596 రేషన్ కార్డు దారులకు రేషన్ షాపుల నుంచి మూడు నెలల రేషన్ బియ్యం అందిందన్నారు. డిప్యూటీ తహసీల్దార్‌లు చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఖమ్మం అర్బన్, పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, తల్లాడ మండలాల్లో బియ్యం అక్రమ రవాణాదారులపై 6ఎ కేసులు నమోదు చేసి రూ.7.29 లక్షల విలువైన 213 క్వింటాళ్ల సన్న బియ్యంతో పాటు మూడు వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రేషన్ డీలర్లు రేషన్‌కార్డుదారులకు మూడు నెలల బియ్యం సక్రమంగా అందించాలని జూన్ 30 వరకు అన్ని రేషన్ షాపులు తెరిచి ఉంచి బియ్యం పంపిణీ చేయాలన్నారు. సన్న బియ్యం బయట విక్రయిస్తే రేషన్‌కార్డు రద్దు చేయడం జరుగుతుందని కొన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చందన్‌కుమార్ తెలిపారు.

## రూ. 193.44 కోట్లు రైతుల ఖాతాల్లో జమ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతు భరోసా వానా కాలంకు సంబంధించి రూ.193,4 4,97 ,64 3 లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య మంగళవారం తెలిపారు. ప్రభుత్వం వానా కాలానికి సం బంధించి రైతు భరోసా నిధులను విడుదల చేసిందని సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చే స్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లాలో రైతు భరోసాకు సంబంధించి 3,53,794 మంది రైతులకు గాను మొత్తం రూ. 436,84,65,365 జమ చేయాల్సి ఉందన్నారు. మొదటి రోజు అనగా ఈనె ల 16న ఎకరం, రెండు ఎకరాల లోపు ఉన్న 2,1 3,932 మంది రైతులకు రూ. 123, 38. 40, 17 5 జమ చేయడం జరిగిందన్నారు. ఈనెల 17 న మంగళవారం మూడు ఎకరాల వరకు భూమి గల 46,859 మంది రైతులకు రూ.70 ,06, 57, 46 8 లను రైతుల ఖాతాల్లో జమ చేసిన ట్లు ఆయ న తెలిపారు. ఇప్పటి వరకు 2,60,7 91 మంది రైతులకు రూ. 193,44,97,643 రైతుల ఖాతా ల్లో జ మ చేయడం జరిగిందన్నారు. 2025 జూన్ ఐదు నాటికి పట్టాదారు పాసు పుస్తకం పొ ందిన రైతులు డిబిటి ఫెయిల్ అయిన రైతు సోదరులు సంబంధిత ఏఈవోలను సంప్రదించి రైతు భరోసా కోసం ఖాతా నెంబర్‌ను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## పింఛన్‌దారులకు ఆశనిపాతంలా కేంద్ర చట్టం




**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం పింఛన్ దారులకు ఆశనిపాతంలా మారనుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఖమ్మంజిల్లా అధ్యక్షుడు పరిశ పుల్ల య్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మార్చి మాసంలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన ఈ చట్టంతో దేశ వ్యాప్తంగా పింఛన్‌దారులు పలు సమస్యలను ఎదుర్కొనున్నారని ఇం దుకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలకు, ఆందోళనలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం కృషి భవన్‌లో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో పు ల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టా న్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఇప్పటికే ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసిందని సంతక సేకరణ చేపట్టాలని పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. పెన్షనర్లకు డిఆర్‌ను నగదు పూర్వకంగా చెల్లించాలని, పదవీవిరమణ తర్వాత బకాయిలను సత్వరమే చెల్లించాలని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పింఛన్ దారులకు వైద్య సౌకర్యం ఉందని చెబుతున్న అది అమలులో సాధ్యం కావడం లేదని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని పుల్లయ్య కోరారు. సమృద్ధిగా మందులను సమకూర్చడంతో పాటు విస్తృత సేవలు అందించే ప్రాతిపదికన వెల్‌నెస్ సెంటర్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలపై విడతల వారీగా ఆందోళనకు సిద్ధం కావాలని సంఘం పక్షాన పిలుపునిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలు మాత్రమే సమస్యల పరిష్కారానికి దోహదపడతాయన్నారు.సమావేశంలో ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, సహాధ్యక్షుడు భాస్కరాచారి, తదితరులు పాల్గొన్నారు.

# తీర్పు తర్వాతే 'స్థానిక' సమరం

### రిజర్వేషన్లు తేలిన తర్వాతే ఎన్నికలు

### బిసి రిజర్వేషన్‌పై తర్జన భర్జన

**ప్రజాపక్షం/ఖమ్మం :** స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇప్పట్లో నోటిఫికేషన్ వెలువడే సూచనలు కనిపించడం లేదు. ఒకరిద్దరు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు జూన్ మాసంలో చివరిలో నోటిఫికేషన్ విడుదలై జూలై మొదటి వారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని క్యాడర్‌ను సన్నద్ధం చేసేందుకు ప్రకటించిన ఆ అవకాశం లేదని స్పష్టమైంది. బిసి రిజర్వేషన్లు తేలకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే ప్రతికూల ఫలితాలు వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. రాష్ట్రంలో జనగణన జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి కొంత సానుకూల అంశంగా మారింది. దేశ వ్యాప్తంగా కూడా తెలంగాణలో జరిగిన జన గణనకు సంబంధించి చర్చ సాగుతున్న తరుణంలో జన గణనకు అనుగుణంగా రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే బిసి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలని బిసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా సదస్సులు, సమావేశాలు, సభలు కూడా నిర్వహించారు. ప్రభుత్వం సైతం ఇందుకు అనుగుణంగానే రిజర్వేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లింది. రిజర్వేషన్ వ్యవహారం న్యాయస్థానంలో ఉండగానే పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించడం సబబు కాదన్న వాదన వినపడుతుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు వచ్చినా రాకున్నా కాంగ్రెస్ పార్టీ మాత్రం బిసి జనాభాకు అనుగుణంగా స్థానాలు కేటాయిస్తుందని ప్రకటించారు. అప్పుడు బిసి సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. పార్టీ పరమైన రిజర్వేషన్ కాదని చట్టపరమైన రిజర్వేషన్ జరగాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌కు వెళితే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయి. మరికొన్ని సానుకూల అంశాలు ప్రభుత్వ పరంగా జరిగిన తర్వాత ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. ఇప్పుడు సహకార సంఘాలు మినహా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లు ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018ని తీసుకు వచ్చింది. ఇతరత్రా నిబంధనలతో పాటు రిజర్వేషన్ ప్రక్రియ రెండు ఎన్నికలకు ఒకసారి మారే పద్ధతిలో చట్టాన్ని రూపొందించారు. ఆ చట్టం ప్రకారం ఎన్నికలు జరిపితే గ్రామ పంచాయతీల్లో పాత రిజర్వేషనే కొనసాగుతుంది. ఇప్పుడున్న రిజర్వేషన్ మారాలంటే పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేయాల్సి ఉంటుంది. మార్పులు జరిగితే తిరిగి రిజర్వేషన్ ప్రక్రియలో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ కల్పించాల్సి ఉంది. ఇంత ప్రక్రియ జరగాల్సిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తొందరపడి స్థానిక ఎన్నికలకు పోక పోవచ్చు. సోమవారం జరిగిన కార్యక్రమాల సందర్భంగా ఇష్టాగోష్టిలో కోర్టు తీర్పు తర్వాతే స్థానిక ఎన్నికలకు పోవాలన్న భావన వ్యక్తమైనట్లు తెలుస్తుంది. వీటన్నింటి దృష్ట్యా స్థానిక సమరానికి మరి కొంత కాలం వేచి చూడక తప్పదు.

## అంగన్వాడీలకు కార్పొరేట్ స్థాయి వసతులు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అంగన్వాడీలకు కార్పోరేట్ స్థాయి వసతులు కల్పించి అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అమ్మమాటఅంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ పాతపాల్వంచ మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు మంగళవారం బ్యాగులు, పలకలు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్వాడీల్లో విద్యుదీకరణ, తాగునీరు,మరుగుదొడ్లు వంటి మౌళిక సదుపాయాలు కల్పించి పిల్లలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల మానసిక, భౌతిక అభివృద్ధికి తగిన తరగుతులు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఖరీదైన బడుల్లో చేర్పించి ఆర్థికంగా చితికిపోకుండా అధునాతన అంగన్వాడీల్లో చేర్పించి చదివించాలన్నారు. ప్రభుత్వ బడుల్లోనే పిల్లలకు బలమైన పునాదులు పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్, మహిళా శిశు వయోవృద్ధులు, దివ్యాంగుల అధికారి స్వర్ణలత లెనినా, ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# యండపల్లి గట్టు ఇక గతమే!

### జాతీయ రహదారుల నిర్మాణంతో కనుమరుగు




**ప్రజాపక్షం/ఖమ్మం :** మధిర మండలంలో చారిత్రికంగా చెప్పుకునే అంశాలలో యండపల్లి గట్టు ఒకటి. వైరా, మధిర మధ్య ప్రయాణించే వారికి తూర్పు దిక్కుగా కనిపించే ఎత్తయిన కొండనే యండపల్లి గట్టు అంటారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉంటుంది. ఒకప్పుడు ఇక్కడ యండపల్లి అనే ఊరు ఉండేదని పూర్వీకుల నుంచి ఓ కథనం ప్రచారంలో ఉంది. అందుకు అనుగుణంగా మధిర మండలంలో యండపల్లి రెవెన్యూ గ్రామం ఇప్పటికీ ఉంది. అక్కడ గ్రామానికి సంబంధించిన కనీస అనవాళ్లు లేకున్నా రెవెన్యూ రికార్డులో మాత్రం యండపల్లి గ్రామ రెవెన్యూ పేరిట సుమారు 1500 ఎకరాల భూములు ఉన్నాయి. దాదాపు ఐదారు కిలోమీటర్ల చుట్టు కొలత కలిగిన ఈ గుట్ట రాళ్ల మధ్య ఒక చిన్ని నీటిగుంట ఉండేదని రోహిణి కార్తె మొదలు ఏ సమయంలోనైనా నీరు ఒకే మట్టంలో నిల్వ ఉండేదని ఈ గుంటలోని నీటిని అప్పట్లో చర్మవ్యాధులు తగ్గించేందుకు వినియోగించే వారని స్థానికులు చెబుతుండే వారు. చారిత్రిక ప్రశస్థం కలిగి చుట్టూ 30 గ్రామాలకు ఎత్తయిన గుట్టగా కనిపించే యండపల్లి జాతీయ రహదారుల నిర్మాణంతో కనుమరుగు కానుంది. రహదారుల నిర్మాణానికి అవసరమైన మట్టి కొరకు ప్రభుత్వం ఈ గుట్ట మట్టిని కేటాయించారు. నాగపూర్ అమరావతి జాతీయ రహదారి రెండవ జోన్ నిర్మాణానికి మట్టిని కేటాయించినట్లు తెలుస్తుంది. ఈ జాతీయ రహదారి కూడా యండపల్లి గట్టు సమీపం నుంచే వెళ్తుండడం గమనార్హం. ఇప్పటికే 20 శాతం గుట్టను తవ్వి తరలించారు. ఏడాది రెండేళ్లలో గుట్ట కనుమరుగు కానుంది. గుట్ట తరలించుకు పోయిన తర్వాత ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మధిర శాసన సభ్యులు మల్లు భట్టివిక్రమార్క పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భావించరు. అందుకు అనుగుణంగా రూ. 84 కోట్లతో ఇండస్ట్రీయల్ పార్కును ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇండస్ట్రీయల్ పార్కుకు ప్రధాన రహదారుల నుండి లింక్ రోడ్లను కూడా పూర్తి చేశారు. ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధి చెందితే రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఒక పారిశ్రామిక ప్రాంతం ఒక నవీన గ్రామం రూపుదిద్దుకుంటుంది. అప్పుడు యండపల్లి గట్టు కనుమరుగైన ఒక పారిశ్రామిక ప్రాంతాన్ని త్వరలోనే చూసే అవకాశం ఉంది.

## మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

### యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

### కలెక్టర్, ఎస్పి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాను మాదకద్రవ్యరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పి రోహిత్ రాజ్ అన్నారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చక్కగా చదువుకుని జీవితాల్లో స్థిరపడాలన్నారు. ఇందుకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, గంజాయి,మత్తు పదార్థాలు వినియోగించకుండా కళాశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలన్నారు. విద్యాసంస్థల్లో నిర్వహించే పేరెంట్స్ సమావేశాల్లో మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి అలవాట్ల భారిన పడిన వారు ఉంటే వెంటనే సమాచారం అందిస్తే ప్రభుత్వం పరంగా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసి మత్తు పదార్థాల రవాణా సాగకుండా చూడాలన్నారు. గంజాయి సాగుపై దృష్టి సారించి నివారించాలన్నారు. ప్లాస్టిక్ నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం,రవాణా చేసినా పిడి యాక్టు నమోదు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఇల్లందు డిఎస్‌పి రమణ మూర్తి, జిల్లా వైద్యాధికారి భాస్కర్ నాయక్, విద్యాధికారి వెంకటేశ్వరాచారి, ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## సచిన్ జోక్యంతో దిగొచ్చిన ఇంగ్లాండ్

# విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్'!



భారత క్రికెట్ జట్టు ఇంగ్లాండ్ పర్యటన ఖరారైనప్పటి నుంచి పటౌడీ ట్రోఫీ గురించి చర్చ కొనసాగుతోంది. అందుకు కారణం ఈ ఏడాది నుంచి ఇరు దేశాల దిగ్గజాలు సచిన్ అండర్సన్ పేర్లతో ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లాండ్ ప్రకటించడమే. ఈ నేపథ్యలో భారత లెజెండరీ ఆటగాళ్లు సునీల్ గవాస్కర్, బీసీసీఐ పెద్దలు పటౌడీ పేరు మార్చవద్దని ఈసీబీకి విన్నవించారు. సచిన్ టెండూల్కర్, ఐసీసీ ఛైర్మన్ జై షాలు సైతం ఆనవాయితీ ప్రకారం ఆయన పేరుతో ట్రోఫీ జరపాలని సూచించారు. ఈ ఇద్దరి విజ్ఞప్తితో దిగొచ్చిన ఇంగ్లాండ్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.

'ఈ ఏడాది నుంచి భారత్, ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌ను పటౌడీ పేరుతో కాకుండా సచిన్–అండర్సన్ ట్రోఫీగా నిర్వహించాలని ఈసీబీ నిర్ణయించింది. అయితే.. అలా చేయడం దిగ్గజ ఆటగాడైన పటౌడీని అగౌరపరచడమేనంటూ పలువురు భారత క్రికెటర్లు మండిపడ్డారు. తన పేరుతో ట్రోఫీ జరపాలనుకుంటున్న ఇసిబికి తెండూల్కర్ ప్రత్యేక విన్నపం చేశాడు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఇరుదేశాల సిరీస్‌లో పటౌడీ పేరు ఉండేలా చూడాలని కోరాడు. దాంతో, సానుకూలంగా స్పందించిన ఇసిబి.. విన్నింగ్ కెప్టెన్‌కు 'పటౌడీ మెడల్‌'ను కానుకగా ఇస్తామని తెలిపింది' అని మంగళవారం బిసిసిఐ ఓ ప్రకటనలో వెల్లడించింది.

### 75 ఏళ్లకు గుర్తుగా..

భారత్, ఇంగ్లండ్‌ల మధ్య తొలి టెస్టు సిరీస్‌కు 2007లో 75 ఏళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా ఇరుదేశాల బోర్డులు ఇంగ్లండ్‌లో జరుగబోయే సిరీస్‌ను మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ పేరుతో నిర్వహించాలని నిర్ణయించాయి. అప్పటినుంచి 2024 వరకూ పటౌడీ పేరుతోనే ట్రోఫీని జరిపారు. అయితే.. నిరుడు జేమ్స్ అండర్సన్ వీడ్కోలు పలకడంతో అతడిని గౌరవించాలనుకుంది ఇసిబి. అందుకే.. పటౌడీ ట్రోఫీకి మంగళం పాడి.. భారత లెజేండ సచిన్ టెండూల్కర్ పేరును జతచేసింది. ఈ ఏడాది నుంచి సచిన్ – అండర్సన్ ట్రోఫీ నిర్వహిస్తామని ఇంగ్లండ బోర్డు తెలిపింది.

పటౌడీ, ట్రోఫీతో ద్రవిడ్ సంబురాలు..

జూన్ 20 నుంచి భారత్, ఇంగ్లాండ్‌ల మధ్య తొలి టెస్టు జరుగనుంది. అంతకంటే ముందే సచిన్ అండర్సన్ ట్రోఫీని ఆవిష్కరించాలని ఈసీబీ భావించింది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ సందర్భంగా లార్డ్స్ మైదానంలో ట్రోఫీ ఆవిష్కరణ వేడుక జరిపేందుకు ఏర్పాట్లు కూడా చేసింది. కానీ, జూన్ 12న అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం అనంతరం భారత క్రికెటర్లు విషాదంలో మునిగిపోయారు. దాంతో, ట్రోఫీ కార్యక్రమాన్ని వాయిదా వేసింది ఇసిబి. ఇరుబోర్డులకు ఆమోదయోగ్యమైన రోజున అంటే జూన్ 19న ఆవిష్కరణకు సిద్ధమవుతోంది ఇంగ్లాండ్ బోర్డు.

## వరల్డ్ కప్ తర్వాత వీడ్కోలు..

### న్యూజిలాండ్ కెప్టెన్ షాకింగ్ నిర్ణయం!



న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె షాకింగ్ నిర్ణయం తీసుకుంది. నిరుడు మహిళల జట్టును పొట్టి వరల్డ్ కప్ విజేతగా నిలిపిన ఆమె.. వన్డేలకు అల్విదా చెప్పనుంది. వన్డే వరల్డ్ కప్ అనంతరం వన్డే ఫార్మాట్ నుంచి వైదొలగాలని ఆమె భావిస్తోందట. ఈ విషయాన్ని మంగళవారం ఈ విధ్వంసక ప్లేయర్ వెల్లడించింది. 50 ఓవర్ల క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించేందుకు ఇదే సరైన సమయం అని భావిస్తున్నా' అని డెవినె తెలిపింది. న్యూజిలాండ్ క్రికెట్ కూడా ఈ వార్తను ధ్రువీకరించింది.'ఇన్ని రోజులు దేశానికి ప్రాతినిధ్యం వహించాను. ఇక వన్డేల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నాను. వన్డే వరల్డ్ కప్ తర్వాత రిటైర్మెంట్ పలకడం మంచిదని అనిపిస్తోంది. న్యూజిలాండ్ క్రికెట్ మద్దతు నాకు ఇన్నాళ్లు లభించడం అదృష్టంగా భావిస్తున్నా. వీడ్కోలుకు ముందు వైట్ ఫెరన్స్‌కు నేను చేయగలిగినంత చేస్తాననే నమ్మకం నా సహచరులకు ఉంది. యువ క్రికెటర్లతో నిండిన ఈ జట్టు ప్రయాణం గొప్పగా సాగాలని కోరుకుంటున్నా. వచ్చే 6 నుంచి 9 నెలలు ఆటను ఆస్వాదించాలనుకుంటున్నా' అని డెవినె తెలిపింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న మహిళల వన్డే వరల్డ్ కప్ సెప్టెంబర్ 30న మొదలు కానుంది. అక్టోబర్ 1న ఇండోర్‌లో ఆస్ట్రేలియాతో కివీస్ తలపడనుంది.

## జట్టు కోసం రక్తాన్ని ధారపోశా

### టెస్టు గద విజయాన్ని జీవితంలో మర్చిపోను : రబడ



అంతర్జాతీయ క్రికెట్‌లో ఛాంపియన్ అనిపించుకోవాలనే దక్షిణాఫ్రికా కల లార్డ్స్ మైదానంలో సాకారమైంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో ఆస్ట్రేలియాతో చిత్తు చేసి టెస్టు గదను చేజిక్కించుకుంది. ఐసిసి టోర్నీలో 27 ఏళ్ల తర్వాత జగజ్జేతగా అవతరించింది తెంబ బవుమా టీమ్. ఈ చరిత్రాత్మక విజయంలో పేసర్ కగిసో రబడ పాత్ర నిజంగా చాలా గొప్పది. తొలి, రెండు ఇన్నింగ్స్‌ల్లో ఆసీస్ బ్యాటర్లను బెంబేలెత్తించిన రబడ.. టెస్టు గద సంబురాల్లో మునిగి తేలుతున్నాడు. సఫారీల విక్టరీలో ముఖ్య భూమిక పోషించినఈ స్పీడ్‌స్టర్ మంగళవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. లార్డ్స్ మైదానంలో టెస్టు గదను అందుకున్న క్షణాలను జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను' అని పేసర్ అన్నాడు. 'నన్ను నేను స్టార్‌గా భావించను. నిత్యం నేను ఒక శ్రామికుడిని అనే భావనతోనే ఉంటాను. దక్షిణాఫ్రికా జట్టు కోసం నా రక్తాన్ని ధారపోశాను. టీమ్‌ను గెలిపించేందుకు ఎంతో కష్టపడ్డాను. ఈ క్రమంలో పేసర్‌గా నేనెంతో మెరుగయ్యాను కూడా. క్రికెటర్‌గా ప్రతిసారి నన్ను నేను తీర్చిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తాను. దేశం తరపున ఆడడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తాను. మ్యాచ్ ఏదైనా సరే వికెట్లు తీయడమే నా ఉద్దేశం. అయితే.. ఇన్నేసి వికెట్లు తీయాలని మాత్రం మైదానంలోకి దిగను. సాధ్యమైనన్ని ఎక్కువ వికెట్లు పడగొట్టి జట్టును గెలిపించాలని అని లక్ష్యంగా పెట్టుకుంటా. కానీ, ఇదంతా నా ఒక్కడి వల్ల సాధ్యం కాదు. సమిష్టిగా రాణిస్తేనే విజయం వరిస్తుంది. డబ్ల్యుటిసి ఫైనల్‌కు ఏడాది ముందు మాది పెద్దగా అనుభవం లేని జట్టు. ఆటగాళ్లం కలిసి ఉన్నది తక్కువ రోజులే. అయినా సరే ఒక్కటిగా పోరాడి ఆస్ట్రేలియాకు షాకిచ్చాం. లార్డ్స్‌లో టెస్టు గదను అందుకున్న క్షణాల్ని నా జీవితాంతం మర్చిపోలేను. కుర్రాళ్లు కూడా ఆ అద్భుత గడియల్ని సదా గుర్తు పెట్టుకుంటారని నా నమ్మకం' అని రబడ వెల్లడించాడు.

# మహిళ

## ఫోకస్

# మార్గదర్శకులు

### ఆమె జీవితం... ఆదర్శప్రాయం..



కమలా సొహోనీ (1911 జూన్ 18 – 1998 జూన్ 28)... సైన్స్‌లో పిహెచ్‌డి చేసిన మొట్టమొదటి భారత మహిళ. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ప్రవేశం పొందిన తొలి మహిళగా కూడా ఆమె పేరు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త, ప్రతిష్టాత్మక నోబెల్ పురస్కార గ్రహీత సివి రామన్ ప్రశంసలు పొందిన కమల జీవితం అందరికీ ఆదర్శప్రాయం. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఆమెకు ప్రవేశం అంత సులభంగా లభించలేదు. తన ప్రతిభ ఆధారంగా సీటు ఇవ్వాలన్న ఆమె విజ్ఞప్తిని అధికారులు తోసిపుచ్చారు. మహిళలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించలేరన్న అభిప్రాయం బలంగా నెలకొని వున్న రోజులు కావడంతో, కమల తన డిమాండ్‌ను సాకారం చేసుకోవడానికి సత్యాగ్రహానికి దిగింది. చివరికి ప్రవేశం పొందగలిగింది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఆమె పనితీరు, విషయాన్ని అవగాహన చేసుకోవడంలో కనబరుస్తున్న చురుకుదనం, అప్పచెప్పిన పనిని ఎంతో ఏకాగ్రతతతో పూర్తి చేసే లక్షణం అందరినీ ఆకట్టుకున్నాయి. సివి రామన్ సైతం ఆమెను ప్రశంసించారు. మహిళలు సైన్స్‌లోనూ రాణించగలరని నిరూపించిన కమల, వివిధ పరిశోధనలు జరిపింది. ఆమె పరిశోధనలు పాలు, పప్పు ధాన్యాలు, బియ్యం, తాటి బెల్లం, నీర వంటి ఆహార పదార్థాల పోషక విలువలపై కేంద్రంగా సాగాయి. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో 'సైటోక్రోమ్ సి' అనే ముఖ్యమైన ఎంజైమ్‌ను ఆమె మొక్కల కణాల్లో కనుగొన్నది. తాటి బెల్లంలో విటమిన్ 'ఎ', 'సి', ఐరన్ వంటి పోషకాలు ఉన్నాయని గుర్తించి, ఇది పోషకాహార లోపంతో బాధపడే పిల్లలు, గర్భిణులకు ఎంతో మేలు చేస్తుందని నిరూపించింది. తన పరిశోధనలకుగాను భారత రాష్ట్రపతి అవార్డు పొందింది. కమల పరిశోధనలు భారతీయ మహిళలకు శాస్త్రరంగంలో మార్గదర్శకంగా నిలిచాయి. ఆమె పోరాటం వల్ల ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో మహిళలకు ప్రవేశం ప్రారంభమైంది. ఆమె జీవితం, కృషి యువతికి, ముఖ్యంగా మహిళలకు, శాస్త్రరంగంలో ప్రేరణగా నిలిచాయి. కమల పరిశోధనలు భారతీయ ఆహార పదార్థాల పోషక విలువలను గణనీయంగా ప్రభావితం చేశాయి. తాటి బెల్లం, నీరా వంటి స్థానిక ఆహారాల్లో పోషక విలువలు ఉన్నాయని ఆమె నిరూపించడంతో, పోషకాహార లోపాన్ని ఎదుర్కొనేందుకు వీటిని ప్రోత్సహించేలా మార్గనిర్దేశం చేశారు. ఆమె పరిశోధనలు భారతీయ ఆహార విధానాలకు శాస్త్రీయ ప్రామాణికతను తీసుకువచ్చి, ప్రజారోగ్యానికి మద్దతుగా నిలిచాయి.

## 50 ప్లస్ మహిళలకు వీక్లీ డైట్ ప్లాన్



వివిధ పత్రికలు, నిపుణుల ఇంటర్వ్యూలు, ఇతర మార్గాల ద్వారా సేకరించిన వివలాను అనుసరించి, యాభై సంవత్సరాల వయసు దాటిన మహిళల కోసం వారం రోజుల ఆహార ప్రణాళిక ఇది. ఇది ఉదయం నుండి రాత్రి వరకు తీసుకోవాల్సిన ఆహారాన్ని వివరిస్తుంది. అన్ని రోజులు శరీర ఆరోగ్యం, హార్మోనల్ సమతుల్యత, శక్తి, జీర్ణవ్యవస్థను దృష్టిలో పెట్టుకొని రూపొందించారు.

**రోజు 1**

ఉదయం: గోధుమ రవ్వ ఉప్మా, టమాటా పచ్చడి, గ్రీన్ టీ

మధ్యాహ్నం: బ్రౌన్ రైస్, సన్నగ జొన్నకూర, చిక్కుడుకూర, పెరుగు

సాయంత్రం: ఆపిల్ లేదా సపోటా, కొద్దిగా బాదం

రాత్రి: మినపప్పుతో దోస, నల్లకారం, నీళ్ళలో నానబెట్టిన రాగి మాల్ట్

**రోజు 2**

ఉదయం: ఓట్స్ కిచిడీ (బీన్స్, క్యారెట్), బటర్‌మిల్క్

మధ్యాహ్నం: మిల్లెట్ రైస్, మెంతి కూర పప్పు, క్యాబేజీకూర, పెరుగు

సాయంత్రం: అరటిపండు, అవిసె గింజల పొడి వేయించిన లడ్డు

రాత్రి: పెసరట్టు (మొలకెత్తిన మినపపప్పుతో), అల్లం చట్నీ

**రోజు 3**

ఉదయం: ఫ్రూట్ సలాడ్ (పుచ్చకాయ, జామపండు), వాల్‌నట్, గ్రీన్ టీ

మధ్యాహ్నం: బాస్మతి బ్రౌన్ రైస్, వంకాయ పులుసు, మినపపప్పు, పెరుగు

సాయంత్రం: స్ప్రౌట్స్ సలాడ్ (పసరపప్పు, టమాటా, నిమ్మరసం)

రాత్రి: గోధుమ రొట్టి, టమాటా అల్లం కూర

**రోజు 4**

ఉదయం: రాగి జావ, అరటి ముక్కలు కలిపి, వాల్‌నట్ తినాలి

మధ్యాహ్నం: జొన్నరొట్టె, బీర, కాయపచ్చడి, ముద్దపప్పు, పెరుగు

సాయంత్రం: బాదం 5, ఖర్జూరం 1 లేదా 2

రాత్రి: పప్పుతో ఉడకబెట్టిన బియ్యపపిండి ఇడ్లి, నిమ్మరసం చట్నీ

రోజు 5

ఉదయం: గోధుమ అటుకులు, తరిగిన పండ్లు, తేనె చుక్కలు

మధ్యాహ్నం: మిల్లెట్ కిచిడీ (వెజిటబుల్స్‌తో), మజ్జిగ

సాయంత్రం: అరటిపండు లేదా పండు జ్యూస్ (చక్కెర లేకుండా)

రాత్రి: టమాటా పప్పు, గోధుమ రొట్టె

**రోజు 6**

ఉదయం: అల్లం చాయ్ (చక్కెర లేకుండా), మినపగారెలు 2

మధ్యాహ్నం: బ్రౌన్ రైస్, బెన్నీ కూర, చికెన్ లేదా సొంపుగా ఉడికించిన చేప

సాయంత్రం: అండా పొడి వేయించిన సలాడ్

రాత్రి: ఓట్స్ దోస, మిరపకాయ కారం

**రోజు 7**

ఉదయం: ఫ్రూట్ జ్యూస్, గోధుమ సున్నపిండి అట్టు

మధ్యాహ్నం: సజ్జ రొట్టె, బఠానీ కూర, మినపప్పు, పెరుగు

సాయంత్రం: సీతాఫల లేదా జామ పండు

రాత్రి: వెజిటబుల్ ఉప్మా, చింత పండు పచ్చడి.

**అందరూ గుర్తుంచుకోవాల్సిన కొన్ని నియమాలు:**

ప్రతి రోజూ 6–8 గ్లాసుల నీరు తాగాలి

మధ్యాహ్నం తర్వాత మితంగా తినాలి

తక్కువ ఉప్పు, తక్కువ నూనె వాడాలి

రోజూ కనీసం 30 నిమిషాలు నడక/యోగాసనాలు/ప్రాణాయామం చేయాలి

# ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గం

### సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

### ఘనంగా సిపిఐ హయత్‌నగర్ మండల మహాసభ







**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే పరిష్కార మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మంగళవారం హయత్ నగర్ మండల సిపిఐ 10వ మహాసభలను హయత్ నగర్‌లోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. మహాసభలను ఎఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. మహాసభ అవరణలో పార్టీ జెండాను ఎమ్మెల్సీ అవిష్కరించి, అమరవీరుల స్థూపకానికి నివాళిలర్పించారు. అనంతరం సభలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడతూ దేశస్వాతంత్ర ఉద్యమంలో సిపిఐ పాత్ర కీలకమన్నారు. నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటంలో ముఖ్యపాత్ర పోషించిందని గుర్తుచేశారు. నాటి నుంచి నేటివరకు పేదప్రజల పక్షాన, కార్మిక, కర్షక సబ్బండవర్గాల శ్రేయస్సుకు పాటు పడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. 100 వ సంతలలోకి అడుగుపెడుతున్న తరుణంలో పేదల పక్షాన ఇండ్లస్థలాలు, భూపోరాటాలు నిర్వహించాలని, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషిచేయాలని పార్టీ శ్రేణులకు నెల్లికంటి పిలుపునిచ్చారు. మహాసభలో రంగారెడ్డి జిల్లా సిపిఐ ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, ఎల్‌బి నగర్ నియోజకవర్గ నాయకుడు సామిడి శేఖర్ రెడ్డిలు మాట్లాడుతూ జిల్లాలో భూ పోరాటాలు నిర్వహించి, పేదలకు భూములు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ లన్ని అమలు చేయాలని వారు కోరారు. జిల్లాలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేస్తున్న కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని కోరారు. పార్టీ ప్రజాసంఘాలను బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటాలు చేస్తామని వారు తెలిపారు. మహాసభలో సిపిఐ మండల కార్యదర్శి శేషరాజు పల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శి బొంగు అరుణ్ కుమార్‌గౌడ్, మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు రమావత్ సక్రు నాయక్, ఎఐవైఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు పోలోజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# 20న సిపిఐ ఆసిఫాబాద్ జిల్లా మహాసభ

### పార్టీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ



**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** ఈ నెల 20న జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సత్యనారాయణ జిల్లా కౌన్సిల్ సభ్యులను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రజాసంఘాలను బలోపేతం చేస్తూ కార్మిక వర్గ ప్రయోజనాల కొరకు నిరంతరం పని చేస్తామని ఆయన తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ బలంగా ఉన్నచోట పోటీ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో మిత్ర సంబంధాలు కొనసాగిస్తూనే ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తామని అన్నారు. జిల్లాలోని వ్యవసాయానికి యోగ్యమైన లక్ష ఎకరాల పైచిలుకు పోడు భూములు ఉన్నాయని వాటిని అర్హులైన రైతు కూలీలకు పంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వమే నివేశ స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణం కొరకు 8 లక్షల రూపాయల ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పోరాటాలు చేస్తామన్నారు.ఆసిఫాబాద్‌లోని తిరుమల మినీ ఫంక్షన్ హాల్‌లో 20న జరగనున్న సిపిఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రతి సభ్యుడు బాధ్యతగా పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కునంనేని సాంబ శివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ ముఖ్యఅతిధులుగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు. సభకు పార్టీ శ్రేణు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్.తిరుపతి, రాయిల్ల నర్సయ్య, ఆత్మకూరి చిరంజీవి, ఆత్రం సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన భూపోరాటాలు

### సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** పేదల పక్షాన, కార్మిక, కర్షక సబ్బండ వర్గాల శ్రేయస్సు కోసం పాటు పడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, 100 వసంతలలోకి అడుగుపెడుతున్న కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన ఇండ్ల స్థలాలు, భూపోరాటాలు నిర్వహించాలని, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని జెఎం ఫంక్షన్ హాల్లో మంగళవారం నాగపూరి నర్సింహ, వసంతల అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ మండల మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై గోద శ్రీరాములు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు, పోడు భూముల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముల్కలపల్లి నుండి గొల్లగూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలని, దత్తాయపల్లి నుండి, ఇబ్రహీంపురం, రాజపేట వరకు బిటి రోడ్డు మరమ్మత్తు పనులు చేయించాలని కోరారు. నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీలకు గ్రామపంచాయతీ భవనాలు ఏర్పాటు చేయాలని, అన్ని గ్రా మాల్లో అంగన్వాడీ కేంద్రాలకు పక్కా బిల్డింగులు ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని, తుర్కపల్లి నుండి యాదగిరిగుట్ట వరకు అసంపూర్తిగా ఉన్న డబుల్ రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు .సమావేశంలో మండ ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సిలువేరు దుర్గయ్య, సహాయ కార్యదర్శిగా గుంటిపల్లి సత్తయ్యను 16మంది కౌన్సిల్ సభ్యులు, 9 మంది మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, సభ్యులు కళ్లెం కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, నాయ కులు చెక్క దయాకర్‌రెడ్డి, సిలువేరు దుర్గయ్య, బొట్టు భూమయ్య, వల్లపు భగవంతు, బాణోత్ యాదమ్మ, పకీరా నాయక్, ఎస్‌కె జమాల్, జిన్నా రజిత, కొండ అంజమ్మ, నాగారం అంజయ్య, గుజ్జుక మహిపాల్, నరేంగల రమేష్, బత్తుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




### వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి

# ప్రత్యేక కమిషన్ ఏర్పాటు

### తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి డిమాండ్

### ఘనంగా యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** వైద్యరంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ పదకొండవ ఆవిర్భావ దినోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలలో నర్సింగ్ సూపరింటెండెంట్, యూనియన్ సీనియర్ నాయకురాలు సునీత యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం నుండే ప్రభుత్వ వైద్యరంగం అస్తవ్యస్తంగా విభజించబడిందని, దీని ఫలితంగా వైద్యరంగం సమస్యల కేంద్రంగా మారిందన్నారు, ముఖ్యంగా వైద్య ఉద్యోగులు పదోన్నతులు, బదిలీల లాంటి ముఖ్యమైన అంశాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ విద్యబోధన కళాశాలలు, జనరల్ ఆసుపత్రుల సంఖ్య పెరుగుతుండటంతో వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల నిర్వహణ, బడ్జెట్ కేటాయింపు కొత్త రిక్రూట్‌మెంట్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఉద్యోగులకు నేటికి 010 పద్దు కింద వేతనాలు చెల్లించడం లేదన్నారు. పిఆర్‌సిల అమలు, డిఎలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచడం సబబు కాదన్నారు. కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను థర్డ్ పార్టీ ఏజేన్సీల కింద పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులను మానవత దృక్పథంతో క్రమబద్ధికరించాలని విజ్ఞప్తి చేశారు. వైద్య ఉద్యోగుల హక్కుల సాధనకు మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ దశాబ్దాల తరబడి రాజీలేని పోరాటాలు నడిపిన నేపథ్యంలోనే అనేక జిఒలు వచ్చాయన్నారు. ఉద్యోగ భద్రత, వేతన సవరణలు లాంటి అనేక హక్కులు సాధించుకున్న చరిత్ర ఎఐటియుసి మెడికల్ యూనియన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జనరల్ ఆసుపత్రి డిప్యూటీ సూపరిండెంట్ డా.సునీల్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, యూనియన్ ఆసుపత్రి బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, కోటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, కిశోర్, రాంప్రసాద్, వారి ప్రసాద్‌రెడ్డి, స్వామి, నర్సింగ్ ఆఫీసర్స్ శ్రావణి, కళ్యాణి, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్‌నాయక్, సతీష్‌రెడ్డి, నాయకులు బుచ్చన్న, కామేశ్వరరావు, సత్తయ్య, వెంకట్రామిరెడ్డి, ఓంకార్, సాగర్, కరుణాకర్, మురళి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నేతలు చెన్నయ్య, నరసింహ, మొగులన్న, దేవానంద్, పద్మమ్మ వరలక్ష్మి, జ్యోతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

### ఫీజుల నియంత్రణపై

# విద్యాశాఖ నిఘా కరువు

### ఎఐఎస్‌ఎఫ్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు

**ప్రజాపక్షం/దేవరకొండ :** విద్యాసంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నా విద్యా శాఖ అధికారుల నిఘా కరువయ్యిందని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఎఐఎస్‌ఎఫ్ దేవరకొండ డివిజన్ సమితి సమావేశానికి హాజరైన ఆంజనేయులు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజులు మోతలు మోగిస్తున్నా, విద్యా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్పా, గుర్తింపు లేని పాఠశాలలను గుర్తించి ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవడంలో ఆలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించడంలో ప్రభుత్వాలు గానీ ప్రభుత్వ అధికారులు ద్వంద వైఖరి ప్రదర్శిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్లు తీసుకుంటే డొనేషన్లు, బుక్స్‌కు సపరేట్ యూనిఫాంలకు సపరేట్ ఫీజులు వసూలు చేస్తూ దందాకి పురికొలుపుతున్నారన్నారు. పేద విద్యార్థుల తల్లిదండ్రులనుంచి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు కాసుల వసూలుకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికయిన విద్యాశాఖ అధికారులు మేల్కొని నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న ప్రవేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ డివిజన్ కార్యదర్శి వట్టేపు శివకుమార్, మధు, శివ, వినయ్, భాను, రాజు, మహేష్, అరవింద్, ఆకాష్ పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కౌలు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం చెల్లించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శిరాము

**ప్రజాపక్షం/జమ్మికుంట:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులకు రైతుభరోసాతో పాటు కౌలు రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పంటకు రూ. 6వేలు వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లందకుంటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రైతులతో పాటు కౌలు రైతులకు, భూమి లేని కూలీలకు, తక్షణం రైతు భరోసా కింద యాసంగి వర్షాకాలం సీజన్‌కు కలిపి రూ.12 వేలు వారి ఖాతాలో జమ చేయాలని కోరారు. ఈ పథకాన్ని 2024 వానాకాలం సీజన్‌లో ఇవ్వలేదని, ఎకరానికి రూ.7500 ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రూ.6 వేలకు తగ్గించిందని అన్నారు. 2025 యాసంగి సీజన్‌లో 53.4 లక్షల మందికి రూ.4.366 లక్షల కోట్లు 72 లక్షల ఎకరాలకు మాత్రమే చెల్లించారని, ఆ తర్వాత చెల్లింపులు జరగలేదన్నారు. తు భరోసా కిం ద చెల్లించాలని, లేని పక్షంలో రైతు సంఘాలు, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలను కలుపుకుని ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తా

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలోమైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తానని తెలంగాణ కార్మిక, మైనింగ్ శాఖామంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం పెద్దపల్లికి చెందిన మైనారిటీ నాయకులు మీర్జా అహ్మద్ బేగ్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మీర్జా అహ్మద్ బేగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం మైనారిటీల కోసం ప్రవేశపెట్టే పథకాలను రాష్ట్రంలోని మైనార్టీలందరికి అందేటట్టు చూడాలని,రాబోయే అన్ని సంక్షేమ పథకాలతోపాటు ముస్లిం యువతకు నైపుణ్యాభివృద్ధి, విద్యకు ఆర్థిక సాధికారత అవసరమని దానికి తమ వంతు కృషి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనికి మంత్రి డాక్టర్ వివేక్ సానుకూలంగా స్పందించి, మైనార్టీల సమస్యలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి సాధ్యమైనంత వరకు సమస్యలను పరిష్కరిస్తనని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మీర్జా జావిద్ బేగ్, మీర్జా సాజిద్ బేగ్, మీర్జా మొహిద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల వెంకన్నను దర్శించుకున్న మంత్రి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంకు మెట్ల మార్గంలో కాలినడకన ఏడుకొండలు ఎక్కుతూ వెళ్లారు. తమ ఇలవేల్పు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిరని నిన్న మంత్రి అడ్లూరి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఉదయం తిరుపతి చేరుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్ శ్రీవారి దర్శనం కోసం అలిపిరి నుండి కాలినడకన బయలుదేరి శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నారు.

## ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని దర్యాపూర్ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ఆరవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాల కోసం ఆఫ్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ సంతోష్ కేసరి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్, టిసి,ఆధార్ కార్డు జిరాక్స్‌లు తమ పాఠశాలలో సమర్పించి వీలైనంత త్వరగా అడ్మిషన్ పొందాలని పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.

## పిట్టల సమ్మయ్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**ప్రజాపక్షం/శంకరపట్నం:** భవన నిర్మాణ కార్మికుల సమస్యల సాధన కోసం హైదరాబాదులోని కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయలుదేరుతున్నారన్న సమాచారం మేరకు శంకరపట్నం మండలానికి చెందిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్యను పోలీసులు ముందస్తుగా సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం వదిలిపెట్టారు. ఈ సందర్భంగా సమ్మయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మికులు చేపట్టే ధర్నాను పోలీసులు భగ్నం చేవారని ఆరోపించారు. కార్మికుల సమస్యల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

## బాధితుడికి ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన లింబాద్రి అనే కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిరుపతి గౌడ్ స్పందించి బాధితున్ని పరామర్శించాడు. అంతే కాకుండా తన వంతు సహాయంగా రూ.3వేలు ఆర్థిక సహాయం చేసి తన ఉదారతను చాటుకున్నాడు. ఈ సందర్భంగా లింబాద్రి గట్టు తిరుపతి గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## గడ్డి మందు తాగి వృద్ధుడి మృతి



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** గడ్డి మందు తాగి వృద్ధుడు మృతి చెందిన సంఘటన కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో చోటు చేసుకుంది. కరీంనగర్ రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గాజుల కొండయ్య (65) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా దుర్శేడ్ గ్రామ శివారులోగల ఎస్సారెస్పీ కెనాల్ వద్ద గడ్డి మందు త్రాగగా గమనించిన భార్య గాజుల జయ కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి కొండయ్య మృతి చెందారు. భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి

కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/కొండపాక:** పెండింగ్ భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి ఆర్ఒఆర్ చట్టాన్ని ప్రభుత్వం తీసుకవచ్చిందని జిల్లా కలెక్టర్ కె హైమావతి అన్నారు. కొండపాక మండలం అంకిరెడ్డి పల్లిలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి రైతులతో మాట్లాడారు. చాలా కా లంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కరించడం కోసమే ప్రభుత్వం భూ భారతి ఆర్ఒఆర్ చట్టం తీసుకు వచ్చిందని ఎలాంటి భూ సమస్యలు ఉన్న రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.అదే విధంగా అసైన్డ్ భూములను కొనుగోలు చేసిన పేదవారి పేరు మీద భూ హక్కులను బదిలీపై ప్రభుత్వ నిర్ణయం ప్రకారం చర్యలు తీసుకుంటామని అప్పటి వరకు దరఖాస్తులు ఆన్లైన్ చేసి భద్రంగా ఉంచుతామన్నారు. రెవెన్యూ సదస్సులలో రైతులు పెట్టుకునే ప్రతి అర్జీకి సంబంధించిన భూ వివరాలను రెవెన్యూ రికార్డులలో క్షుణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, దరఖాస్తులన్నింటిని కచ్చితంగా ఆన్‌లైన్‌లో పొందుపరిచాలని ఆలస్యం చేయకుండా అవసరమైన వారికి నోటిసులు జారీ చేసి సాదా బైనామ, సీలింగ్, సర్వేనెంబర్, భూ విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, లావని పట్టా అన్నిరకాల భూ సమస్యలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.రెవెన్యూ గ్రామంలో రైతులు, వ్యవసాయ భూమి, ప్రభుత్వ భూమి తదితర భూమి పూర్తి వివరాలతో విలేజ్ ప్రొఫైల్ తయారు చేయాలని తహసీల్దార్ శ్యామ్‌ను ఆదేశించారు.

## రెండున్నర ఏళ్లు దాటితే అంగన్‌వాడీకి పంపాలి

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కవితారాణి



**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** రెండున్నర ఏండ్ల నుండి 5 ఏండ్ల పిల్లలను అంగన్‌వాడీ స్కూల్‌కు పంపించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కవితారాణి అన్నారు. అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగిత్యాల పట్టణంలోని విద్యానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్య ప్రాముఖ్యత గురించి సూపర్‌వైజర్ కవితారాణి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలో అందించే ఆటపాటలతో కూడిన విద్యా ప్రాముఖ్యత, వారి పోషకస్థితిని అంచనా వేయడం రోజువారిగా టైమ్ ప్రకారం, విద్య బోధన చేయడం జరుగుతుందన్నారు. మంచి అలవాట్లు సృజనాత్మకత భాషా అభివృద్ధి, బాల్క్ ఫజిల్స్, నాటకీకరణ వంటి కార్నర్స్ ద్వారావారిలో ఉన్న మేధాభివృద్ధికి కృషి చేస్తూ విద్య బోధన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్‌ఎం మాదేశి శిరీష, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, మాధవి, ఆశా వర్కర్లు, తల్లులు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రుల్లో ఉద్యోగులకు టిజిఎంఇయు అండ

ఘనంగా 11వ యూనియన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** అన్ని ఆసుపత్రుల్లో పనిచేసే ఉద్యోగులకు అండగా నిలబడి వారి సమస్యల కోసం నిరంతరం పోరాటం చేసేది టిజిఎంఇయు మాత్రమేనని తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సెక్రటరీ టి.రామారావు అన్నారు. కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆ స్పత్రిలో 1వ టిజిఎంఎయు ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా వారు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనియన్ నాయకులైన కీ.శే రాంచందర్, కీ.శే. ఎస్‌పి దయానంద్‌లు వారి చివరి శ్వాస వరకు ఉద్యోగులకు అండగా నిలబడి ఎర్రజెండాను ఇప్పటి తరం నాయకులకు అందించి వెళ్లారని పేర్కొన్నారు. వారి ఆశయాలను, ఉద్దేశ్యాలను అమలు చేసేందుకు ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్‌ను బలమైన సంఘంగా నిలబెట్టే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జిజిహెచ్ మెడికల్ సూపరిండెంట్ డా.జి.వీరారెడ్డి, టివివిపి డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.నరేందర్, జనరల్ సెక్రటరీ డా.రవి ప్రవీణ్ రెడ్డి, తెలంగాణ మెడికల్ ఫ్రెటర్నిటీ అసోసియేషన్ ఫౌండన్ డా.హరి కృష్ణ, ఎఐటియుసి స్టేట్ సెక్రటరీ సమ్మయ్య, టిజిఎంఇయు మాజీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పి.స్వాతి, టిజిఎంఈయు కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ అతీఫ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సుజాత, మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కింగ్ యూనియన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సన్నీ ఎడ్వర్డ్, నర్సింగ్ ఆఫీసర్స్, ఫార్మసీ ఆఫీసర్స్, పారామెడికల్, నాల్గవ తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

## విమర్శలు చేయడం సరైంది కాదు

ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణిలో కార్మికుల తిరస్కరణకు గురైన హెచ్‌ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ ఉనికి కోసం ఎఐటియుసిపై విమర్శలు చేయడం సరైంది కాదని, కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం సింగరేణిలో కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని, కార్మికుల సమస్యలను పరిష్కరించడం లేదని గుర్తింపు సంఘం ఎఐటియుసిపై హెచ్‌ఎంఎస్ విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉపప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో గత పది సంవత్సరాలుగా కార్మికుల సమస్యల పరిష్కారం జరగలేదని, ఎఐటియుసి గెలిచిన తరువాత కోడ్ ఆఫ్ డిసిప్లిన్ ప్రకారం యాజమాన్యంతో కార్మికుల సమస్యలపై జెసిసి, స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో, ఏరియా లెవెల్ స్ట్రక్చర్ సమావేశంలో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. సింగరేణి లో గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వంలో రాజకీయ జోక్యం పెరిగిందని, సిబిఎస్ఇ సిలబస్ ప్రారంభోత్సవ ఆహ్వాన కార్యక్రమంలో సిఅండ్ఎండిని, యూనియన్ నాయకులను అవమాన పరిచే విధంగా ఆహ్వాన పత్రిక ఉందని, సొమ్ము సింగరేణి ది..సోకు ప్రభుత్వానిదా అంటూ మా యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య ప్రెస్ మీట్ ఏర్పాటు చేస్తే, రియాజ్ అహ్మద్ దానికి మద్దతు తెలుపకుండా, యాజమాన్యంకు తొత్తుగా ఉంటూ ఎఐటియుసిపై, సీతారామయ్యపై విమర్శలు చేయడం సరైంది కాదని వారు అన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి ప్రజా సంఘాల నాయకులు ఎం.ఎ.గౌస్, సూర్య, ప్రీతం, సిరిసిల్ల మల్లేశ్, చెప్యాల మహేందర్ రావు, పడాల కనకరాజు, బూడిద మల్లేష్, ఎజ్జ రాజయ్య, జనగాం జగదీశ్వర్, నవీన్, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ లెవెల్‌లో మహిళ కాంగ్రెస్ బలోపేతం

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణారెడ్డి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** రానున్న రోజుల్లో మహిళ కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి బూత్ లెవెల్ నుండి మహిళ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి సుగుణరెడ్డి అన్నారు. మహిళ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఆల్క లంబా ఆదేశాల మేరకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు సూచనల మేరకు మహిళా కాంగ్రెస్ జగిత్యాల జిల్లా శాఖ సమీక్షా సమావేశానికి మంగళవారం ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మహిళా కాంగ్రెస్ పనితీరును అడిగి తెలుసుకొని నివేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా సుగుణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. ఉచిత ఆర్‌టిసి బస్ సౌకర్యంతో పాటుగా, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను గడప గడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు గెలుపే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సుమలత, జగిత్యాల జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి దేవేంధర్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శి తాటిపర్తి శోభారాణి, గోపి మాధవి, అల్లాల సరిత, సరళ, పిప్పరి అనిత, మమత, సిరికొండ పద్మ, అచ్చ లావణ్య, చిట్ల లత, సులోచన, మ్యాదరి లక్ష్మి, కొండ్రా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రైతును రాజును చేసేందుకు ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** రైతును రాజును చేసేందుకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెద్దంపేట, లక్ష్మీపూర్, ఆరేపల్లి, మల్యాల, మీర్జంపేట, తారుపల్లి గ్రామాల్లో మంగళవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం మిర్జంపేట గ్రామం రూ.13 లక్షలతో దాతల సహాయంతో నిర్మించిన రామాలయం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.రైతు భరోసా ఈ వర్షాకాల పంటకు ఈ తొమ్మిది రోజులలో ఈ తెలంగాణ రాష్ట్రంలో ఎంత మంది రైతులకు ఎంత భూమి ఉన్న రైతు భరోసా పడుతుంది అన్నారు. ఇప్పటికే రెండు ఎకరాల వరకు ప్రభుత్వం అందజేసిందన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక ,మట్టి మాఫియా జోరుగా జరిగిందని నేను ఎమ్మెల్యే అయిన తర్వాత ఇసుక మాఫియాను అరికట్టి ఎవరైనా ఇల్లు కట్టుకుంటే వారికి ట్రాక్టర్ల ద్వారా తీసుకపోయేందుకు వెసులుబాటు కల్పించాను అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి రైతు భరోసాతో పాటు, రెండు లక్షల రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం వలన రైతులకు ఎంతో లాభం కలుగుతుంది అన్నారు. రైతుకు లాభం చేసిన ప్రభుత్వం ఈ 30 ఏళ్లలో నేను ఎప్పుడూ చూడలేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రైతుకు ఎంతో లాభం జరుగుతుంది అన్నారు. నేను నియోజకవర్గంలో పాదయాత్ర చేసేటప్పుడు ఒక్క గింజ కటింగ్ లేకుండా ధాన్యం అందిస్తానని మాట ఇచ్చిన ప్రకారం ఏ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గింజ కటింగ్ లేకుండా వరి ధాన్యం అందించడం జరిగింది అన్నారు. అంతేకాకుండా ఈ వేసవి కాలంలోప్రాంతాలకు సాగునీరు అందించి రైతుల పంటలను కూడా కాపాడడం జరిగింది అన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక ,మట్టి మాఫియా జోరుగా జరిగిందని నేను ఎమ్మెల్యే అయిన తర్వాత ఇసుక మాఫియాను అరికట్టి ఎవరైనా ఇల్లు కట్టుకుంటే వారికి ట్రాక్టర్ల ద్వారా తీసుకపోయేందుకు వెసులుబాటు కల్పించాను అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రారెడ్డి, మాజీ జెడ్పిటిసిలు లంక సదయ్య, వంగల తిరుపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజన వేనసదయ్య,మునీర్,తుల మనోహర్ రావు,శివకృష్ణ, బంగారి రమేష్, మాదాసు సతీష్, ఎండి సజ్జు, సబ్బానీ రాజమల్లు, ఓరిగంటి కొమురయ్య, రానవేణి శ్రీనివాస్, ఎండి ఇబ్రహీం,మండల నాయకులు,ఆయా గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు మరియు ఎంపిడిఓ పూర్ణచందర్ మరియు ఆయా గ్రామాల ప్రజలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి చీరలతో చేతినిండా ఉపాధి

విప్ ఆది శ్రీనివాస్, చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం, సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తితో చేతినిండా పని కల్పిస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. సిరిసిల్లలోని గణేష్ నగర్ లో మామిడాల నారాయణ, కొండ సుభాష్‌కు మరమగ్గాల యూనిట్లను ఆది శ్రీనివాస్, శైలజ రామయ్యార్, కలెక్టర్ అధికారులతో కలిసి మంగళవారం చీరల ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కార్మికులతో మాట్లాడారు. వేముల శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్ తదితర కార్మికులతో ప్రిన్సిపల్ సెక్రటరీ, కలెక్టర్ మాట్లాడారు. ప్రతి రోజు ఎన్ని మీటర్ల చీర ఉత్పత్తి చేస్తున్నారని? వారానికి ఎంత ఆదాయం వస్తుందని? అడిగి తెలుసుకున్నారు. చీరల ఉత్పత్తిలో ఏమైనా ఇబ్బంది ఎదురవుతున్నాయని ఆరా తీశారు. తమకు ప్రతివారం రూపాయలు 4000 నుంచి 5000 వరకు ఆదాయం వస్తుందని కార్మికులు వారి దృష్టికి తీసుకెళ్లారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి, కార్మికులను ఆదుకునేందుకు చేతినిండా పని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఎడి రాఘవరావు, సంగీతం శ్రీనివాస్, చొప్పదండి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## బీడి కార్మికులకు ఆసరా పెన్షన్ రూ.4016 చెల్లించాలి

తెలంగాణ బీడి ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా సమితి డిమాండ్




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీడి కార్మికులకు ఆసరా పెన్షన్ 4,016 రూపాయలు ఇవ్వాలని తెలంగాణ బీడి ఫెడరేషన్ సమితి రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి వేణు, గౌరవ అధ్యక్షులు కడారి రాములు అన్నారు. మంగళవారం సుభాష్ నగర్ ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. బీడి కార్మికులందరికి ఎలాంటి నిబంధనలు లేకుండా బట్టివాలా, షేకర్లు, ప్యాకర్లు, గుమస్తాలు, అనుబంధ కార్మికులందరికి ఆసరా పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో నాంపల్లిలో ఈ ఎస్ ఐ హాస్పిటల్ ఉండేదని దానిని తొలగించారని,తంగాళ్లపెల్లి లో ఈఎస్ఐ హాస్పిటల్ కు శంకుస్థాపన చేశారని కానీ ఏండ్లు గడిచినా నిర్మాణం మాత్రం చేపట్టడం లేదని విమర్శించారు. త్వరగతిన నిర్మాణం చేసి కార్మికులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. బీడి కార్మికులకు ఇండ్లు లేని వారికి తక్షణమే డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని,ప్యాకర్ లు,షేకర్లకు, ఈఎస్ఐ పేరుతో వారి వేతనం నుండి డబ్బులు కట్ అవుతున్నాయి కానీ ఈఎస్ఐ హాస్పిటల్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో అందుబాటులో లేకపోవడంతో కార్మికులు ఎక్కడ వైద్యం చేయించుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విడిఏ ప్రకారం పెరిగిన వేతనం జిల్లాలో బీడి కంపెనీలు, టెకేదార్లు కార్మికులకు ఇవ్వాలని, ఆకుతంబాకు నాణ్యమైనవిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీడి సంఘం జిల్లా అధ్యక్షులు కె.వి అనసూర్య, ఎఐటియుసి నాయకులు పంతం.రవి, మీసం.లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా సిఎం సహాయనిధి

కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి అని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండ గ్రామంలో రైతు వేదికలో మంగళవారం జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం 10 లక్షల 37 వేల 500 రూపాయల విలువగల చెక్కులను 30 మంది లబ్ధిదారులకు అందజేశారు. నర్సింగారావు మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. అనారోగ్యం బారిన పడి వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న పేద మధ్య తరగతి ప్రజలు ముఖ్యమంత్రి సహాయ నిధిని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చేర్మెన్ బోరిగాం రాజు, వైస్ చేర్మెన్ ఎలాల వెంకట్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు దుదిగాం గంగాధర్, మాజీ ఎంపిపి నేరెళ్ల దేవేందర్, మాజీ ఎంపిటిసి పొన్ కంటి వెంకట్, కిసాన్ సెల్ అధ్యక్షులు క్యాతం తిరుపతి రెడ్డి, కాసిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎఎం సి డైరెక్టర్ శంకర్ రెడ్డి, కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మేడికొండ రమేష్, బొల్లవేణి శంకర్, వెలుముల సుగుణాకర్ రావు, జంగా విజయ్, దోస గణేష్, బుస రాజేశ్వర్, కళ్లెం గంగారెడ్డి, బండి రాజేష్, నల్ల రమేష్, నల్ల రామరాజు, ఆవుల మహేష్, చల్ల పురుషోత్తం, పిండి గంగాధర్, ముక్కెర వేణుగోపాల్ యాదవ్, సింగని మారుతీ, గుమ్ముల రమేష్, రామాంజనేయులు, పెంట లింబాద్రి, వల్గొట్ నరేష్, కనక జగన్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## విద్యార్థుల తరగతులు యథావిధిగా కొనసాగుతున్నాయి : కలెక్టర్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ఖానాపూర్ మండలంలోని రాజుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటుకు సోమవారం కాంట్రాక్టర్ తాళం వేసిన ఘటనపై జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పాఠశాల తెరిపించింది.ప్రస్తుతం విద్యార్థులు యథావిధిగా తరగతులకు హాజరవుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి అనవసర పుకార్లు,అపోహలు వ్యాపిస్తున్నాయి.పుకార్లను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం ద్వారా గందరగోళం సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లా ప్రజలు, తల్లిదండ్రులు ఏవిధమైన భయాందోళన లేకుండా విద్యార్థులను పాఠశాలకు పంపాలని జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది.

## మంత్రి సీతక్కను కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/నిజాంసాగర్ :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నూతన ఇంచార్జీ మంత్రిగా నియమించబడిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దనసరి అనసూయ(సీతక్క)ను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతా రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పీఆర్ రోడ్లకు అదనపు నిధులు కేటాయించాలని, జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

## సిపిఐ పట్టణ కార్యదర్శిగా ఖలీందర్ అలీ ఖాన్



**ప్రజాపక్షం / మంచిర్యాల :** మంచిర్యాల పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ మహాసభ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాస్ మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు పెట్రేగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీ య జనతా పార్టీ పాలిత రాష్ట్రాల్లో కుల, మత హింస రోజురోజుకు పెరుగుతోందని విమర్శించారు. ఈ హింసకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఏకమై మ తోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సిపిఐ మంచిర్యాల పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యదర్శిగా కలిందర్ అలీ ఖాన్ ఎన్నికవ్వగా, సహాయ కార్యదర్శిగా చాడ మహేందర్ రెడ్డి ఎన్నికయ్యా రు. వీరితో పాటు కౌన్సిల్ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. ఈ నెల 21, 22 తేదీలలో జరగనున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఈ సం దర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో కుంచాల శంకర య్య, బియ్యాల రాజేశం, కనక లక్ష్మి , యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సొసైటీలతో రాజకీయం చేయొద్దు

ఎడపల్లి సొసైటీ చైర్మన్ మల్కారెడ్డి



**ప్రజాపక్షం/ఎడపల్లి :** రైతులకు సేవ చేసే సొసైటీలతో రాజకీయాలు చేయడం తగదని ఎడపల్లి సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి అన్నారు. సొసైటీల్లో యూరియా కొనుగోలుకు గుళికల మందును అంటగడుతున్నారనే ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గుళికల మందు కొంటేనే యూరియా ఇస్తున్నామనే ఆరోపణలు వాస్తవం కాదు. ఇది సొసైటీల నిర్ణయం కాదని పోల మల్కారెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయకపోవడమే దీనికి ప్రధాన కారణమన్నారు. యూరియా కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియాను కొనుగోలు చేస్తున్నామని, అయితే ఆ డీలర్లు గుళికల మందును యూరియాతో కలిపి ఇస్తున్నారని ఆయన తెలిపారు. అందుకే తాము రైతులకు తప్పనిసరిగా ఆ మందును అందచేయాల్సి వస్తుందని వివరించారు. బోధన్ ఎమ్మెల్యే సైతం రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని సూచించారని, కేంద్ర సరఫరా లేకపోవడంతోనే ప్రైవేట్ డీలర్ల వద్ద షరతులతో కూడిన యూరియా అమ్మకాలు జరుగుతున్నాయని మల్కారెడ్డి పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగించాలనే ఉద్దేశం తమకు లేదని పునరుద్ఘాటించారు. ప్రభుత్వ మార్క్‌ఫెడ్ సైతం ఇండెంట్ ప్రకారం సరఫరా చేసిన వాటిని రైతులకు విక్రయిస్తున్నామని తెలిపారు. దీనిని అడ్డం పెట్టుకొని బిజెపి నాయకులు సొసైటీలను వేదికగా చేసుకొని రైతులను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మల్కారెడ్డి ఆరోపించారు. తాము సొసైటీల్లో అక్రమాలకు పాల్పడినా, రైతులను ఇబ్బంది పెట్టినా బిజెపి నాయకులు ప్రశ్నించాలని సవాల్ విసిరారు. అయితే రైతులకు సేవ చేసే సొసైటీలపై అనవసర ఆరోపణలు చేసి ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించడం సరైన పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రెటరీ రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాపాడుకుందాం

ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ
రాష్ట్ర ప్రథమ మహాసభలను జయప్రదం చేయండి



**ప్రాజాపక్షం/బైంసా :** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) రాష్ట్ర మహా సభలు జూన్ 21,22 తేదీలలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించడం జరుగుతుంది. ఈ మహాసభలకు జిల్లాలో బీడీ కార్మికులు బీడీ ప్యాకర్స్, నెలసరి ఉద్యోగులు, గ్రామపంచాయతీ, మిషన్ భగీరథ, ఆటో, అంగన్వాడీ,అశ, మధ్యాహ్న భోజనం హమాలి,భవన,ఇతర నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ మహాసభలను విజయవంతం చేయాలని, బైంసా పట్టణ కేంద్రంలో గల బీడీ ఫ్యాక్టరీ ఆవరణలో వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న మాట్లాడుతూ కార్మికులను కట్టు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని కార్మికులకు కనీస వేతనం ఇరవై ఆరు వేలు ఇవ్వాలనీ కనీస పెన్షన్ తొమ్మిది వేలు,కార్మికులకు పిఎఫ్,ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలనీ డిమాండ్ చేశారు.నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా అమ్మడం కార్మిక హక్కులను కాలరాయడం,పని భద్రత,గ్యారంటీ లేని పరిస్థితుల్లో నేటి కార్మిక హక్కులు మనవి మనకు దక్కాలంటే నిత్య పోరాటం చేయాలని 21,22న నిజామాబాదులో జరుగు రాష్ట్ర మహాసభల్లో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని,పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న జిల్లా కార్యదర్శి ఆర్ రామ లక్ష్మ ణ్, రాములు దేవదాస్ లక్ష్మ ణ్ భోజన్న దేవదాస్,శంకర్,శేఖర్ సాయిలు,సత్యనారాయణ,లక్ష్మి ,ముత్తవ్వ,సునీత,గోదావరి,తదితరులు పాల్గొన్నారు.


# సింగరేణి కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి నిరంతర పోరాటం



**ప్రజాపక్షం / మందమర్రి :** సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఏకైక సంఘం ఎఐటియుసి మాత్రమేనని భీమనాథుని సుదర్శన్, కంది శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఏరియా వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శి ప్రభాకర్ శర్మ అధ్యక్షతన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏరియా వర్క్‌షాప్‌లో జరిగిన సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ వివేక్ వెంకటస్వామి గనులు, కార్మిక ఉపాధి శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆయనను శాలువాతో సన్మానించారని తెలిపారు. కార్మికుల చిరకాల డిమాండైన సొంతింటి కలనుత్మం చేయాలని, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలని సభాముఖంగా కోరినట్టు చెప్పారు. స్పందించిన మంత్రి, ముఖ్యమంత్రితో చర్చించి కార్మికుల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ విషయం పత్రికలు, మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో, ఐఎన్‌టియుసి నాయకులు గేటు మీటింగ్‌ల ద్వారా ఎఐటియుసిని విమర్శించడం దురుద్దేశపూరితమని, కార్మిక హక్కుల సాధన కోసం పోరాడుతున్న సంఘాన్ని నిందించడం తగదని సూచించారు. ఎఐటియుసి ప్రధాన లక్ష్యం సమస్యల పరిష్కారమేనని, స్ట్రక్చర్ సమావేశాల్లో కార్మిక సమస్యలను ప్రస్తావించి పరిష్కారం దిశగా అడుగులు వేస్తుంటామని, యాజమాన్యం మొండి వైఖరి కనబరిస్తే నిరసన కార్యక్రమాల ద్వారా సాధించడమే తమ విధానమని స్పష్టం చేశారు. అనవసర విమర్శలు చేస్తే అభాసుపాలవుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణికి బకాయిలుగా ఉన్న సుమారు 45 వేల కోట్ల రూపాయలను విడుదల చేసి, కార్మికుల స్వప్నమైన సొంతింటి కలను నెరవేర్చాలని, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, తోట వెంకటస్వామి, ఏరియా నాయకులు సోమిశెట్టి రాజేశం, ఎగేటి రాజేశ్వర్ రావు, పెద్దపల్లి బాణయ్య, తిరుపతి, పిట్ సెక్రటరీలు గాండ్ల సంపత్, మర్రి కుమార్, ఓదేలు, కాలువల శ్రీనివాస్, పారిపెల్లి రాజేశం, కన్నం వేణు, సేఫ్టీ కమిటీ సభ్యులు, వర్క్‌షాప్ కమిటీ సభ్యులు, వర్క్‌షాప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో పోలీసు స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** జిల్లా ఎస్పి పరితోష్ ఫంకజ్ మంగళవారం నాడు నారాయణ ఖేడ్, సిర్గాపూర్, కంగ్టీ, కల్హేర్, పోలీసు స్టేషన్లను ఆకస్మిక తనీఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఆవరణ బ్యారెక్, పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం స్టేషన్ రికారులను తనిఖీ చేస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమిత లిమిట్‌లో ఉండాలని లాంగ్ పెండింగ్ కేసుల చేధనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలన్నారు. ముఖ్యంగా మిస్సింగ్ ,కిడ్నాప్, కేసుల చేధనకు సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని డిఎస్‌సి సూచించారు. ప్రతి కేసులో నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేస్తూ బాధితులకు అండగా నిలవాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచనలు చేశారు. తమ పోలీసు స్టేషన్ పరిధిలో గల సస్పెక్ట్ కేడీ, రౌడీ షీటర్లను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తూ ఆన్లైన్‌లో అప్ డేట్ చేయాలన్నారు. సిబ్బంది ఆయా వర్టికల్ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను ముందు వరుసలలో ఉంచడానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన కంగ్టీ, నాగల్‌గిద్ద, సిర్గాపూర్, పోలీసు స్టేషన్ ప్రాంతాల నుండి ఏలాంటివి అక్రమ రవాణా జరగకుండా బార్డర్ చెక్ పోస్ట్‌లలో నిఘా కట్టుదిట్టం చేయాలని డిఎస్‌పి సూచించారు. సరిహద్దు ప్రాంతాలలో ,ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. నారాయణ్ ఖేడ్ వంటి రద్దీ ప్రాంతాలలో ట్రాపిక్ ఎన్ఫోర్స్‌మెంట్ లో భాగంగా ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహించాలని, అధిక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్ లుగా గుర్తించి సైన్ బోర్డులను ఏర్పాటు చేసే విధంగా చూడాలన్నారు. ఆన్లైన్ మోసాలు బెట్టింగ్ యాప్స్ ,రోడ్డు ప్రమాదాల నివారణకై ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని యస్.హెచ్‌ఓలకు సూచనలు చేశారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ సిబ్బంది అధికారులు 24''7 పోస్టింగ్ హెడ్ క్వార్టర్ నందు ప్రజలకు అందుబాటులో ఉండాలని సదూర ప్రాంతాల నుండి ప్రయాణాలు ప్రమాదానికి దారి తీయవచ్చని అన్నారు. సిబ్బంది వాహనాలు నడిపేటప్పుడు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్, ధరించాలన్నారు. విధి నిర్వహణలో పూర్తి నిబద్ధతతో ఉండాలని అధికారులకు సిబ్బందికి సూచనలు చేశారు. ఈ తనిఖీలో ఎస్పి వెంబడి నారాయణఖేడ్, డిఎస్పి వెంకట్ రెడ్డి,నారాయణఖేడ్, సిఐ శ్రీనివాస్ రెడ్డి ,కంగ్టీ సిఐ చంద్రశేఖర్, నారాయణ ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్, రెడ్డి కంగ్టీ, ఎస్ఐ దుర్గారెడ్డి, సిర్గాపూర్, ఎస్‌హెచ్‌ఓ వెంకట్ రెడ్డి, కల్హేర్ ఎస్ఐ వెంకటేశం తదితరులున్నారు.

## భూభారతి కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్‌డిఒ మహిపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న భూభారతి కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులలో దరఖాస్తుదారులు భూ సమస్యలను పరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని నర్సాపూర్ ఆర్‌డిఒ మహిపాల్ రెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆయన మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మహిపాల్ భూభారతి కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి విధివిధానాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అపరిసృతంగా ఉన్న భూ సమస్యలు కూడా కార్యక్రమంలో తప్పకుండా పరిష్కారం అవుతాయని ఆర్‌డిఒ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ అన్నారు. శివ్వంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సంస్థల గురించి డిప్యూటీ తహసిల్దార్ షఫీ యుద్దీన్ ను అడిగి తెలుసుకుని భూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు ధరణి కార్యక్రమంలో పరిష్కారం గాని భూ సమస్యలు ప్రస్తుతం భూభారతి కార్యక్రమం లో పరిష్కారం తప్పకుండా అవుతాయని ఆయన సూచించారు. సదస్సులను గ్రామాల్లోని ప్రజలు సద్విని చేసుకొని రెవిన్యూ పరమైన వారి సమస్యలు ఉంటే పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ షఫీ యుద్దీన్, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు టిజిఎండిసి ద్వారా ఇసుక సేకరణ

జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** జిల్లాలో ప్రభుత్వం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులలో ఉపయోగించే ఇసుకను టిజిఎండిసి ద్వారా సేకరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఖనిజ, గనుల శాఖ, నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ప్రభుత్వం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులకు తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా ఇసుక సేకరణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టే ప్రభుత్వ అభివృద్ధి పనులు నీటిపారుదల శాఖల ప్రాజెక్టుల నిర్మాణం, భవన నిర్మాణాలు, వంతెనలు కాలువలు, రహదారులు, సింగరేణి, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనులకు ఉపయోగించే ఇసుకను తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా సేకరించాలని తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే పనులకు అవసరమయ్యే ఇసుక కొరకు ఆన్ లైన్ ద్వారా ఇండెంట్లు సమర్పించాలని, జీరో పర్మిట్ ద్వారా క్వారీల నుండి మెటల్ తరలించాలని, జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఎడి గంగాధర్ రావు, (టిజిఎండిసి) పిఓ. రవీందర్, రోడ్లు భవనాల శాఖ అధికారి సురేందర్, పంచాయితీ రాజ్ ఇఇ ప్రభాకర్, నీటిపారుదల శాఖ ఇఇ లు గుణవంత్ రావు, ప్రభాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలి



**ప్రజాపక్షం / వాంకిడి :** రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విత్తనాలు, ఎరువులను విక్రయించాలని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. మంగళవారం వాంకిడి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని నిల్వలు, రసీదు పుస్తకం, రిజిస్టర్లు, ఎరువుల గోదామును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం గుర్తించిన విత్తనాలు, ఎరువులను నిర్దేశించిన ధరలకు మాత్రమే రైతులకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణం ఎదుట ధరల పట్టిక, దుకాణంలోని నిల్వల వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. రైతులకు విక్రయించినప్పుడు రసీదు తప్పనిసరిగా జారీ చేయాలని, రైతులు కూడా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రసీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాంకిడి తహసీల్దార్ డి. కవిత, వ్యవసాయ అధికారి మిలింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు పటిష్ఠమైన నిఘా ఏర్పాటు



**ప్రజాపక్షం/ఎడపల్లి :** జిల్లాలో గంజాయి నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామని, యువత గంజాయి మత్తుకు అలవాటు కాకుండా చూడాలని సీపీ సాయి ఛైతన్య పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి. సాయి చైతన్య మంగళవారం రెంజల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించి, పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ కమీషనర్ స్టేషన్‌లోని రిసెప్షన్ సెంటర్, కంప్యూటర్ విభాగాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే 5sవిధానం అమలు తీరును పరిశీలించారు. వాహనాల పార్కింగ్ వ్యవస్థను కూడా ఆయన పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమీషనర్ సిబ్బందికి సూచనలు చేశారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని ఆయన చెప్పారు. గంజాయి నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, గంజాయికి బానిసలైన వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. సైబర్ మోసగాళ్ల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని కమీషనర్ సూచించారు. ఈ పర్యవేక్షణలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, రెంజల్ ఎస్ఐ చంద్ర మోహన్‌తో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఏలేటి శంకుస్థాపన

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ రూరల్ మండలంలోని కౌట్ల కె గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు బిజెఎల్‌పి నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ గౌడ్, జామాల్, మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ర్సారెడ్డి,శ్రీను,బాపురావు,శ్రీనివాస్ గౌడ్,ముత్యం,శ్యాంరెడ్డి,ధర్మన్న,రాజేశ్వర్,అశ్వ త్థామ,ముత్యం, రమేష్, సాయేందర్,విడిసి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ..


నిర్మల్ రూరల్ మండలంలోని తాంశ గ్రామంలో ఏస్సీ కాలనీలో రూ.40 లక్షల నిధులతో నూతనన సీసీ రోడ్లు డ్రైనేజ్ ల నిర్మాణ పనులకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి,భూమి పూజ చేసారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి,నాయకులు సత్యనారాయణ గౌడ్, జామాల్, మండల అధ్యక్షుడు వెంకట్ రెడ్డి,నర్సారెడ్డి,శ్రీను,బాపురావు,శ్రీనివాస్ గౌడ్,ముత్యం,శ్యాంరెడ్డి,ధర్మన్న,రాజేశ్వర్,అశ్వత్థామ, ముత్యం, రమేష్, సాయేందర్, విడిసి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆయిల్ పామ్ సాగుకు అన్ని విధాలా ప్రోత్సాహం

కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి





**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** గణనీయమైన దిగుబడితో అధిక లాభాలను అందించే ఆయిల్‌పామ్ పంట సాగు కోసం ఆదర్శ రైతులు ముందుకు రావాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్ నేతృత్వంలో ఉద్యానవనశాఖ అధికారులు మంగళవారం మండలంలోని చేపూర్‌లోని ఆయిల్‌పామ్ నర్సరీని సందర్శించారు. పంపిణీకి సిద్ధంగా ఉన్న లక్షన్నర ఆయిల్ పామ్ మొక్కలను పరిశీలించి క్షేత్రస్థాయి పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా రైతులకు ఆయిల్‌పామ్ పంట సాగు చేపట్టాల్సిన అవశ్యకతపై నొక్కి చెప్పారు. ఈ పంట సాగుతో కలిగే లాభాలపై ప్రతి రైతు తెలుసుకోవాలని సూచించారు. వంట నూనె తయారీతో పాటు ఇతర అనేక ఉత్పత్తుల్లో వినియోగించే ఆయిల్‌పామ్ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. దేశవ్యాప్తంగా స్థానిక ప్రజల అవసరాలకనుగుణంగా 75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరగాల్సి ఉండగా ప్రస్తుతం కేవలం పది శాతం విస్తీర్ణంలోపే ఈ పంట సాగు చేస్తున్నారన్నారు. దీంతో ఇతర దేశాల నుండి వంటనూనె నిల్వలను పెద్ద ఎత్తున దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. స్థానికంగానే ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే రైతులు అధిక లాభాలు ఆర్జించటంతో పాటు దేశానికి కూడా మేలు చేసిన వారవుతారన్నారు. ఆయిల్ పామ్ పంట సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు.

ఈ పంట సాగు చేస్తున్న రైతులకు ఇన్ ఫుట్ సబ్సిడీని రైతు ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలకు అయ్యే వ్యయంతో కూడా అధిక మొత్తా న్ని ప్రభుత్వమే భరిస్తూ సబ్సిడీ రూపంలో కంపెనీలకు చెల్లిస్తుందన్నారు. ఆయిల్ పామ్ బోర్డు ఉన్నందున పంట అమ్మకం, ధర విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. మొక్కలు అందించిన కంపెనీలే బోర్డు ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేస్తాయని తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను సైతం పొందవచ్చని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఈ పంటకు ఉన్న డిమాండ్‌ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రెండు లక్షల రూపాయలకు పైగా ఆదాయం ఆర్జించే అవకాశాలున్నాయన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు ముందుకొచ్చే రైతులకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాలుగా తోడ్పాటు నందిస్తామన్నారు. ప్రభుత్వ తోడ్పాటును జిల్లా రైతాంగం అందిపుచ్చుకుని ఆయిల్ పామ్ సాగు ద్వారా ఇతోధికంగా లాభాలు సాధించాలని కలెక్టర్ హితవు పలికారు.

# రీల్

## పది గంటల పని అసాధ్యమేమీ కాదు



### ఆసక్తికర కామెంట్స్ చేసిన జెనీలియా

దీపికా పదుకొణే, సందీప్ రెడ్డి వంగాల మధ్య జరిగిన కోల్డ్ వార్ గురించి మనందరికి తెలిసిందే. ప్రభాస్ నటిస్తున్నస్పిరిట్ కోసం దీపికాని కథానాయికగా ఎంపిక్ చేయగా, ఆమె పెట్టిన డిమాండ్ల వలన సందీప్ తన ప్రాజెక్ట్ నుండి దీపికాని తప్పించి యానిమల్ హీరోయిన్ తృప్తి డిమ్రీని ఎంపిక చేశాడు. అయితే దీపికా పనివేళలతో పాటు రూ.25 కోట్ల పారితోషికం డిమాండ చేయడం వల్లనే ఆమెని తప్పించారనే ప్రచారం నడిచింది. దీపికా పెట్టిన కండీషన్స్ విషయంలో ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికర చర్చ నడుస్తుంది. దీనిని కొందరు సపోర్ట్ చేస్తుండగా, మరి కొందరు వ్యతిరేఖిస్తున్నారు. ఆ మధ్య 'భజరంగీ భాయిజాన్', 'చందూ ఛాంపియన్' తదితర హిట్ సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు కబీర్ ఖాన్.. దీపికా చేసిన డిమాండ్లు అసాధారణం కావని, న్యాయంగానే ఉన్నాయని వ్యాఖ్యానించారు. చిత్ర పరిశ్రమలో పని చేసే వారందరు కూడా వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం కూడా చూసుకోవాలి. స్టార్ హీరోలైన ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్ కూడా రోజుకు 8 గంటల షిఫ్ట్ల్లోనే పని చేస్తారు. అలాంటప్పుడు దీపికా చెప్పిన పని గంటల విషయంలో విమర్శలు ఎందుకు చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదంటూ ఆమెకి సపోర్ట్గా నిలిచాడు. ఇక సుదీర్ఘ పని గంటల విషయంపై తాజాగా జెనీలియా స్పందించింది. 'సితారే జమీన్ పర్' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ మూవీ ప్రమోషన్‌లో భాగంగా జెనీలియా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, పనిచేసే తల్లులకు ఎక్కువ సమయం పని చేయడం కష్టమే అయినా అసాధ్యం ఏమి కాదు. నేను రోజుకు 10 గంటలు పనిచేస్తాను. కొన్నిసార్లు దర్శకుడు పనిని 11 లేదా 12 గంటల వరకు పొడిగించమని అడిగినప్పుడు నేను దానిని వ్యతిరేఖించను. అయితే సర్దుబాట్లు చేసుకోవడానికి కొంత సమయం అవసరం అవుతుంది. ఒకటి రెండు రోజులు పని చేయాల్సి వచ్చినప్పుడు కాస్త అవగాహనతో పూర్తి చేసుకోవచ్చు అని పేర్కొంది. ఇప్పుడు జెనీలియా చేసిన కామెంట్స్ వైరల్‌గా మారాయి.

## 'భూ అంటూ భూతం..' పాట రిలీజ్




శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న తమ్ముడు. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో లయ, వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూలై 4న 'తమ్ముడు' సినిమా ప్రపంచం వ్యాప్తంగా రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా నుంచి 'భూ అంటూ భూతం..' అనే పాటను రిలీజ్ చేశారు. మేనకోడలు బేబి దిత్యకు మేనమామ నితిన్ ధైర్యం చెప్పే సందర్భంలో ఈ పాటను చిత్రీకరించారు. 'భూ అంటూ భూతం..' పాటను అజనీష్ లోకనాథ్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేయగా, అనురాగ్ కులకర్ణి, అక్షిత పోల ఆకట్టుకునేలా పాడారు. సింహాచలం మన్నేలా లిరిక్స్ రాశారు. ఈ సినిమా కు సినిమాటోగ్రఫీ మ కేవీ గుహన్, ఎడిటింగ్ ప్రవీణ్ పూడి, అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు.

## రజనీకాంత్ ఆశీర్వాదం తీసుకున్న విష్ణు



మంచు విష్ణు టైటిల్ పాత్రను పోషించిన సినిమా కన్నప్ప. నెలాఖరులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన సూపర్ స్టార్ రజనీకాంత్ ఆశీర్వాదం తీసుకున్నారు. మంచు మోహన్ బాబు, విష్ణు ఇద్దరు కలిసి రజనీకాంత్ దగ్గర కు వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. కన్నప్ప సినిమా పెద్ద హిట్ కావాలని రజనీకాంత్ ఆకాంక్షించారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో కనిపిస్తారు. ప్రభాస్ నటించిన సన్నివేశాలు అరగంటకు పైగా ఉన్నాయి.

## రవితేజ న్యూ లుక్ రిలీజ్

ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై రవితేజ హీరోగా కిషోర్ తిరుమల దర్శకుడిగా చెరుకూరి సుధాకర్ నిర్మిస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. రవితేజ 76వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం హైదరాబాద్ శివారు ప్రాంతంలో భారీ సెట్ వేశారు. ఈ సెట్‌లోనే సినిమాలోని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. కామెడీ, యాక్షన్ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ డ్రామాగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రవితేజకు ధమాకా సినిమాలో సంగీతం అందించిన భీమ్స్ ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. భీమ్స్ ఇటీవల ఉత్తమ సంగీత దర్శకుడిగా తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. ప్రసాద్ మూరెళ్ళ సినిమాటోగ్రాఫర్‌గా, శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్ గా పని చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత చెరుకూరి సుధాకర్ తెలిపారు.



## పూరి కొత్త సినిమాలో సంయుక్త




తెలుగు సినిమా ఇండస్ట్రీలో తనకంటూ డైరెక్టర్‌గా ఓ సెపరేట్ శైలీని క్రియేట్ చేసుకున్న దర్శకుడు పూరి జగన్నాథ్. సూపర్ డూపర్ హిట్ సినిమాలు తీసిన పూరి అదే స్థాయిలో డిజాస్టర్ ఫ్లాపులు కూడా తీశాడు. కాని తన దైన శైలిలో రాజీ పడకుండా సినిమాలు తీస్తూనే ఉన్నారు. తమిళ, తెలుగు మార్కెట్‌లో మంచి పేరు సంపాదించుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతితో పూరి జగన్నాథ్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ సేతుపతి సరసన సంయుక్త ను హీరోయిన్‌గా ఎంపిక చేశారు. టబూ ఇందులో కీలక పాత్ర పోషిస్తోంది. పూరి కనెక్ట్ బ్యానర్ పై హీరోయిన్ చార్మి తో కలిసి పూరి జగన్నాథ్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది.



## 'ఓభామ అయ్యో రామా' జూలై 11న విడుదల

సుహాస్ హీరోగా, మాళవిక హీరోయిన్‌గా తెరకెక్కుతున్న వైవిధ్యమైన ప్రేమకథా చిత్రం ఓ భామ అయ్యో రామా సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. వైవిధ్యమైన కథలతో ప్రత్యేకతను చాటుకుంటున్న సుహాస్ ఇప్పుడు కూడా ఓ వెరైటీ ప్రేమ కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను జూలై 11వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వివి ఆర్ట్ ఫిలింస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ హరీష్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్యా మ్యూజిక్ ద్వారా ఈ సినిమా పాటలు రిలీజ్ చేయనున్నారు.

## త్రినాథ రావు- హవిష్ కాంబినేషన్‌లో కొత్త సినిమా



నువ్విలా, జీనియస్, రామ్ లీలా, సెవెన్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో హవీష్, హీరోగా సినిమా చూపిస్త మావ, నేను లోకల్, ధమాకా, మజాక వంటి సూపర్ హిట్ చిత్రాల దర్శకుడు నక్కిన త్రినాథరావు కాంబినేషన్ లో రూపొందుతున్న సినిమా షూటింగ్ రెగ్యులర్ గా సాగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ ను ఈ నెల 19న రిలీజ్ చేయబోతున్నారు. నిఖిల కోనేరు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఓ డిఫరెంట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు . నిజార్ షఫీ సినిమాటోగ్రాఫర్ గా పనిచేస్తున్నారు. తొలి షెడ్యూల్ ఇటీవలే పూర్తయింది. హార్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి బ్యానర్ పై ఈ సినిమా నిర్మిస్తున్నారు.

## రాజా సాబ్ టీజర్ విడుదల

రాజా సాబ్ టీజర్ విడుదల రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి దర్శకత్వంలో ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ 'రాజా సాబ్'. ఈ చిత్రంలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. 'రాజా సాబ్' సినిమా డిసెంబర్ 5న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ రాబోతోంది. సోమవారం హైదరాబాద్ లో ఐమ్యాక్స్‌లో టీజర్ విడుదల చేశారు.





## కేంద్రం కుల గణన చేయకపోతే యుద్ధం చేస్తాం

### టిపిసిసి హనుమంతరావు

**ప్రజాపక్షం / హైదరాబాద్:** జన గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నదే తప్ప కుల గణన ప్రస్తావన చేయడంలేదని, కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని మాజీ ఎంపి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు అన్నారు. జన గణనతో సామాన్యులకు ఒరిగేదేమీ లేదన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాహుల్, రేవంత్ రెడ్డి అగ్రకులానికి చెందిన వారైనప్పటికీ బిసిల కోసం ఆలోచిస్తున్నారని, బిసి అని చెప్పుకునే ప్రధాని మోదీ మాత్రం బిసిల కోసం ఆలోచించడం లేదన్నారు. జన గణన వల్ల బిజెపికి లాభం తప్పా బిసిలకు లాభం లేదన్నారు. కుల గణన కోసం అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడాలని ఆయన కోరారు.

## బనకచర్లతో ఎగువ రాష్ట్రాలకు నష్టం లేదు

### ఎపి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు



**అమరావతి :** వృథాగా సముద్రంలోకి పోయే వరద నీటిని మాత్రమే పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు తరలిస్తామని, దీని వల్ల ఎగువ రాష్ట్రాలకు ఎటువంటి నష్టం లేదని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో మంగళ వారం ఆయన ఈ ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ గోదావరి నదికి విభజిత ఆంధ్రప్రదేశ్ చివరి రాష్ట్రమన్నారు. ఏటా గోదావరి నుంచి 3వేల టిఎంసిలు వృథాగా సముద్రంలోకి పోతున్నాయని చెప్పారు. ప్రపంచంలోనే అత్యధికంగా ఒకేసారి 50లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించే అవకాశం వున్న నది గోదావరి మాత్ర మేనని పేర్కొన్నారు. పోలవరం వద్ద లభ్యమయ్యే గోదావరి వరద జలాలను మాత్రమే వాడుకుంటామని తెలిపారు. ఎక్కడా నికర జలాలను వాడడం లేదని వివరించారు. గోదావరి, కృష్ణ బోర్డుల అనుమతి లేకుండా గత కెసిఆర్ ప్రభుత్వం ప్రాజెక్టులు చేపట్ట లేదా అని ప్రశ్నించారు. ఎపి పునర్విభజన చట్టానికి విరుద్ధంగా కట్టిన ఆ ప్రాజెక్టులకు ఇప్పటికీ అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేదన్నది నిజం కాదా అని నిలదీశారు. అనుమతులు లేని చాలా ప్రాజెక్టులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టడం లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం సీతారామ ప్రాజెక్టు, పాలమూరు, రంగారెడ్డి, సమ్మక్క బ్యారేజ్ మొదలైన ప్రాజెక్టులను అను మతులు లేకుండా కడుతున్నారని ఆరోపించారు. గత 50 సంవత్సరాలలో, గోదావరి నది నుండి ఏటా సరాసరి 3వేల టిఎంసిల వరద నీరు సముద్రంలో కలుస్తుందన్నారు.

**మూడు సెగ్మెంట్లుగా ప్రాజెక్ట్ :** సెగ్మెంట్ 1లో పోలవరం నుండి ప్రకాశం బ్యారేజీకి తరలింపు, సెగ్మెంట్ 2లో ప్రకాశం బ్యారేజీ నుండి 173 టీఎంసీల సామర్థ్యం ఉన్న బొల్లాపల్లి రిజర్వాయరును 6 లిఫ్టుల ద్వారా నింపడం, సెగ్మెంట్ 3లో బొల్లాపల్లి రిజర్వాయర్ నుండి 3 లిఫ్టులు, 2 టన్నెల్స్ ద్వారా బనకచర్లకు తరలింపు చేస్తామన్నారు. ఇందులో 200 టిఎంసిలు మాత్రమే రోజుకి 2.00 టిఎంసిల చొప్పున బనకచర్లకు తరలించి రాయలసీమకు వినియోగించే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించబడిందని అన్నారు. బొల్లాపల్లి కత్రిమ జలాశయం కాదని కొండల మధ్య సహజ సిద్ధంగా ఉన్న అమరిక, రిజర్వాయరు నిర్మాణానికి అనుకూలమన్నారు.

తెలంగాణ ప్రాజెక్టులకు అప్పుడు ఇప్పుడు సిఎం చంద్రబాబు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణలో తగిన మదింపు లేకుండా ఎగువన ప్రాజెక్టులు కడితే నష్టపోయేది ఎపి రైతులేనన్నారు. దిగువ పరివాహక ప్రాంతాల ప్రత్యేక హక్కులు మాత్రమే చంద్రబాబు మాట్లాడారని పేర్కొన్నారు. అంతే తప్ప తెలంగాణ ప్రాజెక్టులను ఆపాలనే ప్రయత్నం కాదన్నారు. గతంలో సీతమ్మ బ్యారేజీ, సీతారాం సాగర్ లిఫ్టును కూడా తాము వ్యతిరేకించ లేదన్నారు. గోదావరి నుంచి ఇతర రివర్ బేసిన్ లకునీటిని తరలించే హక్కు చట్టం ప్రకారం తమకు ఉందని స్పష్టం చేశారు. ఆ చట్టం ప్రకారమే తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారని, ఏపీలోనూ తాము బనకచర్ల ప్రాజెక్టును చేపడుతున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.

## తొలిగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి



**ప్రజాపక్షం /హైదరాబాద్:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కళాశాలలో అకారణంగా తొలగించిన 2500 మంది పార్ట్ టైమ్ పురుష ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం విధుల్లోకి తీసుకునే విధంగా చొరవ తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావుకు రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల పార్ట్ టైమ్ ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగుల సంఘం ప్రతినిధి బృందం మంగళవారం హైదరాబాద్‌లో కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా బి.విజయసారధిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలలో 2500లకు పైగా ఉన్న ఉద్యోగులంతా పేద పిల్లల విద్య కోసం గత 15 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో రాత్రింబవళ్లు విధులను నిర్వహిస్తున్నారని, ఈ ఏడాది నుండి బాలికల పాఠశాలలలో పురుషులు ఎవరు కూడా పనిచేయరాదనే అనాలోచిత నిబంధనలతో వారందరినీ విధుల నుంచి తొలగించారని వివరించారు. ఏ గురుకులంలో ఇలాంటి నిబంధనలు లేవని, కేవలం సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో మాత్రమే ఈ విధమైన నిబంధనలతో తమ జీవితాలను వీధి పాలు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కూనంనేని సాంబశివరావును వారు కోరారు. కూనంనేని సాంబశివరావును కలిసిన ప్రతినిధి బృందంలో సంఘం నాయకులు ఈశ్వరయ్య, వెంకటస్వామి, ఉప్పలయ్య, వెంకటరెడ్డి, ప్రసాద్, సురేష్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

## తెగదెంపులు చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

సమైక్యంగా ఇచ్చిన ఈ సందేశాన్ని తక్షణం అమలు చేయాలని వక్తలు కోరారు. గాజాలో అంతులేకుండా కొనసాగుతున్న సామూహిక హత్యాకాండను తక్షణం ఆపాలని, ఇజ్రాయెల్ తన దురాక్రమణ కట్టిపెట్టాలని, పాలస్తీనాను సైనిక చెర నుండి విముక్తి చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ ఎస్ పి కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.ఎస్.దాగర్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకుడు హరిశంకర్, సిజిపిఐ ఢిల్లీ నాయకుడు బిర్జూ నాయక్, సిపిఐ ఢిల్లీ రాష్ట్రసమితి కార్యదర్శి దినేశ్ వర్ష్ణి, సిపిఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనా, సిపిఐ(ఎంఎల్) నాయకుడు బాలాజీ కూడా ప్రదర్శనను ఉద్దేశించి ప్రసంగించారు. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం నుండి పల్లబ్ సేన్ గుప్తా (ప్రపంచ శాంతి మండలి అధ్యక్షుడు కూడా), సయ్యద్ అజీజ్ పాషా, రామకృష్ణ పాండా, అన్నీరాజా ప్రదర్శనలో పాల్గొన్నారు. సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో నుండి నీలోత్పల్ బసు, అరుణ్‌కుమార్, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకయ్య, ఎన్ఎఫ్ఐడబ్ల్యు అధ్యక్షురాలు సయేదా హమీద్ పాల్గొన్నారు. వారితోపాటు ప్రొఫెసర్ అజయ్ పట్నాయక్, నందితా నరైన్ లతోపాటు విద్యావేత్తలు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.




## నిలువు దోపిడీ

(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారంగా మారడంతో చదువులు ఖరీదైపోయాయి. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల వారిదే రాజ్యమైపోయింది. ప్రైవేటు విద్యాసంస్థలు నేరుగా పుస్తకాలు అమ్మడంతో పాటు నోటు బుక్స్, స్కూల్ పేర్లతో ఉండే బ్యాగులు సైతం విక్రయిస్తున్నారు. అవసరం లేని కొన్ని రకాల పుస్తకాలను వేలాది రూపాయలు పెట్టి కొనిపిస్తున్నారు. ఇదిలా ఉండగా కార్పోరేట్ పాఠశాలలు అడ్మిషన్ల పేరుతో భారీ మొత్తాల్లో వసూళ్లు చేస్తున్నారు. ఎల్‌కేజి విద్యార్థిని చేర్పించాలంటే అడ్మీషన్ ఫీజు వేళల్లోనే ఏడాది ఫీజు రూ.25 వేల పైమాటే. ఎల్‌కేజి, యుకేజి పిల్లలకే రూ.20నుండి 30వేలు వసూళ్లు చేసే ప్రైవేటు విద్యాసంస్థలున్నాయి. ఇదిలా ఉండగా 1 నుండి 5 తరగతులకు రూ.30 వేలు ఆపైన, 6 నుండి 8 తరగతుల వారికి రూ.40 వేలు ఆ పైన, 9,10 తరగతుల వారికి సుమారు రూ.50 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు పుస్తకాలు, యూనిఫాం, తదితరాలు కలిపి తడిసిమోపెడవుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక మెటీరియల్ పేరిట వేలాది రూపాయాలు కాజేస్తున్నారు. వారు అందించే మెటీరీయల్ కేవలం రూ.3 నుండి 4వేలు కూడా అండవని, వాటి పేరుతో అధిక మొత్తంలో గుంజుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

### అర్హత లేని టీచర్లు

చాలాప్రైవేటు స్కూళ్లలో అర్హతలేని ఉపాధ్యాయులతో చదువులు చెప్పిస్తున్నారు. పిల్లలకు విద్యాబోధన చేయాలంటే డిఇడి, బిఇడి తప్పకుండా చేసి ఉండాలి. కానీ చాలా వరకు ప్రైవేటు స్కూళ్లలో ఇంటర్, డిగ్రీ చదివిన వారితో మమా అనిపిస్తున్నారు. ర్యాంకుల కోసం ప్రైవేటు స్కూళ్ల వారు బట్టీ పట్టే విధానానికి తెరలేపడంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. విద్యాశాఖకు ఉపాధ్యాయులు జాబితా సమర్పించే సమయంలో అందరూ అర్హులైన వారే ఉన్నారంటూ చెప్పుకుంటున్నారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్లకు ఆట స్థలాలే లేవంటే అతిశయోక్తి కాదు. పిల్లకు చదువులతో పాటు ఆటపాటలను సైతం నేర్పించాల్సి న అవసరం ఉందని విద్యాహక్కు చట్టం మొత్తుకుంటోంది. అయినప్పటికీ సరైన ఆటస్థలాలు లేక పిల్లలు ఆడుకునే పరిస్థితి లేదు.

### ముడుపులు మోత

ప్రైవేటు స్కూళ్లను ప్రతీ ఏటా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు కోసం సంబంధిత ప్రైవేటు పాఠశాలల వారు ఆయా మండలాల పరిధిలో విద్యాధికారికి ఫైల్ సమర్పిస్తారు. ఆదే సమయంలో బరువైన ఒక కవర్ కూడా సమర్పిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమర్పించిన ఫైల్‌లో వారు క్రూడీకరించిన అన్ని అంశాలు ఉన్నాయా లేదా, విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని వసతులు ఏర్పాటు చేశారా, విద్యార్థుల రక్షణకు, వారి మానసిక వికాసానికి బడుల్లో జాగ్రత్తలు ఏంటీ. చదువులో ఒక భాగమైన ఆటలు ఆడించేందుకు మైధానాలు ఉన్నాయా, బోధన చేసే సిబ్బంది చట్టపరంగా అర్హులా కాదా ఆనేదానిని ఒకటికి పది సార్లు సరిచూసుకుని,క్షేత్రస్థాయికి స్వీయ పరిశీలన చేయాలి. కానీ కార్యాలయాల్లో కూర్చుని సంతకాలు పెట్టేసి అనుమతిని మంజూరీ చేస్తున్నారు. దీనిని బట్టి చూస్తే విద్యాధికారులు సైతం విద్యావ్యవస్థను నాశనం చేసే దిశలోనే పయణిస్తున్నట్లు తేటతెల్లమవుతోంది. బడులు తెరిస్తే విద్యార్థుల తల్లిదండ్రులకే ఆర్థిక భారం తప్పా, ఇటు ప్రైవేటు యాజమాన్యాలకు, ఇటు అనుమతులు ఇచ్చే వారికి కాసుల పంటే అంటూ పుకార్లు వినవస్తున్నాయి.

## నిజమైన ముగింపు కావాలి

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి నిజమైన ముగింపును తాను కోరుకుంటున్నానని చెప్పారు. ఇరాన్‌తో సంభాషణలకు ఇష్టపడటంలేదన్నారు. టెహ్రాన్‌లో తమ విద్యార్థులకు, పౌరులకు రక్షణ కరువైందంటూ చైనా,భారత్‌లు వారిని దేశం వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళమని కోరుతున్నాయి. కానీ ట్రంప్ ఇలాంటి ప్రత్యేక కారణమేదీ చెప్పకుండా అందరూ టెహ్రాన్ వదిలివెళ్ళిపోవాలంటూ ఆన్‌లైన్‌లె పోస్టింగ్ పెట్టారు. మధ్యప్రాచ్యంలో పరిస్థితులు విషమిస్తున్నందువల్లనే ట్రంప్ కెనడా జి–7 సదస్సు పర్యటనను కుదించుకున్నారని అమెరికా మీడియా ప్రకటించింది. ''నేను సంతకం పెట్టమన్న ఒప్పందంపై ఇరాన్ సంతకం పెట్టి ఉంటే బాగుండేది, కానీ ఇరాన్ అలా చేయలేదు, సమ్మతించలేదు, ఇప్పుడు ఇరాన్‌తో సంప్రదింపులు చేయడానికి నాకు ''మూడ్'' లేదు, ఏ విధంగా చూసినా ఇరాన్‌తో సంప్రదింపులకు అందుబాటులో ఉండలేను '' అని ట్రంప్ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. అదేసమయంలో ఆయన మరో విషయం కూడా చెప్పారు. ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చితో సంప్రదింపులు చేయడానికి, ఒప్పందంపై ఒప్పించేందుకు మధ్యప్రాచ్యానికి తన ప్రత్యేకదూత విట్‌కాఫ్, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్‌లను పంపించాలని ఆలోచిస్తున్నానని పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదు, నేను పదే పదే ఈ విషయం ఇరాన్‌కు చెప్పాను'' అని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మధ్యప్రాచ్యంలో పరిస్థితులపై ట్రంప్‌తోపాటు జాతీయ భద్రతా అధికారితో సమీక్షించేందుకు అమెరికా రక్షణమంత్రి పీటర్ హెగ్సెత్ సిట్యుయేషన్ రూమ్‌కు వెళ్ళారు. గడచిన ఆదివారం అంటే జూన్ 15వ తేదీన మస్కట్‌లో నిర్ణీత ప్రకారం అమెరికా–ఇరాన్ మధ్య అణుఒప్పందానికి సంబంధించి ఆరో విడత పరోక్ష చర్చలు జరగాల్సి ఉండగా, దీనికి 48 గంటలు ముందే ఇరాన్‌పై ఇజ్రాయెల్ మెరుపు దాడులు చేయడంతో చర్చలు రద్దయ్యాయి.

### ఖమేనీని చంపాలన్న నేతన్యాహూ ప్రకటనే కారణమా?

ఇరాన్ సర్వాధినేత ఆయెతుల్లా అలీ ఖమేనీని హత్యచేసినప్పుడే శాంతి ఏర్పడుతుందని, యుద్ధం ఆగిపోతుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూ ఎబిసి న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన విషయం సంచలనాత్మకంగా మారింది. ''మేం ఇరాన్‌లో యుద్ధాన్ని పెద్దదిచేసి విస్తరించడంలేదు, మేం ఇరాన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు వెళుతున్నాం'' అని నేతన్యాహూ ప్రకటన తర్వాత ట్రంప్ హుటాహుటిన జి–7 సదస్సును వదిలిపెట్టి వాషింగ్టన్‌కు చేరుకున్నారు. ఖమేనీని హతమార్చేందుకు నేతన్యాహూ చేసిన ప్రణాళికను ట్రంప్ తిరస్కరించారని, దీనివల్ల యుద్ధం మరింత తీవ్ర ప్రమాదస్థితికి చేరుతుందని ట్రంప్ వ్యతిరేకత వ్యక్తం చేశారనీ వార్తలు వెలువడ్డాయి. మరోవైపు ఖమేనీ కూడా అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్ళారని పాశ్చాత్యమీడియా ప్రకటించింది. ఐతే ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఒక ప్రకటన చేస్తూ ట్రంప్ జి–7 నుండి బయలుదేరి వెళ్ళేటప్పుడు ఇరాన్ యుద్ధ పరిష్కారం గురించి సానుకూల సంకేతాలిచ్చారన్నారు. నిజంగా అలా జరిగితే ఒక ఒప్పందం కుదిరితే అదెంతో మంచి విషయమన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com